సనాతన సారథి

సెప్టెంబరు 2019

'గురువందనము'

ఆషాఢి ఉత్సవం

రష్యన్ భక్తుల సంగీత విభావరి

అంతర్జాతీయ 'లీడర్‌షిప్ ప్రోగ్రామ్' స్నాతకోత్సవం

భగవాన్ సన్నిధిలో గురుపూర్ణిమ వేడుకలు (2019 జులై 12-16)

సనాతన సారథి

సత్య, ధర్మ, శాంతి, ప్రేమలద్వారా మానవజాతి సామాజిక,
నైతిక, ఆధ్యాత్మిక అభివృద్ధికి అర్పితము

సంపుటము 62
సంచిక 9

సెప్టెంబరు 2019

ప్రచురణ తేదీ
ఆగస్టు 23

1.	**రామకథారస వాహిని** (ధారావాహికం)	భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారు	4
2.	**వినాయక చవితి సందేశం**	శ్రీ సత్యసాయి ప్రబోధ మాధురి	7
3.	**దొరకునా ఇటువంటి సేవ!**	డా॥ కె.బి.ఆర్. ప్రసాద్	11
4.	**జయతు! జయతు! సాయీశ్వరా!**	వి.ఎస్.ఆర్. మూర్తి	16
5.	**ఎవరు నిజమైన అధ్యాపకుడు?**	దివ్యానుగ్రహ లేఖ	18
6.	**ముత్యాలసరాలు** (ధారావాహికం)	ప్రొ॥ కామరాజు అనిల్‌కుమార్	20
7.	**జీవనదాత - ముక్తిప్రదాత**	'సాయిదాసు'	23
8.	**'యత్ర గాయన్తి'**	పి.వి. చలం	29
9.	**ప్రారబ్ధాన్ని కూడా జయించవచ్చు**	ఇంటర్వ్యూ - ఇన్నర్‌వ్యూ	33
10.	**సాయిసేవాసంస్థల ద్వారా పశువైద్య సేవలు**	డా॥ పి.వి. పున్నయ్య	34
11.	**స్వామి సాక్షాత్తు వైద్యనారాయణులే!**	డా॥ పణతుల రామేశమ్	36
12.	**"గతి ర్భర్తా ప్రభుః సాక్షీ..."**	కస్తూరిగారి కమనీయ భక్తికథామృతం (7)	37
13.	**"మాటల కందని మహిమార్ణవంబితడు"**	శ్రీవిలాస్ సూరి	38
14.	**ప్రశాంతి సమాచారం**	డా॥ దివి చతుర్వేది	45
15.	**చందాదారులకు విజ్ఞప్తి**		50

కవితాంజలి

1.	**మధురమైన కలగంటిని...**	ఎమ్.ఎస్. ప్రకాశరావు	15
2.	**దైవం మానవరూపంలో...**	రమాప్రసాద్ ఆదిభట్ల	22
3.	**రేడియో సాయి**	చిల్లరిగె శ్రీవిఠల్	22
4.	**వందే గురూనాం....**	మైలవరపు లక్ష్మీనరసింహం	32

© శ్రీ సత్యసాయి సాధనా ట్రస్టు, పబ్లికేషన్స్ విభాగం, ప్రశాంతినిలయం

టెలీఫోన్: 08555-287375 (సనాతన సారథి Extn. 128, పుస్తకాలు, ఆడియో వీడియో సీడీలకొరకు ఆర్డర్లు Extn. 162)

E-mail: subscriptions@sssbpt.org, editor@sssbpt.org

శ్రీ సత్యసాయి సాధనా ట్రస్టు, పబ్లికేషన్స్ విభాగం, ప్రశాంతి నిలయం, అనంతపురం జిల్లా (ఆం.ప్ర) - 515134 తరఫున ప్రశాంతి నిలయంలోని శ్రీ సత్యసాయి ఆశ్రమ పరిధిలో ఉన్న శ్రీ సత్యసాయి ప్రెస్ షెడ్ (120'X40')లో ముద్రింపబడి ప్రచురింపబడింది.

ప్రింటర్ అండ్ పబ్లిషర్ : కె.ఎస్. రాజన్, ఎడిటర్ : వి. శ్రీనివాసులు

భగవాన్ శ్రీ సత్యసాయీశ్వర విరచిత

రామకథారస వాహిని

(గత సంచిక తరువాయి - 67వ భాగం)

అంత రాముడు సుగ్రీవునితో, 'మీ జన్మ వృత్తాంతమును వినగోరుచున్నాన'ని తెలిపెను. సుగ్రీవుడు, "నాథా! నా వంశముయొక్క పూర్వోత్తరమంతయూ తమ పాదముల చెంత ఉంచగోరుచున్నాను, ఆలకింపుడు" అని యిట్లు చెప్పెను:

"ఒకనాడు సృష్టికర్త ఒక చిన్న కోతి రూపమును సృష్టించెను. అతను మహా బలవంతుడు. కానీ, చంచలస్వభావుడగుట చేత తనకు సమానుడయినప్పటికినీ అతనికి 'ఋక్షరాజు' అని పేరు పెట్టెను. ఆ వానరుడు బ్రహ్మకు నమస్కరించి, "స్వామీ! తమ ఆజ్ఞ యేమ"ని ప్రార్థించెను. అప్పుడు బ్రహ్మ, "వానరా! నీవు అడవిలో స్వేచ్ఛాసంచారము గావించుము. ఫలములు స్వేచ్ఛగా భుజింపుము. నీ చేతికి చిక్కిన రాక్షసులను సంహరింపుమ"నెను. అపుడు ఋక్షరాజు దక్షిణదిశకు బయలుదేరి వెళ్ళెను.

"ఒకనాడు ఆ వానరుడు వనములో సంచరించుచుండి ఒక కొలనులో నీరు త్రాగుటకై వెళ్ళెను. ఆ కొలనులో నీటియందు తన ప్రతిబింబమును చూచి, ఆ జలములో ఎవరో ఒక శత్రువు దాగినాడని భావించి విచారింప దొడంగెను. ఆ క్రోధమును భరించలేక నిరంతరమూ ఆ గుండము చుట్టూ తిరుగుచూ వుండెను. అతడు చేసెడి పనులన్నియు జలములో ప్రతిఫలించుచుండెను. అతడు వెంటనే పెద్దగా గర్జించెను. అంత నీటిలోని ప్రతిబింబముకూడా పెద్దగా గర్జించెను. ఇక పట్టలేక వానరుడు గుండములోనికి కుప్పించెను. ఆ క్షణమే తాను స్త్రీగా మారిపోయెను. ఆమె గట్టునకు వచ్చి, "దైవమా! యేమి ఈ విచిత్రము!" అని సూర్యునివైపునకు తిరిగి ప్రార్థించుచూ, ఇంద్రుని మనసార స్మరించుచుండ, ఇంద్ర వర ప్రసాదముచే ఒక కుమారుడును, సూర్యుని వరప్రసాదముచే ఒక పుత్రుడునూ కలిగిరి. ఇంద్రుని ప్రసాదమైన బిడ్డకు వాలి అనియు, సూర్య వరప్రసాదమైన బిడ్డకు సుగ్రీవుడనియు నామము లేర్పడెను.

"ఈ ఇరువురు పుట్టిన తత్క్షణమే స్త్రీ రూపము వీడి ఋక్షరాజయ్యెను. అతను ఈ బిడ్డలను వెంటబెట్టుకొని బ్రహ్మను ప్రార్థించెను. బ్రహ్మకు తన చరిత్రనంతయూ చెప్పుకొనుచూ స్మరించెను. అంత బ్రహ్మ, "ఓయీ వాలి సుగ్రీవులారా! మీరన్నదమ్ము లిరువురూ దక్షిణదిశకు పొండు, కిష్కింధానగరములో నివసింపుడు. చరాచర జగన్నాథుడు, తారకనాముడైన శ్రీరాముడు రఘువంశమున దశరథ మహారాజుకు జన్మించి, తండ్రి ఆజ్ఞ ననుసరించి వనమునకు వచ్చి అనేక అతిమానుష చర్యలను, కేవల మానవునివలె లీలల సలుపుచూ తిరుగుచూ, మీరున్న కిష్కింధకు చేరును. అపుడు అతనితో స్నేహమేర్పడి అతని దర్శన స్పర్శన సంభాషణాదులతో మీ జన్మ సార్థకంబౌను" అని చెప్పెను.

"రామచంద్రా! బ్రహ్మ అశరీరవాక్కులను మేము ఇరువురము విని, సంతసించితిమి. మేము జపతపయజ్ఞయాగాది కర్మల నేవియూ చేయలేదు. వారి అనుగ్రహ ప్రభావమే మా సర్వ శక్తిసామర్థ్యములు. మా మనస్సులందు ఆ శబ్దబ్రహ్మకు నమస్కరించి కిష్కింధకు చేరితిమి.

ఆ అడవిలోని రాక్షసులను సంహరించితిమి. ఒకనాడు మయుడను రాక్షసునకు మాయావి, దుందుభి అను కుమారులిరువురు కలిగిరి. వారు మహారణవీరులు. వారిలో మాయావి మహా యుద్ధము చేయుటకు మమ్ములను సమీపించెను. నిశిరాత్రి సమయమున మా నివాస సమీపమునకు వచ్చి బొబ్బపెట్టెను. శత్రువు పొగరుబోతుతనమును మా అన్న అయిన వాలి సహించెడివాడు కాదు. ఆ క్షణమే లేచి వాలి వానివద్దకు వచ్చెను. అపుడు వాడు వాలిని చూచి పారిపోయెను. వాలి తన బలముతో వానిని వెంబడించెను. అంత వాడు పారిపోయి ఒక గవిలో ప్రవేశించెను.

"నేను కూడను అన్న అయిన వాలి వెంట వెళ్ళితిని. వాలి నన్ను పిలిచి, "తమ్ముడా! నేను వానిని హతమార్చుటకై యిందులో ప్రవేశింతును. వాడు తిరిగి వెనుకకు రాకుండుటకై నీవు ద్వారము దగ్గర కాచి యుండుము" అని చెప్పెను. యెంత కాలమని నేను ప్రశ్నింపగ, "పదునైదు దినములైననూ సరే, నీవు ఉండుము. ఒకవేళ పదునారవ దినమునకు నేను రాని పక్షమున వాడు నన్ను సంహరించెనని తలంచి వెనుకకు మరలుము" అని చెప్పి మా అన్న గవిలో ప్రవేశించెను.

అయితే, నేను ముప్పది దినములు నిలిచియుంటిని. అంత ఆ గుహనుండి రక్తపు వాసన వచ్చెను. ఆ వాసన నా అన్న అయిన వాలి వాసనని నేను కనిపెట్టితిని. ఇక ఉండి లాభము లేదని నేను ఆ రాక్షసుడు తిరిగి బైటకు రాకుండుటకై ఒక పెద్ద గుండును ఆ ద్వారమునకు అడ్డుపెట్టి, విచారించుచూ నా నివాసమునకు చేరి, అక్కడనుండి నేను నా సహచరులతో అన్నయొక్క వృత్తాంతము తెలుపుచూ, మహాబలశాలి వాలి మాయావిచే చంపబడిన, ఆ మాయావి నన్ను లెక్కచేయునా అని, నా ప్రాణము యే క్షణములో తీయునో అని అదురుబెదురులతో కాలము గడుపుచుంటిని. పురవాసులు సహితము భయభ్రాంతికి గురియైరి. అంత వారందరూ చేరి మాకెవరైనా నాయకుడుండవలెను కదా, తమ అన్నగారైన వాలి మరణించెను కనుక ఆ స్థానమున తమరే నిలిచి మమ్ము రక్షించుడని కోరిరి. నాకట్టి నాయకత్వముపై యిష్టము లేకపోయెను. అయిననూ ప్రజలు బలవంతపరచి నన్ను నాయకునిగా నియమించిరి. ఇది జరిగిన రెండు మూడు దినములకే అన్న అయిన వాలి మాయావిని సంహరించి విజయవంతుడై నగరమున ప్రవేశించెను.

"నేను నాయకుడనగుటచే వాలి భరించలేనంతటి క్రోధమును పూని, నేను తనను హతమార్చి నాయకత్వమును చేపట్టవలెనను ఉద్దేశముతో గుహకు పెద్ద గుండును అడ్డుపెట్టి వచ్చినటుల భావించి, ఆనాటి నుండి నాపై ఒకవిధమైన వైరమును బూనెను. నన్ను శత్రువుగా భావించి, ప్రతి చిన్న విషయమునందును నన్ను హీనాతిహీనునివలె అవమానపరచుచూ వచ్చెను. నా సర్వాధికారములు తీసుకొని, నన్నొక పనిమనిషివలె కూడా తలంచక ఆ భవనమునుండి వెలుపలకు పంపెను. నా భార్యను తన స్వాధీనము చేసుకొనెను.

"ఈవిధముగ జరుగుచుండ ఒకనాడు, నన్ను చంపివేయవలెనని ప్రతిజ్ఞపూని నాతో పోరాడెను. అతని బలమునకు నే తాళలేకపోవుటచే కిష్కింధ వదలి రావలసి వచ్చెను. కొందరు నా అభిమానులను; నా బాధలు చూచి నాకు కొంత సహాయము చేయుచున్న మంత్రులను, నా అనుచరులను కిష్కింధలో ఉండరాదని కఠినముగా శాసించెను. అందువలన వారుకూడా నాతో కిష్కింధ వదలి వచ్చిరి. నా భార్య నాతో రావాలని యెన్నియో ప్రయత్నములు చేసిననూ, ఆమెను హింసించి తన భార్యగా స్వీకరించి అందు ఉంచుకొనెను" అని సుగ్రీవుడు చెప్పుతూ కంటిధారలు కార్చుచుండ, శ్రీరాముడు ఓదార్చి మరొక తూరి వాగ్దానము చేసి రక్షింతునని చెప్పెను

"చేయునదిలేక నేను ఈ పర్వతమున నివసించుచున్నాను. ముని శాపముచేత వాలి ఈ పర్వతమునకు రాలేనందున మేము ఇక్కడైననూ యింతటి ధైర్యముగా జీవించగలుగుచున్నాము. లేకున్న ఈ పాటికి అతని చేతులలో చచ్చియుండెడివారము" అని సుగ్రీవుడు పలుకగనే, అతని వచనములు రాముడు విని, "సఖుడా! శాపమునకు కారణమేమి?" అని యడుగ, "ఓ నాథా! మాయావి సోదరుడైన దుందుభి మహాశూరుడు. వానితో

సమానుడైన బలవంతుడు మరొకడు లేకపోయెను. వాని బలమును వాడు పరీక్షించుకొనుటకై పర్వతములతో, సముద్రములతో పోరాడెడివాడు. ఒకనాడు పర్వతములతో నాకంటే బలశాలి లోకముననే లేడని గర్వించుచుండ, అశరీరవాణి, "దుందుభీ! నీవట్లు విఱ్ఱవీగకుము, నీకంటే బలవంతుడొకడు కలడు. అతడు పంపా సరోవరమున వాలి అను నామముతో నాయకత్వమును పూని స్వేచ్ఛా విహారమును సలుపుచున్నాడు" అని చెప్పెను.

ఆ మాట వినుటతోడనే వాడు కిష్కింధను ప్రవేశించి మహిష రూపమును ధరించి గర్జించుచూ, డెక్కలతో భూమిని చీల్చుచు, తొణుకుబెణుకులు లేక ఢీమని వచ్చెను. వాడు భూమిని మర్దించుటచే వృక్షములు విరిగి నేల కూలుచుండెను. వాని సింహనాదము హృదయములను కదలజేయుచుండెను. ఈవిధముగా ఆర్భాటము చేయుచుండ, చంద్రుని పట్టుటకు రాహువు వేంచేసినటుల, వాలి ప్రవేశించి వానిపై పడెను. వారి వికృత రూపములు చూచువారలకు రెండు మదపు టేనుగులవలె కనిపించెను. వారు మల్లయుద్ధము ప్రారంభించిరి. నాలుగు యామములు పోరాడిరి. తుదకు వాలి రాక్షసుని పొడిచి చంపెను. ఆ వేటుతో వాడు గిరగిర తిరిగి పర్వతమువలె నేలకూలెను.

"వాని కళేబరము నేల కూలగనే కొన్ని వృక్షములు దానిక్రింద విరిగిపడెను. వాని కళేబరమును వాలి రెండు ప్రక్కలు చేసి, దక్షిణోత్తరములకు ఒక్కొక్క దానిని విసిరెను. అట్లు వాని కళేబర భాగములను పారవేయుటచే ఒక భాగము మునీశ్వరుని ఆశ్రమములో పోయి పడెను. ఆశ్రమమంతయూ వాని రక్తబిందువులు చిమ్మెను. జప తపాదులు గావించుకొను ఆశ్రమవాసుల దేహముల యందు దుందుభి రక్తబిందువులు పడుటచేత, మతంగ మహర్షి స్నానమాచరించి వచ్చి చూచుసరికి, ఆశ్రమమునందెందు చూచినా రక్తబిందువులే కనపడెను. ఒక మహాభయంకరమైన దేహములోని అర్ధభాగము ఆవరణలో పడియుండుట మతంగఋషి సహించుకోలేక పోయెను. ఆనందములో మునుగవలసిన తన శిష్యులు మహాఅసహ్యముగా రక్తములో మునిగి చాలా బాధ పడుచుండుట చూచి మరింత సహించుకోలేకపోయెను. ఈవిధమైన పాపకార్యమునకు పూనుకొన్నవారెవరో అని కొంత విచారించి, పట్టలేని కోపముతో ముందూ వెనుక విచారించక, ఆలోచించక, "ఇక ఆ పాపాత్ముడైన వాలి ఈ పర్వతమున ప్రవేశించిననూ, ఈ పర్వతమువైపు చూచిననూ శిరస్సు రెండు ముక్కలయిపోవుగాక!" అని శపించెను.

"ముని శాపమునకు భయపడి వాలి ఈ పర్వతము దిశకే రాడు. ఆ ధైర్యముచే నేను ఈ పర్వతమున నిర్భయుడనై భార్యావియోగముతో, బంధువియోగముతో చింతించుచూ కాలము గడుపుచున్నాన"ని సుగ్రీవుడు తన వృత్తాంతమునంతయూ రామునకు విన్నవించెను.

అంత రాముడు వాలి చేసిన, చేయుచున్న పాపములను సహించుకోలేకపోయెను; ధర్మవిరుద్ధమైన కార్యములు చూడలేకపోయెను, వినలేకపోయెను. కేవలం పశుబలమును ఆధారముగా తీసుకొని; ధర్మబలమును దైవబలమునూ విస్మరించి ప్రవర్తించే వాలి అంతు చూతునని సుగ్రీవునికి ధైర్యము చెప్పి, పదునాలుగు లోకములు అడ్డువచ్చిననూ తన ప్రతిజ్ఞ నిలబెట్టుతా ననియూ, ఒక్క బాణముతో వాలిని నేల కూలదోతు ననియూ శపథము చేసెను.

(సశేషం)

భక్తికి గుర్తు

కొండంత పరమాత్మునికి కొండంత పూలు అక్కర్లేదు. అణువంత పదార్థములోనే బ్రహ్మాండమంత భావాన్ని ఇమడ్చాలి. అదియే భక్తికి గుర్తు. భగవంతుడు భక్తునియొక్క హృదయ పవిత్రతను మాత్రమే చూస్తాడుగాని, అతని సిరిసంపదలను, పదవిని, శక్తి సామర్థ్యాలను ఏమాత్రము చూడడు. పరమాత్మునికి భావమే ముఖ్యం.

– బాబా

శ్రీ సత్యసాయి ప్రబోధ మాధురి:

వినాయక చవితి సందేశం

కూర్పు: ఆర్. సీతాలక్ష్మి

శ్రీ సత్యసాయి భగవానులు ఆయా పర్వదినముల పరమార్థమును, పాటించవలసిన విధివిధానముల అంతరార్థములను వివరించేతీరు అనూహ్యం, అసాధారణం, అద్వితీయం. భారతీయ సంస్కృతిలో పండుగలకు గల మహత్తర స్థానమును గుర్తింపజేసి, ఆధ్యాత్మిక సాధనలకు సార్థకత చేకూర్చే విధంగా స్వామి భక్తులకు అనుగ్రహించిన ప్రబోధలకు ప్రశ్నోత్తరరూపకమైన సంకలనమే 'శ్రీ సత్యసాయి ప్రబోధ మాధురి'.

1. వినాయకచవితిని ఎప్పుడు జరుపుకుంటాము?

జ: భాద్రపద శుద్ధ చతుర్థి (చవితి) నాడు జరుపుకుంటాము.

2. వినాయకునికి 'గణపతి' అని ఒక పేరు. దాని అర్థమేమి?

జ: గణపతి అనగా సకల సురగణములకు అధిపతి. అంతేకాదు, 'గ' అనగా బుద్ధి, 'ణ' అనగా విజ్ఞానము, కనుక, బుద్ధి విజ్ఞానములకు పతి. బుద్ధినుండి విజ్ఞానసిద్ధి కలుగుతుంది.

గణపతి అనగా ఛందస్సులోని గణములకు (గురువులు, లఘువులు) అధిపతి. కాన వాక్కునకు, శబ్దములకు, భాషలకు, విద్యలకు అధిపతి. మంత్రములలోని బీజాక్షరముల గణములకు అధిపతి (గణములు = గుంపు). ఇతడు ప్రణవస్వరూపుడు. ప్రణవము అన్ని ఛందస్సులకు మొదటిది.

3. వినాయకుడెట్లయినాడు?

జ: వినాయకుడనగా నాయకుడు లేనివాడు. ఒకానొక సమయంలో శివపార్వతులు తమ తనయులైన గజాననునికి, కుమారస్వామికి ఒక పందెం పెట్టారు. ఎవరీ విశ్వాన్ని ముందుగా చుట్టి వస్తారో వారికి జ్ఞానప్రదమైన అనుగ్రహఫలాన్ని బహూకరిస్తామని చెప్పారు. కుమారస్వామి తన వాహనమైన నెమలిమీద ఎక్కి విశ్వప్రదక్షిణకు బయలుదేరాడు. అప్పుడు గజాననుడు ఆలోచించాడు. తనది మహాకాయం. తన వాహనం మూషికం. అందువల్ల విశ్వప్రదక్షిణం చేయడం అసాధ్యమని తల్లిదండ్రుల సమీపాన క్రింద కూర్చున్నాడు.

కొంతసేపటికి కుమారస్వామి నెమలిమీద తిరిగి రావడం గమనించిన గజాననుడు లేచి తల్లిదండ్రుల చుట్టూ ప్రదక్షిణ చేసి, "నేను విశ్వప్రదక్షిణ చేసేశాను" అన్నాడు. ఈశ్వరుడు, "ఏవిధంగా విశ్వప్రదక్షిణ అది?" అని ప్రశ్నించాడు. దానికి సమాధానంగా, "తండ్రీ! ఈ చరాచర ప్రపంచమంతా శివశక్త్యాత్మకస్వరూపమే కనుక, బాహ్యమైన భౌతికమైన ఈ జగత్తున మీరు లేని స్థానమేది?! విశ్వస్వరూపులైన మీకు ప్రదక్షిణ చేయడమే విశ్వప్రదక్షిణ" అన్నాడు.

వెంటనే పార్వతి, "కుమారా! నీదే ఫలం" అని పలికింది. ఈవిధంగా తల్లిదండ్రులు పెట్టిన పందెంలో గెలిచినవాడై సమస్త విశ్వానికే అధిపతి అయినాడు. సాటిలేని నాయకుడు వినాయకుడు. అంతేకాక, తన కుమారుని సూక్ష్మబుద్ధికి హర్షించి శివుడు, "నాయనా! నా భక్తులు ముందుగా నిన్ను పూజించి, అటుపిమ్మట నన్ను పూజింతురుగాక!" అని తన అనుగ్రహఫలమును అందించాడు. అందువలననే సకల శుభకార్యారంభములందు ప్రథమ వందనీయుడు వినాయకుడు.

4. "తుండము నేకదంతము తోరపుబొజ్జయు వామహస్తమున్
మెండుగ మ్రోయు గజ్జెలును మెల్లని చూపుల మందహాసమున్
కొండొక గుజ్జురూపమున కోరిన విద్యలకెల్ల నొజ్జయై
యుండెడు పార్వతీ తనయ! యోయి గణాధిప! నీకు మ్రొక్కెదన్"

ఈ పద్యములో, "పార్వతీతనయా! ఓయి గణాధిపా!" అని వినాయకుని వర్ణిస్తున్నాము. దీని అర్థమేమి?

జ: ఎవరు పార్వతి? ఈమె కుమారుడెవరు? వారి సంబంధ బాంధవ్యమేమిటి? పార్వతి అనగా ప్రకృతియే! ఈశ్వరుడు పురుషుడు. ప్రకృతి, పురుషుల సంబంధమువలన మానవత్వము ఆవిర్భవించినది. కనుక, ప్రతి మానవుడు వినాయకుడే! ప్రతి వ్యక్తీ శివశక్త్యాత్మకస్వరూపమే!

5. వినాయకునిది 'గజముఖము'. దీని అర్థమేమి?

జ: 'గజముఖుడు', 'గజాననుడు' అంటాము. ఏనుగు చాలా తెలివిగల జంతువు. 'గజ తెలివి' అంటాము. 'గజ ఈతగాడు' అంటాము. దేహబలముతోపాటు బుద్ధిబలము గల జంతువు ఏనుగు. తన తొండముతో సూక్ష్మమైన సూదివంటి వస్తువును, ఘనమైన వృక్షములనుకూడా సునాయాసముగా ఎత్తివేయగలదు.

ఇంక ఏనుగు చెవులు పెద్దవి. అనగా, భక్తుల ప్రార్థనలను చక్కగా వింటాడు వినాయకుడు. నవవిధ భక్తిమార్గములలో శ్రవణం మొదటిది. సాధకులు వినాయకుని ఆదర్శంగా తీసుకొని మంచి విషయములను వినాలి.

6. వినాయకుడు 'విఘ్నేశ్వరుడు'గా ఎట్లు అయినాడు?

జ: 'గజముఖుడు' విఘ్నేశ్వరుడు. ఏవిధంగా? కార్యములందు విఘ్నములను తొలగించి ఆశీర్వదించువాడు కనుక, విఘ్నేశ్వరుడైనాడు. మృగరాజైన సింహముయొక్క పాదముద్రలుకూడా ఏనుగు పాదముద్రలలో అణగిపోతాయి. ఏనుగు పొదలను, వృక్షములను పెరికివేసి అరణ్యములో చక్కని మార్గమును ఏర్పరచుతుంది. తక్కిన జంతువులు నిర్భయముగా ఆ మార్గమును అనుసరిస్తాయి. దీని అంతరార్థమేమిటి? సమస్త దేవ మనుష్య గణములకు గజముఖుడే మార్గదర్శకుడు; విఘ్నములను తొలగించి చక్కని మార్గమును చూపించువాడు.

7. వినాయకుడు ధరించిన యజ్ఞోపవీతం నాగుపాము. దీని అర్థమేమి?

జ: సర్పము కుండలినీ శక్తికి ప్రతీక. మానవ శరీరంలో గణపతి స్థానము మూలాధారము అని యోగశాస్త్రం తెలుపుతోంది. 'త్వం మూలాధార స్థితోసి నిత్యం'

8. వినాయకుడు నాలుగు హస్తములతో భక్తులను ఏవిధంగా లాలించి పాలిస్తాడు?

జ: వినాయకుడు ఒక చేతిలోనున్న పాశంతో సాధకుని ప్రేమతో లాక్కుంటాడు. మరొక చేతితో మోదకము నందిస్తాడు. మరొక చేతిలోనున్న అంకుశంతో పెడదారి పట్టినవారిని శిక్షిస్తాడు. ఇంకొక హస్తము అభయ ముద్రతో ఉంటుంది. వినాయకునికి 'లంబోదరుడు' అని ఒక పేరు. అనగా, పెద్ద పొట్ట గలవాడు. విశాల విశ్వమును తన కుక్షియందు ఇముడ్చుకున్నవాడు.

9. మహాకాయుడైన వినాయకుని వాహనము ఎలుక. దీని అర్థమేమి?

జ: మూషికము వాసనామయ జీవి. తినుబండారముల వాసనను బట్టి అది ఆ ప్రదేశానికి చేరుతుంది; బోనులో చిక్కుకుంటుంది. అటులనే మానవులు జన్మాంతర వాసనలవలననే ఈ ప్రాకృత జీవితంలో చిక్కుకొని పెడమార్గాలు పడ్తారు. కనుక, మూషికవాహనుడనగా కోరికలను (వాసనలను) అణగద్రొక్కువాడు.

10. వినాయకుని 'ఏకదంతాయ నమః' అని ఎందుకు స్తుతిస్తాము?

జ: ఏనుగుకు రెండు దంతములుంటాయి. మరి ఏనుగుతల గల వినాయకుని 'ఏకదంతాయ నమః' అని ఎందుకు వర్ణిస్తాము? వ్యాస మహర్షి మహాభారత రచనకు పూనుకొన్నప్పుడు అతనికి లేఖకుడు ఒకరు అవసరమైనారు. బ్రహ్మ సలహా ననుసరించి వ్యాసుడు తనకు లేఖకునిగా ఉండవలసిందిగా వినాయకుణ్ణి ప్రార్థించాడు. వినాయకుడు అంగీకరించాడు. "నేను చెప్తూండగా ఎక్కడా ఎప్పుడూ ఆగకుండా నీవు వ్రాస్తుండాలి" అని వ్యాసుడు కోరగా, "నీ షరతుకు నేను ఒప్పుకుంటాను. కానీ, మధ్యలో నీవు ఆగినా, కాలం వ్యర్థం చేసినా నేను వ్రాయడం మానేస్తాను" అన్నాడు గణపతి. వ్యాసుడు చెప్తుంటే తాను వ్రాస్తూ వచ్చాడు. కానీ, మధ్యలో అతని ఘంటము విరిగిపోయింది. తక్షణమే తన దంతమును పెరికి దానిని ఘంటముగా ఉపయోగించి వ్రాశాడు. అనగా, ఏదైనా సత్కార్యమును తలపెట్టినప్పుడు అనుకున్న పని పూర్తిచేయడానికి ఎలాంటి త్యాగమునకైనా సిద్ధంగా ఉండాలన్న ఆదర్శాన్ని లోకానికి అందించాడు.

11. వినాయకునికి సిద్ధి, బుద్ధి అనే ఇద్దరు భార్యలు ఉన్నారని ఒక గాథ. దీని అర్థమేమి?

జ: మనస్సు పరిశుద్ధమైతే బుద్ధి వికసిస్తుంది. బుద్ధి వికసించినప్పుడు సిద్ధి కలుగుతుంది. ఈ బుద్ధిని, సిద్ధిని వినాయకుడు వరిస్తాడు. వారికి అతను పతి. సిద్ధి అనగా యేమి? జ్ఞానసిద్ధియే నిజమైన సిద్ధి. ఈ సిద్ధికి, బుద్ధికి క్షేమము, ఆనందము అనే ఇద్దరు కొమారులున్నారు. కనుక, క్షేమము, ఆనందము వినాయకుని పుత్రులని అంటారు. సాధకునికి మనోశుద్ధి ఉంటే సిద్ధికి, బుద్ధికి పతియైన గణపతి అతనికి క్షేమమును, ఆనందమును ప్రసాదిస్తాడు.

12. 'గరికపోచ చాలు గణనాథు పూజకు' అని అంటాము. గరికకు ఎందుకు అంతటి అర్హత సంప్రాప్తించింది?

జ: ఒకానొక సమయంలో పార్వతీ పరమేశ్వరులు పాచికలాడుతున్నారు. అందులో ఎవరు ఓడారో, ఎవరు గెలిచారో చెప్పడానికి ఒక న్యాయనిర్ణేత ఉండాలి కదా! పార్వతి నందీశ్వరుణ్ణి న్యాయనిర్ణేతగా ఎన్నుకుంది. నంది ఈశ్వరుడే గెలిచాడని తీర్పు చెప్పాడు. పార్వతికి కోపం వచ్చింది. అప్పుడు నంది, "తల్లీ! ఈశ్వరుడు నా ప్రభువు. అతడు ఓడితే నేనుకూడ ఓడినట్లే కదా! నా యజమాని గెలిచినట్లు చెప్పడం నా కర్తవ్యం" అన్నాడు. పార్వతి మరింత కోపంతో, "నందీ! నీవు నయం కాని రోగంతో వేధింపబడుదువుగాక" అని శపించింది. నంది వెంటనే పార్వతి పాదాలపై పడి, "తల్లీ! నేను చేసింది తప్పే! దయచేసి నన్ను క్షమించి శాపవిముక్తి పొందే మార్గం తెలియజేయమ్మా" అని ప్రార్థించాడు.

పార్వతి కనికరించి, "నందీ! త్వరలో నా కుమారుని పుట్టినరోజు పండుగ వస్తుంది. ఆరోజున నీకు ఇష్టమైన పదార్థమును నా కుమారునికి అర్పితము చెయ్యి. అతని అనుగ్రహముతో నీకు శాపవిముక్తి కలుగుతుంది" అన్నది. నంది బాగా ఆలోచించి, తనకు ప్రీతికరమైన గరికను వినాయకునికి అర్పించాడు. నందికి శాపవిముక్తి కలిగింది. కనుకనే, మనము వినాయక చతుర్థినాడు గరికతో పూజ చేస్తాము. వినాయకపూజకు అనేకరకములైన పత్రులను ఉపయోగిస్తాము. అవి ఔషధములుగా పూజానంతరం వాడతారు. వినాయకుని పూజించే పుష్పాలు తుమ్మిపూలు, జిల్లేడు పూలు మొదలగునవి. అనగా, భగవంతుడు భావప్రియుడేకానీ బాహ్యప్రియుడు కాదు అని అర్థము.

13. వినాయకచవితినాడు భక్తులు ఎటువంటి భక్ష్యములను నివేదిస్తారు?

జ: వినాయకునికి అర్పించే నైవేద్యం సాత్త్వికమైనది. వినాయకచవితినాడు ఉండ్రాళ్ళను నైవేద్యం చేస్తారు. వీటిని తైలసంస్కారం లేకుండా ఆవిరితో ఉడికిస్తారు. బియ్యపుపిండి, బెల్లము, నువ్వులతో కుడుములు చేస్తారు. ఆవిరితో ఉడికిన కుడుములు అనేక రోగాలను నివారిస్తాయి. బెల్లము వాతపిత్త దోషాలను పరిహారం గావిస్తుంది. నువ్వులు రక్తాన్ని పరిశుద్ధం గావిస్తాయి; దృష్టిని అభివృద్ధిపరుస్తాయి. ఆవిరితో ఉడికిన ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. ఈవిధంగా ఆరోగ్యాన్ని, ఆనందాన్ని అందించే భక్ష్యములను నైవేద్యముగా సమర్పిస్తాము.

14. వినాయకచవితి అందించు సందేశమేమి?

జ: పుట్టుటకు, జీవించుటకు ఏ తల్లిదండ్రులు ఆధారమో, వారే జీవిత లక్ష్యమునకుకూడా ఆధారము అనే సత్యాన్ని వినాయకుడు నిరూపించాడు. మహాభారత రచనకై వ్యాస మహర్షికి లేఖకునిగా వ్యవహరించిన సందర్భమున, ఒక మహత్తర కార్యసిద్ధికి అవసరమైతే దేహమునైనా త్యాగము చేయాలనే ఆదర్శమును అందించాడు. ❖

పసి(డి) హృదయానికే వశుడు పరమాత్మ

ఒకసారి భగవాన్ బాబావారు బొంబాయిలోని 'ధర్మక్షేత్ర'కు వెళ్ళినప్పుడు, అక్కడ చక్కని ఏర్పాట్లు జరిగాయి. ముఖ్యంగా బాలవికాస్ టీచర్లు పిల్లల్ని తెల్లని దుస్తుల్లో ముస్తాబు చేసి, 'ధర్మక్షేత్ర' మందిరం దగ్గర స్వామి కారు దిగి లోపలకు వచ్చే దారిలో అటూ ఇటూ కూర్చొనబెట్టారు. స్వామి ఆ పిల్లల మధ్యగా నడచి వచ్చేటప్పుడు స్వామి చేతికి ఆ చిన్నపిల్లలు గులాబీ పువ్వులు ఇవ్వాలని నిర్ణయించారు. వారిలో ఒకడు మరీ చిన్న పిల్లవాడు ఉన్నాడు. వాడు తన అన్నయ్యతోపాటు బాలవికాస్ క్లాసులకు వెళుతూ కాస్త శ్లోకాలు, పద్యాలు చదువుకున్నాడు. అతనిని చూసి టీచరు, "నీకు పువ్వు అక్కర్లేదులే, వెనుక వరుసలో కూర్చో" అని చెప్పి, ముందుకు వెళ్ళి పిల్లలందరికీ గులాబీ పూలను ఇచ్చింది. "స్వామికి ఇవ్వటానికి అందరి దగ్గరా పూలు ఉన్నాయి. నా ఒక్కడికే ఇవ్వలేదు" అని ఆ పిల్లవాడు ఆవేదన చెందాడు.

కొద్దిసేపట్లో భగవాన్ బాబా రానే వచ్చారు. కారు దిగి పిల్లలను చూసి చిరునవ్వులు చిందిస్తూ మెల్లగా వారి మధ్య నడువసాగారు. ఒక్కొక్క బాలుడు స్వామికి గులాబీ పువ్వును అందిస్తున్నాడు. స్వామి ఆ పుష్పాలను లలితంగా స్పృశించి వారిని ఆశీర్వదిస్తూ నడుస్తున్నారు. ఈ చిన్నపిల్లవాడు అంతా గమనిస్తున్నాడు. తను కూడా ఎలాగైనా స్వామికి పుష్పం ఇవ్వాలని తపించాడు. మెల్లగా మూడవ వరుసనుండి రెండవ వరుసలోకి వచ్చాడు. రెండవ వరుసలోనుంచి మొదటి వరుసలోకి వచ్చాడు. ప్రక్కనున్నవాడిని అడిగాడు. కానీ, ఫలితం లేకపోయింది. స్వామి క్రమంగా దగ్గరకు వచ్చేస్తున్నారు. అప్పుడు ఆ చిన్నవాడు తను కూర్చొన్న పచ్చికలో తనముందే ఉన్న ఒక చిన్న గడ్డిపువ్వును కోసి సరిగ్గా స్వామి దగ్గరకు రాగానే లేచి నిలబడి, చిన్ని చేతులతో నమస్కారం చేస్తూ స్వామికి ఆ గడ్డిపువ్వును అందించాడు.

దయామయులైన స్వామి అక్కడ ఆగిపోయి, వాడి పేరు అడిగి, తమ దివ్యహస్తంతో వాని బుగ్గలపై తట్టి, ఆ చిన్నారి ఇచ్చిన గడ్డిపువ్వును ప్రేమతో తీసుకొని వెళ్ళారు. "ధర్మక్షేత్ర" మందిరంలోపల మూడు గంటలసేపు బొంబాయి పురప్రముఖులతో సమావేశం జరిగింది. బయట అసంఖ్యాక భక్తజనులు ఎదురు చూస్తున్నారు. బాలవికాస్ టీచర్లు, పిల్లలు అలాగే కూర్చొని ఉన్నారు. సమావేశం అయిన తరువాత భగవాన్ బయటకు వచ్చి అభయహస్తంతో అందరినీ ఆశీర్వదించారు. అప్పుడు చూస్తే భగవాన్ బాబావారి దివ్యహస్తంలో మూడు గంటల క్రితం ఆ చిన్నారి బాలుడు ఇచ్చిన 'గడ్డిపువ్వు' ఇంకా అలాగే ఉంది! ❖

'దొరకునా ఇటువంటి సేవ!'

డా॥ కె.బి.ఆర్. ప్రసాద్

స్వామి సంకల్పంతో వారి సన్నిధికి వచ్చి వారి దివ్యదర్శన సంభాషణ భాగ్యములను ఆస్వాదించిన తరువాత, "నిధి చాల సుఖమా? సాయి సన్నిధి సేవ సుఖమా?" అన్న జిజ్ఞాస మొదలై, సన్నిధే పెన్నిధి అన్న అవగాహన ఏర్పడి, సాయి అవతారోద్యమ సేవలో పాలుపంచుకొని తరించాలనే తపన ప్రారంభం కావడం సహజం. ఇది సాయి భక్తులందరికీ అనుభవంలో ఉన్న విషయమే! 1975లో బృందావనంలో సాయి భగవానులను తొలిసారి దర్శించుకొన్న డా॥ కె.బి.ఆర్. ప్రసాద్‌గారు కూడా ఈవిధమైన తపనతో ముందు సేవాదళ్ సభ్యునిగా చేరి; అటుపిమ్మట, బెంగళూరు సేవాసమితి కన్వీనరుగా సేవలందిస్తూ; సాయి భగవానుల సర్వజ్ఞత్వ సర్వవ్యాపకత్వ సర్వశక్తిత్వములకు నిదర్శనంగా పలు దివ్యానుభవములను పొందారు. 1980 నుండి దాదాపు నాలుగు దశాబ్దములుగా ప్రశాంతినిలయంలో భగవాన్ ప్రత్యక్ష సన్నిధిలో సేవలందిస్తూ వారి కృపకు పాత్రులైనారు. భక్త సేవకులకు స్ఫూర్తినిచ్చే వారి దివ్యానుభవములు వారి మాటల్లోనే...

1975లో నేను "ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్" (**ఐఐఎస్‌సి**) బెంగళూర్లో ఏరోస్పేస్ ఇంజనీరుగా పనిచేస్తున్న రోజులవి. మా స్వగ్రామం నుండి పరిచయస్తులొకరు మా ఇంటికి వచ్చారు. బృందావనం (వైట్‌ఫీల్డు)లో జరిగే సమ్మర్ కోర్సులో పాల్గొనటానికి వచ్చానని, తనకు బెంగళూరు సిటీ కొత్త కనుక అక్కడికి తీసుకువెళ్ళవలసిందిగా నన్ను కోరాడు. ఆవిధంగా నేను తొలిసారి బృందావనం ఆశ్రమానికి వెళ్ళి భగవాన్ దర్శనభాగ్యం పొందటానికి అతను నిమిత్తమాత్రుడయ్యాడు. బృందావనంలోని ఆధ్యాత్మిక వాతావరణం నన్ను ముగ్ధుణ్ణి చేసింది. ఇంకో పదహైదు రోజులపాటు సమ్మర్ క్లాసులు జరుగుతాయని తెలిసి నిత్యం నా సతీమణినికూడా వెంట తీసుకెళ్ళి క్లాసులకు హాజరయ్యాను.

ఒకరోజు 'సనాతన సారథి'లో సేవాయోగ విశిష్టతపై ప్రచురితమైన ఒక స్ఫూర్తిదాయకమైన వ్యాసాన్ని చదివి, నాకు కూడా సాయి సమితిలో సేవాదళ్‌గా చేరాలని కోరిక కలిగింది. మా డిపార్టుమెంటులోనే పనిచేస్తున్న ప్రొ॥ ఎస్. రామకృష్ణగారే బెంగళూరు సమితి కన్వీనరని తెలిసింది. సేవాదళ్ సభ్యునిగా పేరు నమోదు చేయించుకోవడానికి ఆయన దగ్గరకు వెళ్ళినప్పుడు ఆయన చెప్పిన మాట నన్ను విస్మయపరచింది. "త్వరలో మీ డిపార్టుమెంటుకే చెందిన ఇద్దరు వ్యక్తులు సేవాదళ్‌లో చేరతారు" అని స్వామి నాతో చెప్పారండీ. మీరు మొదటివారు" అన్నారాయన.

ఆ తరువాత, భగవాన్ బాబావారి 50వ జన్మదినోత్సవ వేడుకలలో సేవలందించడానికి నవంబరు మాసంలో రామకృష్ణగారి వెంట ప్రశాంతినిలయం చేరుకున్నాను. నేను నిలయానికి రావటం అదే మొదటిసారి. ఆ సమయంలో పూర్ణచంద్ర ఆడిటోరియం ఎదురుగా సర్వధర్మస్తూపం నిర్మాణం జరుగుతూండగా, అక్కడ సేవ చేసే అవకాశం లభించింది.

ఆడిటోరియంలోని గ్రీన్‌రూమ్‌లను అలంకరించే నిమిత్తం వాల్‌పేపర్లను కొనుగోలు చేసి తీసుకురమ్మని ఒకరోజు నన్ను వ్యానులో బెంగళూరుకి పంపించారు. తీరా అక్కడికి వెళ్ళింతర్వాత ఆ డీలరు తనవద్ద మేము కోరినంత స్టాకు లేదన్నాడు. "స్టాకు రావటానికి కనీసం రెండు మూడు రోజులు పడుతుంది. పైగా ఇప్పుడు మీవెంట మా వర్కర్లను పంపించటానికి వీలుకాదు. ఇక్కడ మేము ఇంతకుముందే ఒప్పుకున్న పనులున్నాయి" అన్న అతని మాటలు విని నేను డీలాపడిపోయాను. ఇప్పుడేం దారి భగవంతుడా అని మథనపడుతూ ఉండగా, ఇంతలో అతనికి ముంబై నుండి ఎవరో ఫోన్ చేశారు. అవతలి వ్యక్తి ఏమి చెప్పాడో తెలియదుకానీ, ఫోను పెట్టేసిన తరువాత ఇతను మాకు కావలసిన రంగులు, డిజైన్లలో మేము కోరినంత వాల్‌పేపరును సప్లై చేయడానికేగాక, నావెంట ముగ్గురు పనివాళ్ళను పంపించటానికికూడా అంగీకరించాడు.

పనివాళ్ళలో వచ్చిన పరివర్తన

నాలుగు గదులను అలంకరించటానికి నాలుగు వేర్వేరు రంగులు, డిజైన్లు గల వాల్‌పేపరును కొనుగోలు చేశాను. పనివాళ్ళు ఇరవై బండిల్స్‌ను వ్యానులోకి ఎక్కించారు. ఒక్కొక్క బండిల్‌లో ఒకే రంగు, ఒకేరకమైన డిజైనుతోకూడిన ఐదేసి రోల్స్ ఉన్నాయి.

మేము పుట్టపర్తికి ప్రయాణమై వస్తూంటే ఆ వర్కర్లలో ఒకరు, "మేము రెండు రోజుల్లో పని పూర్తిచేసి బెంగళూరు వచ్చేయాలి. మాకిక్కడ చాలా పని ఉంది" అన్నాడు. వారిలో ఒకడు తెలుగువాడు, ఇంకొకడు తమిళుడు, మూడవ వ్యక్తి మహారాష్ట్రకు చెందినవాడని మాటల సందర్భంలో గ్రహించాను. "మీ సాయిబాబా సంపన్నులను తప్ప మాలాంటి సామాన్యులను పట్టించుకోరట కదా" అన్నాడొకడు. నేను ఏం చెప్పినా వాళ్ళు వినే స్థితిలో లేరు. వాళ్ళతో వాదించి లాభం లేదని ఊరకున్నాను.

ప్రశాంతినిలయం చేరుకున్నాము. స్వామి వచ్చి సూచనలిచ్చిన తరువాత పని ప్రారంభించాలని ఎదురు చూస్తూ, మేము తెచ్చిన నాలుగు డిజైన్లను స్వామి పరిశీలనార్థం సిద్ధంగా ఉంచాము.

స్వామి స్తూపం పనులను పర్యవేక్షించిన తరువాత మాదగ్గరకు వచ్చారు. **"మొదటి గదికి ఇది బాగుంటుంది; రెండవ గదికి ఇది సరిపోతుంది..."** అంటూ ఏ గదిని ఏ డిజైనుతో అలంకరించాలో సూచించారు. **"నాలుగవ డిజైన్‌కూడా బాగుందికానీ, మీరు తెచ్చిన పేపరు సరిపోదు. ఇది బెంగళూరులోకూడా దొరకదు, మద్రాసు నుండి తెప్పించాలి"** అంటూ పనివాళ్ళవైపు తిరిగారు. మహారాష్ట్రుడిని మరాఠీలో పలకరించారు. తమిళుడితో తమిళంలో సంభాషించారు. ఆంధ్రుడితో తెలుగులో మాట్లాడారు. **"మీరు భోజనం చేసి విశ్రాంతి తీసుకోండి. పని తరువాత మొదలెట్టవచ్చు"** అని చెప్పి మందిరంలోకి వెళ్ళారు. "మాలో ఎవరు ఏ భాష మాట్లాడతారో స్వామికెలా తెలుసు?" అని వాళ్ళు ఆశ్చర్యపోయారు. "స్వామి మనలాంటివారిని పట్టించుకోరనుకున్నాం. కానీ, వస్తూనే ప్రేమగా పలకరించారు కదా" అన్నాడొకడు.

స్వామి పనివాళ్ళకు కనువిప్పు కలిగించినందుకు నాకెంతో ఆనందమైంది. మనసులోనే స్వామికి కృతజ్ఞతలు తెల్పుకున్నాను. అప్పుడు నాకో సందేహం కలిగింది. "నాలుగవ డిజైను బాగుందికానీ, మేము తెచ్చిన పేపరు సరిపోదన్నారు కదా! అదెలా సాధ్యం? మందిరంవాళ్ళు సూచించిన విధంగానే నాలుగు డిజైన్లనూ సమాన పరిమాణంలోనే తెచ్చానే!" అనుకుంటూ ఆ నాలుగవ బండిల్‌ను తెరిపించాను. అందులో ప్యాక్ చేయబడిన ఐదు రోల్స్‌ను తీసి పరిశీలిస్తే, నాల్గింటి రంగు, డిజైను ఒకేవిధంగా ఉంది; ఐదవదాని డిజైన్ కూడా అదేవిధంగా ఉన్నా రంగు మాత్రం వేరుగా ఉంది. అంటే, ఆ బండిల్ తెరిపించి చూడకుండానే మేము తెచ్చిన పేపరు సరిపోదని స్వామి చెప్పిన మాట నిజమేనన్నమాట! స్వామి సర్వజ్ఞత్వానికి ఆశ్చర్యపోవటం నా వంతు అయింది.

స్వామి మందిరంలోకి వెళ్ళిన తరువాత మేము క్యాంటీన్‌కి వెళ్ళి భోజనం చేశాము. తిరిగి వస్తూంటే ఆ ముగ్గురిలో ఒకడు, "అయ్యా, మేము పనివాళ్ళం. మాకప్పగించిన పనిని మూడు రోజుల్లో పూర్తి చేయాలంటే రోజుకి ఇరవైనాలుగు గంటలు పనిచేయాల్సి ఉంటుంది. ఈ క్యాంటీన్ భోజనం మాకు సరిపోదు. మీరు డబ్బిస్తే

బయటికివెళ్ళి మాకు కావలసింది తింటాము" అన్నాడు. ఏం చెప్పాలో నాకు తోచలేదు.

పని ప్రారంభించిన కొద్దిసేపటికి స్వామి మళ్ళీ వచ్చారు. **"భోజనం ఎలా ఉంది?"** అని అడిగారు పనివాళ్ళను. "బాగుంది స్వామీ" అన్నారు. **"మీరు పనివాళ్ళు. ఈ క్యాంటీన్ భోజనం మీకు సరిపోదు. మీకు కొంత డబ్బు ఇవ్వమని నేను కుటుంబరావుకి చెపుతాను. మీరు బయటికి వెళ్ళి మీకు కావలసింది తిని రండి"** అన్నారు.

పనివాళ్ళు నిర్ఘాంతపోయారు. కొద్ది క్షణాల క్రితం వాళ్ళు నాతో అన్న మాటలను అక్షరం పొల్లుపోకుండా స్వామి రిపీట్ చేశారు! వాళ్ళల్లో పశ్చాత్తాపం మొదలైంది. "వద్దు స్వామీ, భోజనం బాగుంది, క్యాంటీన్‌లోనే తింటాము" అన్నారు. అప్పుడు స్వామి కుటుంబరావు గారిని పిలిచి, **"క్యాంటీన్‌లో వీళ్ళకి ఏది అడిగితే అది - అన్నము, కూరలు, చపాతీలు, స్వీట్లు, పెరుగు - ఎంత కావాలంటే అంత పెట్టండి"** అని ఆదేశించారు. స్వామి తమపట్ల అంత శ్రద్ధ వహిస్తారని వాళ్ళు కలలోకూడా ఊహించలేదు. వాళ్ళు అంతకుపూర్వం పనిచేసిన ప్రతి చోటా అందరూ వాళ్ళదగ్గరనుండి సాధ్యమైనంత ఎక్కువ పని రాబట్టుకోవాలని చూసినవారే తప్ప వాళ్ళనింత ప్రేమగా చూసుకున్నవారు లేరు. ఆ వర్కర్లకు ఇదంతా కొత్తగా అనిపించింది. తమకు అప్పగించిన పనిని పూర్తి చేస్తే తప్ప తాము ప్రశాంతినిలయంనుండి కదలకూడదని అప్పటికప్పుడు వాళ్ళు నిర్ణయించుకున్నారు. ఆమేరకు బెంగళూరులో ఉన్న తమ యజమానికి కబురంపి అతనిని ఒప్పించారు. అతనికి చెప్పి మద్రాసునుండి మాకు కావలసిన మ్యాచింగ్ కలర్, డిజైన్‌లతో ఒక పేపర్ రోల్‌నుకూడా తెప్పించారు. తాము దైవకార్యంలో పాల్గొంటున్నామన్న ఉత్సాహంతో, శ్రద్ధతో రాత్రింబవళ్ళు శ్రమించి పని పూర్తి చేశారు.

స్తూపం నిర్మాణంలో పాలుపంచుకున్న వర్కర్లకు స్వామి ఒకరోజు కొత్త దుస్తులు అనుగ్రహించారు. అది చూసి మా ముగ్గురు వర్కర్లు, "స్వామి మాకు కూడా ఇస్తారా?" అని నన్ను అడిగారు. "నాకు తెలీదు. అయితే, మీరు వాళ్ళమాదిరిగానే ఇక్కడ పనిచేస్తున్నారు కాబట్టి, మీకు కూడా ఇచ్చే అవకాశం లేకపోలేదు" అన్నాను. ఒక అరగంట తిరక్కుండా స్వామి మాదగ్గరికి వచ్చారు. **"వాళ్ళు పంచెలు కట్టుకుంటారు కాబట్టి వాళ్ళకి అవే ఇచ్చాను. మీరు ప్యాంట్లు, షర్టులు ధరిస్తారు కదా! కాబట్టి, మీకు ప్రత్యేకంగా తెప్పిస్తున్నాను"** అన్నారు. వాళ్ళు ఐదు రోజుల్లో పని ముగించి బెంగళూరుకి ఆనందంగా తిరిగి వెళ్ళారు. వెళ్ళే రోజున స్వామి ఆ ముగ్గురికీ ప్యాంటు, షర్టు గుడ్డలు ప్రసాదించి, కుట్టుకూలి నిమిత్తం డబ్బుకూడా ఇచ్చారు. స్వామి సన్నిధిలో కలిగిన దివ్యానుభవం వారిలో అద్భుతమైన పరివర్తనకు నాంది పలికింది.

పని చేస్తే చాలదు; ప్రార్థించాలికూడా!

మేము పూర్ణచంద్ర గదులను వాల్‌పేపరుతో అలంకరిస్తున్న సమయంలో బ్రిగేడియర్ బోస్ నేతృత్వంలో ఆడిటోరియం ఎదురుగా సర్వధర్మ స్తూపం నిర్మాణం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఒకనాటి రాత్రి ఉన్నట్లుండి కుండపోతగా వర్షం కురిసింది. ఆరోజు సాయంత్రం పని ముగించుకొని వెళ్ళేటప్పుడు వర్షం వచ్చే సూచనలేవీ లేకపోవడంతో పనివాళ్ళు కట్టడంపై టార్పాలిన్ కవర్లు వేయకుండా వెళ్ళిపోయారు. జరిగిన పొరపాటు గమనించి బోసుగారు కట్టడం దెబ్బతినకుండా కాపాడమని ఆ రాత్రంతా స్వామిని ప్రార్థిస్తూనే ఉన్నారు.

మరుసటిరోజు ఉదయం స్వామి బోసుగారి దగ్గరకు వచ్చి, **"నిన్న సాయంత్రం నువ్వు కట్టడాన్ని టార్పాలిన్‌తో కవర్ చేయించలేదు; రాత్రంతా నన్ను ప్రార్థిస్తూనే ఉన్నావు కదూ. సరే, వెళ్ళి చూడు, ఏమైందో"** అన్నారు. బోసుగారు వెళ్ళి చూసి ఆశ్చర్యానందాలకు లోనయ్యారు. రాత్రంతా కుంభవృష్టి కురిసినా కట్టడం చెక్కుచెదరలేదు!

ఆరోజు సాయంత్రం పని ముగించుకొని వెళ్ళేటప్పుడు బోసుగారు ముందు జాగ్రత్త చర్యగా కట్టడంపై టార్పాలిన్ కవర్లు వేయించారు. ఆరోజు రాత్రికూడా భారీ వర్షం కురిసింది. ఐతే, తగు జాగ్రత్తలు తీసుకున్నాననే ధైర్యంతో ఆయన నిశ్చింతగా నిద్రపోయారు.

మరుసటి రోజు ఉదయం ఆయన స్వామి దర్శనార్థం వెళ్ళినప్పుడు, **“నిన్న రాత్రికూడా బాగా వర్షం కురిసింది కదా”** అన్నారు స్వామి. “అవును స్వామీ, ఐతే, నిన్న సాయంత్రం కట్టడంపై టార్పాలిన్ కవర్లు వేయించాను” అన్నారాయన. **“అలాగా? వెళ్ళి ఒకసారి చూసి రా”** అని చెప్పారు స్వామి.

ఆయన వెళ్ళి టార్పాలిన్ కవర్లను తీయించి చూసి అవాక్కయ్యారు. ముందురోజు చేసిన పని కాస్తా వర్షంలో తుడిచిపెట్టుకుపోయింది! తగు జాగ్రత్తలు తీసుకున్నా ఇలా జరిగిందేమిటని ఆశ్చర్యపడుతూ ఆయన వెళ్ళి స్వామికి ఆ విషయం విన్నవించగా, **“చూడు, నువ్వు జాగ్రత్తలు తీసుకున్నావుకానీ, క్రిందటి రాత్రి స్వామిని ప్రార్థించటం మరచిపోయావు. “యత్నప్రయత్నముల్ మానవధర్మము, జయాపజయముల్ దైవాధీనము” కాబట్టి, నీ కర్తవ్యాన్ని నీవు నిర్వర్తించటంతోపాటు నీ కృషి ఫలించేటట్లు కృప చూపించమని దైవాన్ని ప్రార్థించాలి కూడా”** అంటూ స్వామి ఒక గొప్ప పాఠం నేర్పారు. ఈ అపురూప సంఘటనకు నేను ప్రత్యక్ష సాక్షిని.

అసాధ్యం అనుకున్నది సుసాధ్యమైంది!

పూర్ణచంద్రలో పనులు పూర్తయిన తర్వాత, భగవాన్ బాబావారి 50వ పుట్టినరోజు పండుగ సన్నాహాలలో పాలుపంచుకోవటానికి పుట్టపర్తిలో ఉండిపోయాను. మందిర ప్రాంగణంలో, పూర్ణచంద్ర హాలులోనూ “పబ్లిక్ ఎడ్రస్ సిస్టమ్”ను ఏర్పాటు చేసే పనుల్లో ప్రొ॥ రామకృష్ణ నన్ను భాగస్వామిని చేశారు. నిలయంలో ఎక్కడైనా కూర్చొని భక్తులు ఆడిటోరియంలో జరిగే కార్యక్రమాలను ఆస్వాదించగలిగేరీతిగా ఏర్పాట్లు జరిగాయి. ఈశ్వరమ్మ హైస్కూలు ఆవరణను ఆ సమయంలో కారు పార్కింగ్‌కు కేటాయించటంచేత డ్రైవర్లు, సేవాదళంవారు అక్కడి నుండే స్వామి దివ్యోపన్యాసాలను ఆలకించేందుకు వీలుగా ఈ సౌకర్యాన్ని స్కూలువరకూ విస్తరిస్తే బాగుంటుందని పెద్దలు సూచించారు. ఆ బాధ్యతను నాకప్పగించారు.

ఆరోజుల్లో, మందిరంనుండి ఈశ్వరమ్మ స్కూలుకు వెళ్ళే దారిలో వేరుసెనగ పంట పొలాలు తప్ప ఇంకేమీ ఉండేది కాదు. సేవాదళ్ సహాయంతో దారిపొడవునా అక్కడక్కడా గుంతలు తవ్వించి గుంజలు పాతించాను. ప్రస్తుతం సాయిశ్రీనివాస్ గెస్టుహౌస్ ఉన్నచోట ఒక చిన్న ఆసుపత్రి ఉండేది. అక్కడున్న స్పీకర్‌కి ‘యాంప్లిఫైయర్’ (ధ్వనివర్ధకాన్ని) అమర్చి, దానిని లౌడ్‌స్పీకర్లకు అనుసంధానం చేశాము. ఐతే, ఈ పద్ధతిలో ఆడియో స్థాయితోపాటు ‘నాయిస్’ (noise) తీవ్రతకూడా పెరిగి, లౌడ్‌స్పీకర్ నుండి వెలువడే ధ్వని నాణ్యత కచ్చితంగా దెబ్బతినే అవకాశం ఉంది. కానీ, చిత్రంగా అటువంటి సమస్య ఏమీ తలెత్తలేదు. నిజం చెప్పాలంటే, ఆడిటోరియంలో కూర్చున్నవాళ్ళకంటే స్కూలు ఆవరణలో ఉన్నవాళ్ళే బాబావారి దివ్య ప్రసంగాలను సుస్పష్టంగా వినగలిగారు. ఇది ఎలా సాధ్యమైందో ఇంజనీర్లకి అంతు బట్టలేదు. అప్పటికి అందుబాటులో ఉన్న పరికరాలతో ‘నాయిస్’ పూర్తిగా ఫిల్టరైపోయి ధ్వనినాణ్యత మెరుగు కావడమన్నది కలలోని మాట. కానీ, అసాధ్యమనుకొన్నది స్వామి అనుగ్రహంతో సుసాధ్యమైంది.

‘ఇదిగో, ప్రసాదం తీసుకో!’

జన్మదినోత్సవ వేడుకల తర్వాత సేవాదళ్ సభ్యులంతా పాదనమస్కారం, ప్రసాదం కొరకు మందిరంలో బారులు తీరి కూర్చున్నారు. ముందురోజు సాయంత్రం నేను నా స్నేహితులను సాగనంపడానికి బస్టాండుకు వెళ్ళినప్పుడు, నాకుకూడా ఎందుకో బయల్దేరాలనిపించి, వెంటనే పెట్టె సర్దుకొని బస్సెక్కేశాను.

మరుసటిరోజు స్వామి సేవాదళ్‌కి పాదనమస్కారం అనుగ్రహిస్తూ, **“ప్రసాద్ ఎక్కడ?”** అని అడిగారట. “ఈరోజు కనిపించలేదు స్వామీ” అని ఎవరో విన్నవించగా, **“స్నేహితులను బస్సెక్కిస్తూ తనకుకూడా వెళ్ళాలనిపించి వెళ్ళిపోయాడు”** అన్నారట.

మళ్ళీ వైకుంఠ ఏకాదశి పండుగకు ప్రశాంతినిలయం వచ్చాను. క్యాంటీన్‌లో సేవ చేస్తుంటే సంస్థ పెద్దలొకరు వచ్చి, “పి.ఎ. సిస్టమ్ గురించి తెలిసిన హైదరాబాద్ సేవాదళ్ ఎవరైనా ఉన్నారా?” అని అడిగారు. నేను బెంగళూరువాడిని కావడంచేత బదులివ్వలేదు. ఆయన

తిరిగి వెళ్ళి, ఎవరూ లేరని స్వామికి విన్నవించగా, **“నువ్వు హైదరాబాద్ సేవాదళ్ ఎవరైనా ఉన్నారా? అని అడిగావు కదూ. అలాకాకుండా, “పి.ఎ. సిస్టమ్‌ను ఆపరేట్ చేయ గలవారు ఎవరైనా ఉన్నారా?” అని అడుగు”** అని స్వామి సూచించడంతో ఆయన మళ్ళీ వచ్చి స్వామి చెప్పినరీతిగా అడిగారు. వెంటనే లేచి, “నేను చేయగలను” అన్నాను. “మరి ఈ మాట ముందే ఎందుకు చెప్పలేదు?” అని ఆయన ప్రశ్నించగా, “మీరు హైదరాబాద్ సేవాదళ్‌కోసం అడిగారు. మరి నేను బెంగళూరు సేవాదళ్‌ని కదా!” అని బదులిచ్చాను.

స్వామి ఆదేశం మేరకు పి.ఎ. సిస్టమ్‌ను చూసుకునే బాధ్యత నాకిచ్చారు. ఆ సామగ్రి అంతా పూర్ణచంద్ర ఆడిటోరియంలో ఉండేది. నేను ఆడిటోరియంలో ఉండగా స్వామి కారు లోపలికి వచ్చి ఆగింది. ఆరోజుల్లో స్వామి బయటికి వెళ్ళినప్పుడల్లా ఆడిటోరియంలోకి వచ్చి కారు ఎక్కేవారు; తిరిగి వచ్చిన తరువాతకూడ ఆడిటోరియంలోనే కారు దిగి మందిరానికి వెళ్ళేవారు. కారు దిగి స్వామి నన్ను చూసి, **“ఏం ప్రసాద్? ప్రసాదం తీసుకోకుండా వెళ్ళిపోయావేం?”** అని అడిగారు. రెండు నెలల క్రిందట జరిగిన విషయాన్ని అదేదో రెండు రోజుల క్రిందట జరిగినట్లుగా అడిగేసరికి విస్తుపోయాను. అప్పుడు స్వామి కారులోంచి కొన్ని ఆపిల్స్ తీసి నాకిస్తూ, **“ఇదిగో ప్రసాదం తీసుకో. పాదనమస్కారం చేసుకో”** అన్నారు. స్వామి ప్రేమకు కృతజ్ఞతతో నా కళ్ళు చెమ్మగిల్లాయి.

(ఇంకా ఉంది)

మధురమైన కలగంటిని...

ఎమ్.ఎస్. ప్రకాశరావు

ప॥ మధురమైన కలగంటిని స్వామీ
ఈ ప్రశాంతి మందిరాన నీ పాద సన్నిధిలో
మధురమైన కలగంటిని స్వామీ ॥మధురమైన॥

1. హిమగిరి శిఖరాలపైన కోటిసూర్యకాంతులతో
సుందర దరహాసముతో కరుణ చిలుకు కన్నులతో
ప్రేమమూర్తి పరమశివుడు కనిపించెను కలలో
కనులు తెరిచి చూచినాను పర్తిసాయి కనిపించెను
అదే చూపు అదే రూపు ఆ శివుడవు నీవే
అదే సొగసు అదే నగవు మా తండ్రివి నీవే ॥మధురమైన॥

2. హిమగిరీంద్రనందిని సకల భువన వందిని
శ్రీమాతా చిద్రూపిణి ప్రేమామృత వర్షిణి
జగన్మాత పార్వతి కనిపించెను కలలో
కనులు తెరచి చూచినాను సత్యసాయి కనిపించెను
అదే చూపు అదే రూపు ఆ జననివి నీవే
అదే ప్రేమ అదే కరుణ మా తల్లివి నీవే ॥మధురమైన॥

జయతు! జయతు! సాయీశ్వరా!

వి.ఎస్.ఆర్. మూర్తి

ఇక్ష్వాకు కులతిలకుడైన శ్రీరామచంద్రుడు, 64వ రఘు రాజు. రాముడి అనంతరం, 35 మంది రాజులు రాజ్యపాలన చేశారు. అంటే శ్రీరామావతారానికి ముందు రాజ్యము, రాజ్యాంగము, మంత్రాంగము, కోశాగారము, ధన ధాన్య సమృద్ధి పుష్కలంగా, వేవేల సంవత్సరాలుగా స్థిరపడి, సిద్ధంగా ఉంది. శ్రీరాముడి అవతరణ సమయానికి వసిష్ఠుడివంటి జ్ఞాన గురువు, విశ్వామిత్రుడి వంటి సమర్థ లోక గురువు, విశ్వసనీయ యంత్రాంగం, ధర్మబద్ధ లౌకిక జీవనం ప్రవాహ సదృశంగా సాగుతున్నది, పారుతున్నది. సర్వధర్మ సమగ్ర, నిగ్రహ విగ్రహమూర్తి, రామచంద్రుడు. మాయాధీనమై, విధి నిబంధబద్ధమై, రాముడు సాగించిన పుడమి పయనం లోకోత్తరం! సర్వధా అనుసరణీయం! వైయక్తిక, కౌటుంబిక, సామాజిక, రాజకీయ, ధర్మాన్ని ఆచరించిన పరమోదారుడు రాముడు.

అధర్మాన్ని అణచి, ధర్మజీవన శైలికి శ్రీకారం చుట్టి, అవతార ఆసాంతమూ రామప్రభువు, ఆరాధనీయుడైనాడు, ఇప్పటికీ, ఎప్పటికీ!

కేవలం రాజ్యపాలనకోసం మాత్రమే కాక, ధర్మగ్లానిని నివారించి, జ్ఞానవరదానం చేసినది యోగేశ్వరుడు కృష్ణుడు. దైవశక్తిని ప్రదర్శనగా, నిదర్శనగా సాగించిన లీలావైభవమే కృష్ణత్వం. ప్రథమ లోకగురువు వ్యాసుడు కాగా, ప్రప్రథమ జగద్గురువుగా కృష్ణుడు ఆనందసాంద్రుడు. ఆయన గురువు సాందీపుడు. శ్రీకృష్ణ నేపథ్యంలో రాచరికపు చారికలు స్పష్టం. నడుస్తున్న వ్యవస్థలో మొలకెత్తిన కృష్ణబీజం నడిపించినదంతా భక్త రక్షణ, దుష్ట నిర్మూలన!

కలియుగ ఆరంభపు తొలి వేళలివి. కేవలం 5400 సంవత్సరాల కాలంలో కలి ప్రభావం మానవజాతిని అతలాకుతలం చేస్తున్న కాలమిది. సుమారు తొమ్మిది

దశాబ్దాల క్రితం తెలుగు దేశాన ప్రభవించిన రత్నాకర కులదీపకుడు, భగవాన్ శ్రీ సత్యసాయి. భారతదేశం విదేశ పాలనలో మగ్గుతూ, కునారిల్లుతున్న కష్ట సమయం, నీటి చుక్కకు నోచని, మెతుకు మెసవటం మరచిన, పుట్టలే తప్ప యిళ్ళులేని, పాములెక్కువై మనుషులు తక్కువైన, పుట్టపర్తి గ్రామం ఒక పరిపూర్ణావతారాన్ని సప్రేమకంగా ఆహ్వానించుకున్న పవిత్రకాలం. చిత్రావతీ జలం, పుట్టపర్తి స్థలం, అవతార కాలం, త్రివేణీ సంగమమై అధ్యాత్మ ప్రయోగ భూమిక ఆవిర్భవించిన ఆనందక్షణం. వేద, ధర్మ, దీనజనోద్ధరణలను అవతార కార్యక్రమంగా ప్రకటించి, 85 సంవత్సరాలు శక్తివంతంగా, కాంతివంతంగా, క్రాంతివైభవంగా నడిపించిన శ్రీ దత్తమూర్తి, సత్యసాయి భగవానుడు.

కేవలం 14 సంవత్సరాల ప్రాయంలోనే అవతార మర్మాన్ని బహిర్గతం చేసి, మానవ జాతిని సనాతన ధర్మం వైపు నడిపించిన, నడిపిస్తున్న, ఎల్లకాలాల నడిపించే పరదైవతం స్వామి! సామాన్య జనుడినుండి జ్ఞానమూర్తుల వరకు స్వామి అనుగ్రహించింది, పరిణామ స్ఫూర్తి!

మానవుడు మానవుడుగా జీవించటాన్ని మించి అధ్యాత్మ లేదని, తమ జీవితంద్వారా నిరూపించిన స్వామిది, ఒక విశిష్ట అవతార దీప్తి!

సమస్త దేశాల జనులు దృఢ విశ్వాసంతో అడుగులు వేస్తూ, పుట్టపర్తికి చేరుకున్న వైనమే, స్వామి దివ్యత్వానికి గురుతు!

రాజ్యం లేదు, రమణులు లేరు, గురువులు లేరు,

ముందు వెనుకల ఏ ఒక్కరూ లేరు.

ధర్మం అన్ని పార్శ్వాల సన్నగిల్లుతున్నది.

దైవభక్తి, ఆత్మవిశ్వాసం పలచబడుతున్నది.

మతం, కులం మనుషులను విడదీస్తున్నవి.

అంధ విశ్వాసాలు జాతిని నడిపిస్తున్నయ్.

ధనమే దైవమై, మనసులు దయ్యాల కొంపలై, సంఘ జీవనం సౌందర్యాన్ని కోల్పోయి, నీతి నశిస్తున్నది;

పాపభీతి మృగ్యమై, పుణ్యకార్యాచరణ వెనకడుగు వేస్తున్నది.

చదువులన్నీ లోకవిద్యలుగా రూపాంతరీకరణం జరిగి, మానవత్వం మసకబారుతున్న వేళ,

రామధర్మము, కృష్ణప్రేమ, దత్తశక్తి కలబోసుకుని అవతరించిన స్వామి, అవనిని తరింపవచ్చిన ఆగమ స్వరూపం.

సర్వవేదాలకు ధర్మం మూలమైతే, సర్వకర్మలకు ప్రేమ అంతర్వాహిని అయితే, అహంకార మమకారాలను ధ్వంసం చేసే శక్తిమంత ఆయుధం సేవ కాగలిగితేనే ఈ సృష్టి ప్రశాంతినిలయమౌతుందని స్వామి సంకల్పించి సాధించిన తీరు, సర్వావతార సమన్వయ స్ఫూర్తి!

జనపాలనను దాటి, దుర్జన సంహార క్రీడను దాటి, సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలు సమగ్రమై, మానవ మాధవీయ మాధుర్యాన్ని, భక్తజన పాలనను కరుణతో, సడిలేని అడుగులతో, సనాతన వాణిని సకల జగత్తులలో మ్రోయించిన మోహనమూర్తి స్వామి! ద్వీపాలలో దీపాలు వెలిగించి, మానవజాతికి ధర్మపథనిర్దేశం చేసి, అనేకాన్ని ఏకం చేసిన, జగదభిరామదీప్తి సాయిరామావతరణ!

దైవభావనను పాదుకొలిపి,

అద్వైతస్థితిని నాలుగు చెరగులా ఆవిష్కరించి,

మానవ జాతిని మల్లెపందిరిన నిలిపి,

సౌరభాంచిత ప్రేమ సుమాలను పూయించి,

ఐక్యతారాగాన్ని ఆలపించి, జ్ఞాన కాంతులను వెదజల్లి,

అందరినీ ప్రేమిస్తూ, అందరినీ సేవిస్తూ, మానవ జన్మను సార్థకం చేసుకొమ్మని,

ధర్మమార్గ నిర్దేశం చేసిన స్వామి, ప్రతి తలపులోనూ మెదిలే ఆనంద రేఖ! ప్రతి క్షణమూ తడిమే కరుణా స్పర్శ!

స్వామితో కదిలేదే స్వచ్ఛకాలం!

స్వామిని జీవించటమే జీవితం!

జయతు! జయతు! సాయీశ్వరా!

జయతు! జయతు! ❖

వేదపురుష సప్తాహ జ్ఞానయజ్ఞం 2019

భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్య అనుగ్రహాశీస్సులతో, "సమస్త లోకాః సుఖినో భవంతు" అన్న మహత్తరమైన ఆశయంతో ప్రతి యేటా ప్రశాంతినిలయంలో దసరా ఉత్సవాలలో భాగంగా నిర్వహింపబడే వేదపురుష సప్తాహ జ్ఞానయజ్ఞం ఈ సంవత్సరం **అక్టోబరు 2వ తేదీన** మొదలై **అక్టోబరు 8వ తేదీ విజయదశమినాడు** పూర్ణాహుతితో పరిసమాప్తమవుతుంది. అందరూ ఆహ్వానితులే!

- సం॥

Bhagavan Sri Sathya Sai Baba

PRASANTHI NILAYAM P.O.
ANANTPUR DT. (A.P.)
PHONE NO : 30.

సంజీవయ్యా! అందుకో ఆశీర్వాదములు.

[illegible]

ఎవరు నిజమైన అధ్యాపకుడు?

(సెప్టెంబరు 5వ తేదీ ఉపాధ్యాయ దినోత్సవము)

నంజుండయ్య! అందుకో ఆశీర్వాదములు.

అందె నీవంపిన వందనములతోటి అందలి విషయ సుమములు. ఆనందము.

మన కాలేజీలో ఉత్తమ విద్యార్థులతోపాటు ఉత్తమ అధ్యాపకులుకూడా తయారయిన అంతకంటే స్వర్గమున్నదా? "స్వర్గమనగ వేరే కలదా, సత్యసాయి వర్గమే" అన్న వార్త ఇంటింటా ఇంచి ఇంచీ పలకాలి, వ్యాప్తి కావాలి. అధ్యాపకులు కూడా కొందరు వారి మూర్ఖత్వాలను మార్చుకొనిన వారూ తరింతురు, పిల్లలనూ ప్రోత్సహింతురు. కేవలం జీతాలకోసం బ్రతుకు అని భావించుచున్నారు. జీవితాన్ని నాశం చేసుకొంటున్నారు. చేస్తున్నారు. చదువుయొక్క సారాన్ని గుర్తించని వ్యక్తుల గతి అంతే! ఇతర పిల్లలను ఉన్నత స్థాయికి తెప్పించుటకు తగిన కృషి సలిపినవాడే అధ్యాపకుడు, లేకున్న అధ్వాన్నుడు. చదువు అమ్ముకోవటం కాదు, అందివ్వటం చూడాలి. ఆచరించి, అనుభవించి, అనుభవింపజేయాలి. ఇది వినేది కాదు, వినిపించేది కాదు. తినాలి. తినిపించాలి. అశాంతి అజ్ఞానమను రోగమును రూపుమాపాలి. తిరిగి అట్టి వ్యాధి రాకుండా చూచుకోవాలి. పిల్లలు బంగారంటివారు. వారికి తగిన ఉత్సాహమును, ప్రోత్సాహమును చేకూర్చునట్టి వ్యక్తులు అత్యవసరము. అట్టి ఉత్సాహ ప్రోత్సాహముల నందించలేని అధ్యాపకులు వుండిన మాకూ కష్టమే, వారికీ కష్టమే. ఇరువురకూ సుఖముండదు. యేదో బసవన్న మాదిరి తిని కాలేజీకి వచ్చి, బుక్కులోనిది ముక్కులతో తెలిపి వెళ్ళిన యేమి లాభము? తండ్రి పిల్లల క్షేమాన్ని యెట్లు కోరునో, అట్లే అధ్యాపకునకు విద్యార్థి ప్రేమపుత్రుడు, తండ్రికి కామపుత్రుడు. ఈ సత్యాన్ని తెలిసినవాడే, మెలగినవాడే నిజమైన అధ్యాపకుడు. నిజమా కాదా?

మీ గృహలక్ష్మికి, చిరంజీవులకు ఆశీస్సులు. 8వ తేదీ నేను అనంతపురం పోతున్నాను. కాన నీవేమీ రావద్దు. సాయిని నీలోనే చూచుకో.

బాబా

శ్రీ సత్యసాయి ఉన్నత విద్యాసంస్థ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌గా సేవలందించిన ప్రొ॥ నంజుండయ్యగారికి భగవాన్ బాబావారు వ్రాసిన దివ్యానుగ్రహ లేఖ ఇది.

ముత్యాల సరాలు

(ధారావాహికం - 37వ భాగం)

❖ ప్రొ॥ కామరాజు అనిల్ కుమార్ ❖

కనువిప్పు కలిగించే సంభాషణలు

ఒకరోజు స్వామి నన్ను, "సమాజం అంటే ఏమిటి?" అని అడిగారు.

"వ్యక్తుల సమూహం, స్వామీ" అన్నాను. నేను.

"కాదు" అన్నారు స్వామి, **"సమాజమనే పదములోనే చక్కని అర్థమున్నది. 'సమ' = సమత్వము, 'జ' = పుట్టినది. కాబట్టి, సమాజమంటే సమత్వము నుండి ఆవిర్భవించినది; సమభావము, సమైక్యతలతో కూడినది."**

"ఐతే, వ్యక్తికి, సమాజానికి మధ్య గల సంబంధమేమిటి స్వామీ?" అని అడిగాను.

"స్వార్థ స్వప్రయోజనములు, సంకుచిత భావములతో కూడినది వ్యక్తి లేదా, వ్యష్టి తత్త్వము. సమాజము విశాలత్వముతో కూడినది. వ్యష్టి సమష్టిని, సమష్టి సృష్టిని, సృష్టి పరమేష్ఠిని ఆశ్రయించి ఉన్నాయి. వ్యక్తి సమత్వముతో సమష్టిలో మెలగుతూ, సృష్టిలో పరమేష్ఠిని దర్శించాలి, అనుభవించాలి" అని స్వామి బోధించారు.

వ్యక్తిలో సమభావముంటే సమాజములో అలజడి, ఆందోళన, హింసలకు తావులేదు కదా! "మరి సమాజంలో సమత్వం ఎలా నెలకొంటుంది స్వామీ?" అని అడిగాను.

"ఈ సమత్వము రాజకీయ సాంఘిక ఆర్థికరంగాలకు సంబంధించినది కాదు. హృదయాలు ఏకం కావాలి. హృదయస్థాయి నుండి ఏర్పడేదే సమత్వము" అన్నారు.

హృదయాలు ఏకమవ్వడం ఎలాగో హృదయానికి హత్తుకునేలా స్వామి చెప్పారు: **"చూడు. నీవు నీ భార్య, బిడ్డలను ప్రేమిస్తున్నావు కదా! నీ తల్లిదండ్రులను, బంధుమిత్రులను ప్రేమిస్తున్నావు కదా! ఈ ప్రేమను విశాలం చేసుకో. అప్పుడు సమత, సమగ్రత, సమైక్యత, సౌభ్రాతృత్వములు హృదయస్థాయి నుండి ఏర్పడి శాంతి, ఆనందాల నందిస్తాయి.** Expansion of love is life, contraction of love is death" **ప్రేమను విశాలం గావించుకోవడమే జీవితం; సంకుచితం చేసుకోవడమే మరణం."**

కలిప్రభావంవల్ల ఈనాడు స్వార్థం పెరిగి ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమై వృద్ధులు నిరాదరణకు గురి అవుతున్నారు; కన్నబిడ్డల ప్రేమకు దూరమవుతున్నారు. ఇట్టివారికోసం వృద్ధాశ్రమం ప్రారంభించమంటారా? అని ఒకరు స్వామిని అడుగగా, స్వామి ఇచ్చిన సమాధానం – **"ముందు మీ ఇంట్లో ఉన్న వృద్ధులకు మీరు సేవ చేయండి. ఆ తరువాతనే వృద్ధాశ్రమం. సేవ చేయడం మంచిదే."**

Charity begins at home అన్నట్లు, ముందు వ్యక్తిస్థాయిలో పరిణామం జరగాలి. వ్యక్తిగా కుటుంబంలో మన బాధ్యతను నిర్వర్తించి, ఆ తరువాత సంఘసేవ అంటే అర్థముంటుంది.

వేసవి తరగతుల్లో ఒకనాడు స్వామి చాలా గంభీరంగా, రామాయణ రహస్యాల వివరణతో దివ్యోపన్యాసం గావించి మంగళహారతి తరువాత 'త్రయీ' మందిరానికి నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ వస్తున్నారు. **"ఏమయ్యా! ప్రసంగం విన్నావా?"** అంటూ నన్ను పలకరించారు.

"విన్నాను స్వామీ! మా సందేహాలన్నీ తీరినవి" అన్నాను. స్వామి నావైపు తీక్షణంగా చూస్తూ, **"మీకా సందేహాలు తీరేది?! నఖశిఖపర్యంతం సందేహాలే. అవి తీరనే తీరవు"** అన్నారు.

ఉన్నమాటే స్వామి అన్నమాట! నేను వెంటనే, "స్వామీ! మనసంతా తీరని సందేహాలతో నిండిపోతే ఇంక మా గతి ఏమిటి?" అన్నాను.

అప్పటికే కొన్ని అడుగులు ముందుకు వేసిన స్వామి ఠక్కున వెనక్కి తిరిగి, **"ఏమంటున్నావు? ఏమి గతి అంటున్నావా? మీ సందేహాలు తీరాలంటే ఒకటే గతి. అదే శరణాగతి"** అన్నారు.

ఆరోజు స్వామి పిల్లలందరికీ ఐస్‌క్రీమ్‌లు పంపిణీ చేయవలసిందిగా ఆదేశించారు. కొందరు పెద్దపిల్లలు పంచుతూ ఉంటే స్వామి ప్రేమతో పర్యవేక్షిస్తున్నారు. పంచిపెట్టడం పూర్తి అయిందని వాళ్ళు తిరిగి వచ్చాక స్వామి దూరంగా కూర్చున్న ఒక పిల్లవానిని చూపిస్తూ, **"మీరతనికి ఇవ్వలేదు. 'బ్రదర్స్' మరచిపోతారేమోగాని, ఈ 'మదర్' ఏనాటికీ మరువదు"** అన్నారు.

శ్రీ సత్యసాయి విశ్వవిద్యాలయమువారు "మానవతా విలువలు-విద్యావిధానము" అన్న అంశంపై నిర్వహించిన "సింపోజియమ్" (సదస్సు)లో ఆచార్యులు, అధ్యాపకులు వివిధ అంశములపై ప్రసంగించడం జరిగింది.

ఆరోజు సాయంత్రం మందిరంలో స్వామి, **"నీవు దేనిగురించి ప్రసంగించావు?"** అని నన్ను అడిగారు. "మతసమైక్యతగురించి ప్రసంగించాను స్వామీ" అన్నాను. **"మతసమైక్యత (Unity of faiths) అంటే ఏమిటి?"** అని అడిగారు. నేను సమాధానం చెప్పడానికి జంకుతుంటే, స్వామి ఒక్క వాక్యంలో సర్వమత సారం చెప్పారు: **"Religion of love (ప్రేమమతం). అదే యూనిటీ. Religion అనేది Realisation కు సంబంధించినది."**

అప్పుడు నేను, "స్వామీ, మతములు అనేకానేక మార్గములను బోధిస్తున్నాయి. మరి ఏకత్వం సాధించేదెలా?" అన్నాను. **"వాదోపవాదములు మానివేసినప్పుడే ఏకత్వం గుర్తింపబడుతుంది"** అన్నారు స్వామి: **"చూడు, నీకు కాళ్ళు, చేతులు, నోరు మొదలైన అంగములు ఉన్నాయి కదా! దేహము ఏకత్వమును; వివిధ అంగములు భిన్నత్వమును సూచిస్తాయి. ఈ మంటపంలో వేలాదిమంది ఉన్నారు. ఒకరిని తెలుసుకుంటే అందరినీ తెలుసుకున్నట్లవుతుంది. అందరియందు ఏకత్వమైన ఆత్మ ఉన్నది."**

"స్వామీ! ఇట్టి ఏకత్వాన్ని గ్రహించేదెలా?" అని అడిగాను.

స్వామి ఠక్కున సమాధానం చెప్పారు: **"కనిపించనిది కనిపించేటట్లు చేస్తున్నది. కనిపించని ఆత్మతత్త్వం కారణంగానే కనిపించే అవయవములు పని చేయగల్గుతున్నాయి."**

"స్వామీ, ప్రహ్లాదుడు ఇట్టి ఏకత్వాన్ని అనుభవించిన తరువాతనే చదువులలోని మర్మమెల్ల చదివితినన్నాడు కదా" అన్నాను, నా తెలివితేటలను ప్రదర్శిస్తూ.

"ఆ మర్మము ఏమిటో చెప్పు" అన్నారు స్వామి.

"స్వామీ! మీ సూక్తులు, బోధనలు తప్ప నాకు అన్యములేవీ తెలియవు; అక్కర్లేదు కూడా. మీరు నన్ను ఏది అడిగినా మీ మాటల్లోనే చెబుతాను. ఏమంటారో అని భయంగా ఉంది" అన్నాను.

"తప్పేముంది? చెప్పు" అన్నారు.

"ఈ మర్మమును స్వామి ఒక చక్కని పద్యంలో అత్యంత హృద్యంగా వివరించారు:

సర్వవేదాంత గ్రంథాల సారమెల్ల
ఒక్క వాక్యాన చెప్పుదు నొక్కసారి
అఖిల భూతములందున్న ఆత్మ నీవు
ఒక్కటే అని మనసున నుండవలయు

ఈ పద్యసూక్తి నాకు జ్ఞాపకమొస్తోంది స్వామీ" అన్నాను.

"తెలిసింది చెప్పడంలో భయమేముంది? నీవు రైటు అనుకున్నది చెప్పడానికి సందేహమెందుకు?" అన్నారు స్వామి చిరునవ్వుతో.

"మన యూనివర్సిటీలో టీచర్లకు 'సింపోజియం' జరిగిందని అంటున్నావు. 'సింపోజియం' అంటే ఏమిటో చెప్పు" అని అడిగారు.

"స్వామీ! వివిధ దృక్కోణాలలో ఒక విషయాన్నిగూర్చి కూలంకషంగా చర్చించడం" అన్నాను.

"విషయాన్ని ముక్కలుముక్కలుగా విడదీయకూడదు. అన్నింటినీ సమన్వయపరచి ఏకత్వాన్ని నెలకొల్పడమే 'సింపోజియం' ముఖ్యోద్దేశం" అన్నారు స్వామి.

"భగవాన్, ఇట్టి ఏకత్వాన్ని అనుభవించడానికి ఏ సాధన చెయ్యాలి?" అని అడుగగా, **"ఆత్మవిచారణ"** అని బదులిచ్చారు స్వామి.

"అయితే, ఆధ్యాత్మికమార్గంలో జపధ్యానాదులకంటే ఆత్మవిచారణ స్థాయి గొప్పదంటారా?" అని అడిగాను.

"ఆధ్యాత్మికంలో స్థాయి లేదు. అంతా ఒకటే. నీటిలో మునిగేంతవరకూ స్థాయి ఉన్నదిగాని, పూర్తిగా మునిగిన తరువాత స్థాయి ఎక్కడిది? లేదే!" అన్నారు భగవాన్. మేధావులమనుకునేవారికి ఈ మాట కనువిప్పు కాగలదు.

"స్వామీ! బుద్ధి విచారణ సల్పుతుందన్నారు కదా! అనంతరం జరిగేదేమిటి?" అని అడిగాను.

"విచారణలో బుద్ధి లయం చెందుతుంది. పంచదార చిలుక నదిలోతును తెలుసుకుందామని వెళ్ళి, ఆ ప్రయత్నంలో అది కరిగిపోయిందట. అదేవిధంగా, మానవుని దేహేంద్రియ మనో బుద్ధి అహంకారములు ఆత్మవిచారణలో అదృశ్యమవుతాయి" అని భగవాన్ వివరించారు.

(సశేషం)

దైవం మానవ రూపంలో...

ప॥ మానవతకు మాధవతకు శ్రీకారం
మానవుడై మసలినట్టి ఓంకారం!
సత్య ధర్మ శాంతి ప్రేమ సాకారం
ఇదే ఇదే సత్యసాయి అవతారం

చ॥ చేతలలో ప్రతిఫలించు అమరత్వపు అనుభవాలు
గుండెలోన పొంగిపొరలు మాతృత్వపు మధురిమలు
లీలామానుషరూపం ముక్తినొసగు దివ్యపథం
అనుభూతులు అనుగ్రహం ఆనందం అనంతం

చ॥ మాటలలో ప్రతిధ్వనించు మహిమాన్విత రాగాలు
నడతలో నడయాడును నాల్గువేద సారాలు
ప్రేమామృత స్వరూపం ప్రతి అణువు త్యాగమయం
సత్యసాయి జీవితమే విశ్వానికి సందేశం

- రమాప్రసాద్ ఆదిభట్ల

రేడియో సాయి

శ్రీ సత్యసాయీశు ప్రేమసందేశంబు
జగతికెల్లను జాటు శాంతి విరియ
భవతారకంబులౌ భజన గీతంబులు
వినిపించు వీనుల విందు సేయ
సజ్జనులను గూడి సంభాషణంబులు
సల్పు సత్యపథము జనులు దెలియ
బాలబాలికలకు వలయు నీతులనెన్నొ
పలురీతులుగ జెప్పు భవిత వెలయ
జగతి జనులెల్ల సుమతులై ప్రగతి గాంచి
మానవత్వపు విలువల మహిమ నెఱిగి
సాయిపథమున పయనించి హాయి నొంద
'రేడియో సాయి' నిచ్చె మా ఱేడు సాయి

- చిల్లరిగె శ్రీవిఠల్

జీవనదాత - ముక్తి ప్రదాత

❖ 'సాయిదాసు' ❖

"జనన మరణాలనేవే లేకుంటే నాకు కాలం ఎలా గడుస్తుంది..? భగవాన్ శ్రీ సత్యసాయీశ్వరులు ఒకానొక సందర్భంలో పూజ్యశ్రీ కస్తూరిగారితో అన్న మాటలివి. కాలస్వరూపులు, కాలకాలులు, కాలాతీతులు అయిన భగవాన్ తమకు శరణాగతులైన భక్తులలో కొందరిని మృత్యుముఖంనుండి కాపాడి, పునర్జీవితం ప్రసాదించి, అటుపై కొంతకాలానికి ఆయా వ్యక్తులు తమ కర్తవ్య కర్మలు ముగించుకొన్న తరువాత వారిని తమలో ఐక్యం చేసుకుంటారు. మరికొందరికి అంత్యక్షణాల్లో తమ దర్శన, స్పర్శన, సంభాషణలద్వారానో; లేదా, విభూతి, పవిత్ర గంగా తీర్థములు ప్రసాదించియో; ముక్తి అనుగ్రహిస్తారు.

ఈప్రకారం, "జీవనదాత - ముక్తిప్రదాత" అయిన భగవానుల దివ్యానుగ్రహంచేత మృత్యుకోరలనుండి బయటపడి, కొంతకాలము తమ కర్తవ్యకర్మలను పూర్తి చేసుకొన్న తరువాత అనాయాసంగా తుదిశ్వాస విడిచి వారి దివ్యపాద పద్మములలో ఐక్యమైన భక్తులలో ముగ్గురి పవిత్ర గాథలను ముందుగా పరిశీలిద్దాం:

పూజారి శేషగిరిరావుగారు:

పాతమందిరంలోనూ, ప్రశాంతి నిలయంలోనూ 14 సంవత్సరాలపాటు పూజాకైంకర్యములను నిర్వహిస్తూ భగవాన్‌ని అనన్య భక్తితో సేవించిన రావెల్ శేషగిరిరావుగారు, వృద్ధాప్యంతో శరీరము కృశించిపోగా, మరణావస్థకు చేరుకొని - "నాకు బంధవిముక్తి కలుగుచున్నది" అని తన చుట్టూ చేరినవారితో చెప్తుండగా, అంతలోనే భగవాన్ విచ్చేసి, **"నేను 'టికెట్' ఇవ్వకుండా ఎక్కడికి వెళ్ళగలవు?! లే! లేచి మందిరానికి వెళ్ళి నీ పనులు యథావిధిగా నిర్వర్తించు"** అన్నారు.

ఏ క్షణంలోనైనా తుదిశ్వాస వదలటానికి సిద్ధంగా ఉన్న శేషగిరి రావుగారు, స్వామి సంకల్పంతో, ఆ క్షణంలోనే నూతన జవసత్త్వాలను సంతరించుకొని, మరణశయ్యపైనుండి లేచివెళ్ళి, యథాప్రకారం తమ మందిర విధులు నిర్వర్తించ సాగారు. ఆరునెలల తరువాత ఆయన మరల ఆసుపత్రిలో చేరగా, ఒక సాయంకాలవేళ భగవాన్ ఆసుపత్రికి విచ్చేసి, ఒక గ్లాసులో పాలు తెప్పించి, స్వయంగా శేషగిరిరావు గారిచేత త్రాగించి, **"ఇక సర్వ చింతలూ మరచి శరీరమును విడిచి, పయనం సాగించు. ఇప్పుడు నేను నీకు అనుజ్ఞ ఇస్తున్నాను"** అని ఆశీర్వదించి నిష్క్రమించారు. ఒక గంట తిరక్కుండా శేషగిరిరావుగారు ప్రశాంతంగా కన్ను మూశారు. ఆయనచేత కర్మశేషమును అనుభవింపజేసే నిమిత్తమే ఆయన ఆయుర్దాయాన్ని ఆరు నెలలపాటు పొడిగించానని తర్వాతికాలంలో స్వామి భక్తులకు తెలిపారు.

స్వామి సన్నిధిలో పూజారి శేషగిరిరావుగారు

వాల్టర్ కోవన్‌గారు:

1971 డిసెంబరులో మద్రాసు (చెన్నై)లో జరిగిన శ్రీ సత్యసాయి సేవాసంస్థల సమ్మేళనంలో స్వామిని దర్శించుకొనేందుకు కోవన్ దంపతులు మద్రాసు చేరుకొని హోటల్‌లో విడిది చేశారు. క్రిస్మస్ ముందు రాత్రి, హోటల్ రూమ్‌లో వాల్టర్‌కోవన్ న్యూమోనియా వ్యాధితో క్రిందపడిపోగా, అదే హోటల్‌లో విడిదిచేసియున్న శ్రీమతి రతన్‌లాల్ సాయంతో, హోటల్ సిబ్బంది సహకారంతో, వాల్టర్‌ను సమీప ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్ష చేసి, ఆయన అప్పటికే మరణించినట్లు నిర్ధారించి; ముక్కు, చెవుల్లో దూదిపెట్టి, బెడ్‌షీట్ కప్పి, తెల్లవారిన తరువాత ఏదో ఒక నిర్ణయం తీసుకోవచ్చునని ఒక ఖాళీ గదిలో పార్థివ దేహాన్ని ఉంచారు.

పట్టలేని దుఃఖంతో శ్రీమతి ఎల్సీకోవన్ శ్రీమతి రతన్‌లాల్‌తో కలసి స్వామి సన్నిధికి వెళ్ళి ప్రార్థించగా, ఉదయం 10 గం॥లకు తాము ఆసుపత్రికి వచ్చి, వాల్టర్‌ను చూస్తామని చెప్పారు స్వామి. వాళ్ళిద్దరూ మరుసటిరోజు ఉదయం ఆసుపత్రికి వెళ్ళేసరికి వాల్టర్ కోవన్ బెడ్‌మీద సజీవంగా (కొంత నీరసంతో) నవ్వుతూ కనిపించడంతో సంభ్రమాశ్చర్యానందాలకు లోనయ్యారు. స్వామి అప్పుడే వచ్చి వెళ్ళారని తెలిసింది. ఆవిధంగా ఆ వృద్ధ అమెరికన్ మహిళకు స్వామి పతిభిక్ష పెట్టారు.

క్రమంగా వాల్టర్ కోవన్ పూర్తిగా కోలుకున్నాడు. ఆశ్చర్యం! అంతకుముందు ఉండిన డయాబిటీస్, తదితర దీర్ఘకాల రుగ్మతలన్నీ పునరుత్థానం చెందిన వాల్టర్ శరీరం నుండి మటుమాయమయ్యాయి. వాల్టర్ తన మరణ అనుభవాన్ని తోటి భక్తులకు వివరిస్తూ, తన శరీరంనుండి జీవం పోయిన తరువాత తాను ఒక సాక్షివలె తన శరీరాన్ని చూడగలిగానని చెప్పాడు. తనను స్వామి ఊర్ధ్వలోకాల్లోని ఒక న్యాయమూర్తి సమక్షంలో ప్రవేశపెట్టి, తన పూర్వ జీవితాల చరిత్రలన్నీ చదివించారనీ; వాల్టర్‌తో తమకు పని ఉందని ఆ న్యాయమూర్తితో చెప్పి, తిరిగి భూమిపైనున్న తన శరీరంలోకి తనను ప్రవేశపెట్టారని కూడా వాల్టర్ వాంగ్మూలం ఇచ్చాడు.

టస్టిన్‌కి (అమెరికా) తిరిగి వెళ్ళిన తరువాత వాల్టర్‌లో 20 ఏండ్ల క్రితం ఉండినటువంటి శక్తి, ఉత్సాహం తిరిగి వచ్చాయని ఆయన వ్యక్తిగత కార్యదర్శి ఒక లేఖద్వారా ఆస్ట్రేలియాలోని హోవర్డ్ మర్ఫెట్‌కు తెలియజేశారు. స్వామి అనుగ్రహంతో 80 ఏళ్ళ వయస్సులో పునరుత్థానం పొందిన వాల్టర్ అటుపై 18 నెలలు సుఖంగా జీవించి, తన 82వ ఏట తుదిశ్వాస విడిచారు.

1974 సం॥లో హోవర్డ్ మర్ఫెట్ అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా స్వామి – ముఖ్యంగా ఎల్సీకోవన్‌కు స్వామి పట్ల గల దృఢవిశ్వాసము, ప్రేమలే వాల్టర్ పునరుత్థానం పొందేందుకు కారణమైనాయని; అదీగాక ఆ వృద్ధాప్యంలో ఆమెకు తన భర్త పార్థివ దేహాన్ని అమెరికాకు తీసుకు వెళ్ళే శ్రమ, బాధలను తప్పించేందుకే వాల్టర్‌ను పునర్జీవితుడిని గావించామనీ వివరించారు.

కుప్పం రాధాకృష్ణయ్యగారు:

1945 అక్టోబరులో భగవాన్‌ని తొలిసారి దర్శించుకొన్న నాటినుండి, వారిని సాక్షాత్ దైవముగా నమ్మి కొలిచిన 'కుప్పం' కుటుంబపెద్ద రాధాకృష్ణయ్యశెట్టిగారు. 1953లో రాధాకృష్ణయ్య, భార్య రాధమ్మ, కూతురు విజయమ్మ (**'అన్యథా శరణం నాస్తి'** రచయిత్రి శ్రీమతి విజయ కుమారి), అల్లుడు హేమ్‌చంద్‌లతో కలసి దసరా ఉత్సవాలకు ప్రశాంతినిలయానికి వచ్చినప్పుడు ఆయన విపరీతమైన కడుపుబ్బరం, ఫిట్స్‌లాంటి వ్యాధులతో

మరణదశకు చేరుకున్నారు. ఆయన భార్య స్వామికి ఎన్నిసార్లు విన్నవించుకున్నా స్వామి పట్టించుకోనట్లే నటించారు. రాధాకృష్ణయ్యకు వెక్కిళ్ళు ప్రారంభమై నోటినుండి గురక రాసాగింది. దేహం నల్లబడింది. గోళ్ళు నీలంగా మారాయి. అక్కడే ఉన్న వేంకటగిరి రాజావారు, రాధాకృష్ణయ్యగారి మరణావస్థను చూడలేక, రాధమ్మతో, "అమ్మా! మీరు ఈయన్ని మీ ఊరు తీసుకెళ్ళండి. నా కారు ఇచ్చి పంపుతాను" అని ఎన్నిసార్లు చెప్పినా, "స్వామి ఎలా చెప్తే అలా చేస్తాను. స్వామి చెప్పనిదే ఈయనను ఇక్కడినుండి తీసుకెళ్ళను" అని దృఢంగా చెప్పారామె.

రాధాకృష్ణయ్య శరీరం కట్టెలా బిగుసుకుపోగా, రాధమ్మ స్వామి పాదాలు చుట్టుకొని పతిభిక్ష పెట్టమని ప్రార్థించారు. స్వామి, "చూద్దాం, పద!" అని ఆమెతో కలసి వారి వసతికి విచ్చేశారు. అందర్నీ బయటే ఉండమని చెప్పి, రాధాకృష్ణయ్య ఉన్న గదిలోకి వెళ్ళి స్వామి తలుపులు మూసుకున్నారు. కొద్ది నిమిషాల తరువాత, వేంకటగిరి రాజావారిని లోపలికి వచ్చి చూడమన్నారు. రాజావారు లోనికి వెళ్ళి చూచి, స్వామిని వేనోళ్ళ కీర్తిస్తూ వారి పాదపద్మములపై సాష్టాంగపడి నమస్కరించారు.

తరువాత రాధమ్మ, విజయమ్మ, హేమ్‌చంద్‌లు లోనికి వెళ్ళి చూస్తే, రాధాకృష్ణయ్య లేచికూర్చుని చిరునవ్వులు చిందిస్తూ కనిపించడంతో వాళ్ళు స్వామి పాదపద్మాలను కృతజ్ఞతాశ్రువులతో అభిషేకించారు. "స్వామీ! నాకు ఏమైంది? మీరు ఎందుకు నా తలవైపు కూర్చున్నారు?" అని ఎంతో అమాయకంగా అడిగిన రాధాకృష్ణయ్యతో స్వామి, **"నీకు ప్రసవమైంది"** అని వేళాకోళమాడారు. రాధమ్మను చూసి, **"చనిపోయాడు, చనిపోయాడు అని ఏడ్చారు కదా! చూడండి, ఎంత చక్కగా నవ్వుతున్నాడో!"** అన్నారు.

రాధాకృష్ణయ్య కుటుంబంలో అందరూ 60 ఏళ్ళకే మరణిస్తూండటంతో, ఆయనను అకాల మృత్యువునుండి కాపాడమని అంతకుముందు ఒకానొక సందర్భంలో రాధమ్మ ప్రార్థించగా స్వామి, **"తథాస్తు"** అన్నారు. ఆ సంగతి ఆ సమయంలో స్వామి రాధమ్మకు గుర్తు చేశారు.

"ఆయన వీలునామా వ్రాయలేదు. పిల్లలింకా చిన్నవాళ్ళు. పెళ్ళిళ్ళు చేయాలి. అందుకే రాధాకృష్ణయ్యను వెనక్కి రప్పించాను. ఇప్పుడు ఆయన జీవితాన్ని ఎన్నేళ్ళు పొడిగిస్తానో, రాబోయే జన్మలో అన్నేళ్ళ ఆయుర్దాయం తగ్గిస్తాను" అని స్వామి తరువాతి కాలంలో కస్తూరిగారితో అన్నారట.

ఇటీవల ప్రశాంతినిలయంలో కుప్పం రాధాకృష్ణయ్య గారి కుమార్తె **శ్రీమతి విజయమ్మగారితో** సంభాషించినప్పుడు, వారు స్వామి తమ తండ్రిగారిపై కురిపించిన అవ్యాజమైన వాత్సల్యమును గుర్తు చేసుకొని ఆనంద బాష్పాలు రాల్చారు. తండ్రిగారు తేదీ 4.2.1970 నాడు కుప్పంలో తుదిశ్వాస విడిచే సమయంలోకూడా స్వామి ఆయనకు తమ దర్శనభాగ్యం ప్రసాదించి తరింపజేశారని తెలుపుతూ, వారి అనుభవాన్ని ఈరీతిగా పంచుకున్నారు:

> *"ఆరోజున కుప్పం నుండి మాకు ఫోన్ కాల్ వచ్చింది, నాన్నగారు పోయారని. మామూలుగా ఆయన టిఫిన్ తిని స్నానం చేసి వచ్చిన తరువాత అమ్మ బట్టలు మారుస్తుంటే, "స్వామి వచ్చారు, స్వామి వచ్చారు" అంటూ అమ్మపై నెమ్మదిగా ఒరిగిపోయారట. అంతే! ప్రభువులో లీనమై పోయారు. హాలంతా విభూతి పరిమళంతో ఘుమఘుమలాడుతుంటే ప్రభువు దయకు అందరూ ప్రణతులర్పించారు.*
>
> *ఆ సమయంలో స్వామి బృందావన్‌లోనే ఉన్నారు. ఈ విషయం తెలుస్తూనే నేను పరుగెత్తుకుంటూ స్వామి నివాస మందిరానికి వెళ్ళి హాలు వెలుపల నిలబడ్డాను. ప్రభువు వెంటనే లోపలినుండి, **"కుమారమ్మా! రా!"** అని పిలిచి, **"యేం, నాన్న పోయాడా? ఎక్కడికి పోయాడు? నాలోనే ఉన్నాడు. ఇంత సునాయాస మరణం, ఎంత అదృష్టం! దర్శనం ఇచ్చి వచ్చాను కదా! మరి యెవ్వరూ ఏడ్వరాదు. భజన చేసుకొంటూ తీసుకువెళ్ళండి"** అని చెప్పి విభూతి సృష్టించి ఇచ్చి, **"ఈ విభూతిని ఒంటిపై రాసి నామం చేసుకుంటూ తీసుకు వెళ్ళండి"** అని సెలవిచ్చి, **"ఇదిగో, ట్యాక్సీ***

బుక్ చేయించాను. ఇద్దరూ వెళ్ళిరండి" అని అంటుంటే, వారి అపార కరుణకు కన్నీటిధారలతో ప్రణతులర్పించి బయలుదేరాను. కుప్పం చేరాక నాన్నగారిని చూస్తుంటే, వారి ముఖం ఎంతో ప్రశాంతంగా ఉంది. మరి ప్రభువును దర్శించి వారిలో లీనమైన ధన్యజీవి కదా!"

ధన్యజీవులు

"నాయందు స్థిరమైన విశ్వాసం కలిగియున్నవారికి ఇచ్చిన మాటను నేను తప్పక నెరవేరుస్తాను. తమ జీవితాలను నాకే అంకితం చేసినవారికి అంతిమ క్షణాల్లో నా దర్శన భాగ్యంకూడా అనుగ్రహిస్తాను" అన్నారు భగవాన్. ఈవిధంగా భగవాన్ దివ్యానుగ్రహ పరిధిలోనికి వచ్చినవారనేకులు తమ అంతిమ క్షణాల్లో సాయినామాన్ని స్మరిస్తూ, వారి దర్శన భాగ్యాన్ని పొంది ప్రశాంతంగా, ఆనందంగా మృత్యువు ఒడిలోనికి చేరుకొన్నారు. అటువంటి ధన్యజీవులలో మరికొందరి పవిత్ర గాథలను పరిశీలిద్దామా!

కొండమరాజుగారు: భగవాన్ తమ తాతగారైన కొండమరాజుగారి ప్రార్థనను మన్నించి ఆయనకు మరణ సమయంలో తీర్థం అనుగ్రహించి ముక్తి ప్రసాదించారు. ఈ సంఘటనగురించి భగవానులే స్వయంగా ఈ ప్రకారం వివరించారు:

"ఒక పర్యాయం కొండమరాజు, "స్వామీ! మీరు సామాన్యమైన బిడ్డ కాదు. సాక్షాత్తు ఈశ్వరుడే అని నాకు తెలుసు. నేను ప్రాణం వదిలేముందు మీ అమృతహస్తంతో నా నోటిలో నీరు పోయాలి" అని ప్రార్థించగా తప్పక అదేవిధంగా జరుగుతుందని మాట ఇచ్చాను. ఒకరోజున కొండమరాజు ఈశ్వరమ్మను పిల్చి, "సత్యమ్మ గుడితట్టు స్వామి వస్తున్నారేమో చూడు" అని చెప్పాడు. ఈశ్వరమ్మ బయటికి వచ్చి చూసి, "స్వామి కారులో వస్తున్నారు" అని చెప్పింది. "ఈశ్వరమ్మా! నన్ను తీసుకుపోవడానికి దేవు డొస్తున్నాడు. నాకిచ్చిన మాటను నిలబెట్టుకోవడానికి వస్తున్నాడు. ఒక గ్లాసులో నీళ్ళు తీసుకురా. అతను నా నోట్లో పోస్తాడు. నేను వెళ్ళిపోతాను" అన్నాడు. "మీకు జ్వరము లేదు, జబ్బు లేదు. ఎట్లా పోతారు?" అన్నది ఈశ్వరమ్మ. "మరణమునకు కారణాలు లేవు. అది దైవాజ్ఞ ప్రకారం జరుగుతుంది. కాబట్టి, నీవు కొంచెం నీరు తీసుకురా" అన్నాడు. ఈ ముసలాయనతో వాదించడ మెందుకని ఈశ్వరమ్మ ఆయన కోరినట్లుగా ఒక గ్లాసులో నీరు తీసుకువచ్చింది. అందులో ఒక తులసీదళం వేయించాడు. స్వామి తనను పంపించేకోసమనే వస్తున్నా డని ఆయనకు తెలుసు. అది మా ఇద్దరికే తెలుసు. ఆ నీళ్ళు తీసికొని నేను అతని నోట్లో పోయబోతుంటే, "వద్దు, వద్దు. ముందు మీరు త్రాగి తరువాత పోయాలి" అన్నాడు. అప్పుడు నేను కొంచెం త్రాగి అతని నోట్లో పోశాను. అప్పుడు కొండమరాజు, "స్వామీ, ఇంతటి అదృష్టము దశరథ మహారాజంతటివాడికే చిక్కలేదు. కానీ, నాకు చిక్కింది. నా జన్మ సార్థకమైంది" అని చెప్పి నవ్వుతూ నవ్వుతూ కన్ను మూశాడు. ఆ కుటుంబమువాళ్ళంతా అనాయాసంగానే పోయారు. అనగా, మంచికి మంచే జరుగుతుంది. వాళ్ళయొక్క పవిత్రమైన భావములవలన వాళ్ళకన్నీ పవిత్రంగానే జరిగాయి."

పెద్ద వెంకమరాజుగారు: 1963లో స్వామి తమ తండ్రిగారైన పెద్ద వెంకమరాజుగారికి ఆయన దేహం విడిచిపెట్టడానికి కొద్ది నిమిషాలముందు మందిరంలో తమ దర్శన స్పర్శన సంభాషణాదులను అనుగ్రహించారు. ఆ సందర్భమున తండ్రిగారు ఒక చిన్నసంచీలో కొంత చిల్లరడబ్బు స్వామి అమృతహస్తాలలో ఉంచుతూ, తనను మరణానంతరం తీసుకువెళ్ళేటప్పుడు పార్థివ దేహంపై ఆ డబ్బు చల్లించి ఋణవిముక్తుడిని గావించమని ప్రార్థించి, ఇంటికి వెళ్ళి తన మనుమడితో ఆడుకుంటూ ప్రశాంతంగా కన్ను మూశారు. భగవానులు తండ్రిగారి కోరిక ప్రకారమే చేయించి వారికి ముక్తిని ప్రసాదించారు.

ఈశ్వరమ్మగారు: 1972 మే 6వ తేదీ ఉదయం స్వామి బృందావన్‌లోని తమ నివాస మందిరంలో - కూర్చున్నపళంగా 'స్వామీ, స్వామీ, స్వామీ' అని పిలుస్తూ ఒరిగిపోతున్న మాతృశ్రీ ఈశ్వరమ్మగారితో, **'వస్తున్నా, వస్తున్నా, వస్తున్నా'** అంటూ ఆవిడ చెంతకు వచ్చి, తమ

స్వామి సన్నిధిలో కొండమరాజుగారు

పెద్ద వెంకమరాజుగారు,

మాతృశ్రీ ఈశ్వరమ్మగారు,

కరణం సుబ్బమ్మగారు

దర్శన స్పర్శన సంభాషణాదులతో ఆశీర్వదించి, అనాయాస మరణం ప్రసాదించి ఆ పుణ్యజననికి ముక్తి అనుగ్రహించారు.

కరణం సుబ్బమ్మగారు: తమ చిన్ననాటనే తమను సాక్షాత్ దైవముగా గుర్తించి, సేవలద్వారా ఆరాధించి, తమనే నమ్ముకొనియుండిన 'అభినవ యశోద' కరణం సుబ్బమ్మగారికి అంతిమక్షణాల్లో స్వయంగా దగ్గరుండి తీర్థమును ప్రసాదిస్తామని స్వామి వాగ్దానం చేశారు. కానీ, ఆమె తుదిశ్వాస విడిచే సమయానికి స్వామి మద్రాసులో ఉన్నారు. ఆవిడ బంధువులు స్వామిని మాట నిలబెట్టుకో లేకపోయారని విమర్శిస్తూ, ఆమె పార్థివ దేహమును అంత్యక్రియల నిమిత్తం తరలించడానికి సిద్ధమవుతూ ఉండగా, సరిగ్గా అదే సమయంలో స్వామి స్వయంగా కారు డ్రైవ్ చేసుకుంటూ మద్రాసు నుండి విచ్చేశారు. ఆవిడ పార్థివ దేహం ప్రక్కనే కూర్చుని, **'సుబ్బమ్మా! సుబ్బమ్మా!'** అని ప్రేమగా పిలువగా, ఆవిడ కన్నులు తెరిచి స్వామి దివ్యహస్తములను గట్టిగా పట్టుకొని, "స్వామీ! మీరిచ్చిన మాటను నిలబెట్టుకోవటానికి వచ్చారా?! ఎంత కరుణ మీకు!" అని ఆనందబాష్పాలు రాల్చింది. అప్పుడు స్వామి పావన గంగాతీర్థమును ఆవిడ నోట్లో పోసి, విభూతి ప్రసాదించి, ఆవిడ ప్రశాంతంగా దీర్ఘనిద్రలోకి జారుకొనేటట్లు అనుగ్రహించారు,

వెంకటమునిగారు: మహాభక్తాగ్రేసరులు, మద్రాసు వాస్తవ్యులు అయిన వెంకటమునిగారికి భగవాన్ ముక్తి ప్రసాదించిన పరమాద్భుత ఘట్టాన్ని కుప్పం విజయమ్మ గారు ఈప్రకారం వివరించారు:

"ప్రభువు మద్రాసుకు వేంచేయడం మా పాలి సంబరాల సందోహం. మా అక్కయ్య సుశీలమ్మ గారి ఇంట్లో వారు ఉండేవారు. ప్రభువున్నచోట 'నిత్యకల్యాణం పచ్చతోరణం' అన్నట్లు ఆనందమే మన సొమ్ము. ప్రభువు కొడైకెనాల్‌కి వెళ్ళాలని నిర్ణయించుకొని మా బావగారైన వెంకటముని గారిని, వారి అబ్బాయి ప్రవీణ్‌ని తీసుకు వెళ్ళారు. కొద్దిరోజులు అక్కడ ఆనందంగా గడిపి మదురైకి వచ్చి (13.6.1966), రామనాథన్ చెట్టియార్‌గారి ఇంట బసచేశారు.

*ఆరోజు రాత్రి భోజనాలయ్యాక అందరూ మేడపైకి వెళ్ళి పచార్లు చేస్తుంటే, ఇంటివారు అందరికీ గ్లాసుల నిండా పాలు తీసుకొని రాగా, స్వామి వెంకటమునిగారిని చూసి, **"ఉండు, నేను వచ్చి నీకు త్రాగిస్తాను"** అంటుంటే, "యెందుకు స్వామీ, నేనే త్రాగగలను" అన్నారట ఆయన. ఇంతలో కొద్ది నిమిషాల తరువాత ఆయన 'స్వామీ' అంటూ మెల్లగా వాలిపోతూండగా స్వామి వెంటనే దగ్గరికెళ్ళి, తమ తొడపై పడుకోబెట్టుకొని, విభూతి సృజించి ఆయన నోట్లో వేసి, ప్రక్కనే ఉన్న పాల గ్లాసునుండి కొద్దికొద్దిగా త్రాగిస్తూ; తమ పాద పద్మములను స్పృశించాలని ప్రయత్నిస్తున్న ఆయన చేతికి తమ పాదరాజీవములనందించగా, వాటిని*

గట్టిగా పట్టుకొని, కంటినిండా ప్రభువును దర్శించుకుంటూ, వారి ఒడిలోనే తలవాల్చి ప్రభువులో ఐక్యమయ్యారు వెంకటమునిగారు. చుట్టూ ఉన్న భక్తులందరూ కరములు జోడించి ప్రభువుకు ప్రణతులర్పించారు."

నరసమ్మగారు: ఈవిడ పాతమందిరం రోజులనుండే స్వామిని సాక్షాత్ భగవంతునిగా గుర్తించి, వారిని ఆశ్రయించి, వారి సన్నిధిలో సేవలు సల్పుతూ ఆధ్యాత్మిక సాధనతో జీవితం సాగించిన ఆదర్శ మహిళ. 1970 డిసెంబరులో గోవా పర్యటనలో ఉన్న భగవాన్ అక్కడినుండే ఆమెకు వ్రాసిన జాబులో, "నరసమ్మా! స్వామి నీ వెంట జంట ఉండి కంటికి రెప్పవలె కాపాడుతున్నారు. స్వామి ఈ సమయంలో ఇక్కడ లేరే అని చింతపెట్టుకో వద్దు. దేహము కృశించుచున్నది కనుక, నీవు సర్వ సంసిద్ధురాలివై ఉండు. దేహచింతన యేమాత్రమూ వద్దు, నిరంతరమూ దైవచింతనే చేస్తూ రా! దేహము పండిన తరువాత కుళ్ళిపోక తప్పదు, కుళ్ళిపోయినదాన్ని పారవేయక తప్పదు" అని వ్రాశారు.

నరసమ్మ అవసానదశలో, ప్రాణాలు జారిపోతున్న క్షణాల్లో, ఉన్నట్లుండి ఆమె తన చేతిని నోటివద్ద ఉంచుకొని, నోట్లో ఏదో వేసుకుని చప్పరిస్తున్నట్లుగా చుట్టూ ఉన్నవారందరికీ కనిపించింది. "ఇప్పుడే స్వామి ఇక్కడికి వచ్చి, విభూతి ప్రసాదాన్ని నా చేతిలో పెట్టారు" అని వారితో చెప్పి నరసమ్మ ప్రశాంతంగా కన్నుమూసింది. ఆ సమయంలో బృందావనంలో ఉన్న స్వామి, అక్కడే ఉన్న పెద్దబొట్టుగారితో, **"ఇప్పుడే నరసమ్మ వెళ్ళిపోయింది"** అని చెప్పారు. 1971 ఏప్రిల్ 18వ తేదీన ప్రశాంతినిలయంలో భక్తులకొసగిన దివ్యప్రసంగంలో స్వామి, నరసమ్మగారి భక్తిప్రపత్తులనుగురించి ఎంతగానో కొనియాడారు.

జానకీ అమ్మాళ్‌గారు: పూజ్యశ్రీ కస్తూరిగారి మాతృమూర్తి జానకీ అమ్మాళ్‌గారిని స్వామి ఎనలేని ఆదరంతో, ఎంతో ఆత్మీయంగా 'అవ్వా' (తమిళంలో 'పాటీ') అని పిలచేవారు. ఒకరోజున ఆవిడ, "స్వామీ! నేను కన్నుమూసే క్షణాల్లో మీ బంగారు చేతులతో నాకు గంగా తీర్థమును ప్రసాదించి, నన్ను విముక్తురాలిని గావించాలి" అని ప్రార్థించారు. అందుకు స్వామి, "ఓ అలాగే! తప్పక!" అని ఆమెకు మాటిచ్చారు.

కొంతకాలానికి, ఒకరోజు మందిరంలో భజనలో ఉన్న కస్తూరిగారికి, "మీ అమ్మగారు వాంతి చేసుకొని పడిపోయారు" అనే వార్తను చెప్పాడొక వ్యక్తి. వెంటనే ఆయన పరుగున ఇంటికి చేరి, తల్లిగారి ప్రక్కనే కూర్చుని, వైద్యునికి కబురంపే ప్రయత్నంలో ఉండగా, అంతలోనే ఆమె మంచం ప్రక్కనే ఉన్న శిరిడీ సాయి విగ్రహంలోనుండి గంగాజలం స్రవించసాగింది. ధన్యురాలైన ఆ మాతృమూర్తి తన అరచేతితో మూడుసార్లు ఆ తీర్థాన్ని సేవించి ప్రశాంతంగా కన్ను మూశారు.

ఆ సమయంలో బృందావనంలో ఉన్న స్వామి తమ చుట్టూ ఉన్న భక్తులతో, **"చూడండి! ఈ కస్తూరియే ఒక వృద్ధుడు. ఆయన తల్లి మరణించిందని చిన్నపిల్లవాడిలాగా ఎలా ఏడుస్తున్నాడో కదా!"** అని హాస్యోక్తిగా చెప్పారు. ప్రశాంతినిలయానికి తిరిగి వచ్చిన తరువాత కస్తూరి గారితో, **"మీ అమ్మ దేహంలో ఉన్న మలినాలన్నీ వెళ్ళి పోవాలనే ఆమె వాంతి చేసుకునేటట్లు చేశాను. ఆవిధంగా పరిశుభ్రమైన ఆమె దేహానికి పవిత్రమైన గంగాజలాన్ని ప్రసాదించాను"** అని చెప్పారు.

కస్తూరిగారు: 1987 ఆగస్టు 14వ తేదీన ప్రశాంతి నిలయం జనరల్ ఆసుపత్రిలో మరణశయ్యమీద ఉన్న తమ ప్రియ భక్తసేవకులు కస్తూరిగారివద్దకు వెళ్ళి, దర్శన, విభూతి ప్రసాదాలనుగ్రహించి, **"నన్నే తలచుకో! గడచినదాన్నికానీ, మరేదాన్ని గురించికానీ ఆలోచించకు"** అని చెప్పి స్వామి ఆయనకు ప్రశాంత మరణమును అనుగ్రహించి; ఆయన అంతిమయాత్రను వేదపఠనము, భజనలతో ఘనంగా జరిపించారు.

"కోఽహం" (నేను ఎవరిని?) అని రోదిస్తూ ఈ ప్రపంచంలోకి అడుగుపెట్టిన మానవుడు చివరికి మరణించే సమయంలో "సోఽహం" (నేనే దైవం) అనే ఎఱుకతో ఆనందంగా ఆఖరిశ్వాసను వదలాలి" అంటారు భగవాన్. ❖

'యత్ర గాయన్తి...'

❖ పి.వి. చలం ❖

శ్రీహరి నామసంకీర్తన చేస్తూ త్రిలోకాలు సంచరించే నారద మహర్షి ఒకనాడు శ్రీమహావిష్ణువు సమక్షానికి వెళ్ళి, "స్వామీ, త్రిలోకవాసుల సౌకర్యార్థం తమ శాశ్వత చిరునామా ఏదో తెలియజేయండి" అని ప్రార్థించాడు. శ్రీహరి చిరునవ్వులు చిందిస్తూ, "మద్భక్తాః యత్ర గాయన్తి తత్ర తిష్ఠామి నారద!" అని బదులిచ్చాడు. కాబట్టి, నామసంకీర్తన జరిగే ప్రతిచోటా నామి తిష్ఠ వేసుకొని కూర్చుంటాడని భక్తులకు పలు సందర్భాలలో భగవాన్ బాబావారు ఉద్బోధించారు. 'కలౌ స్మరణాన్ ముక్తిః' అని కూడా చాటి ఈ కలిలో నామసంకీర్తనకు గల విశేష ప్రాధాన్యతను తేటతెల్లం చేశారు. అందుకు అనుగుణంగానే సాయి భక్తులు సమాజసేవలతోపాటు నగరసంకీర్తనలు, భజనలతో తమ సాధనామార్గాన్ని తీర్చిదిద్దుకుంటున్నారు.

నిజానికి ఒకప్పుడు అత్యంత వైభవంగా పల్లెపల్లెలో వెల్లివిరిసిన భజన సంప్రదాయం మధ్యకాలంలో కొంత మందగించగా స్వామి తమ బాల్యంలో పుట్టపర్తిలో 'పాండురంగ భజన మండలి' స్థాపించి భజనకు పూర్వ వైభవం తెచ్చారు. ఆరోజుల్లో భక్తులకు మార్గనిర్దేశం చేస్తూ భగవాన్ బాబావారు భజన పాటలు రచించి, బాణీలు కట్టి, స్వయాన పాడి, పాడిస్తూ ఉండేవారు.

సాయి భక్తులకు భజనలంటే ప్రాణసమానం. కొత్త భక్తులు సాయిసంస్థలపట్ల ఆకర్షితులవడానికి ఈ భజనలు తొలిమెట్టు. "యత్ర గాయన్తి తత్ర తిష్ఠామి" అన్న అమృత వాక్కులపై పరిపూర్ణ విశ్వాసంతో సాయి భక్తులు భజన జరిగే ప్రతిచోటా స్వామి వచ్చి ఆసీనులవటానికి అనువుగా భక్తిప్రపత్తులతో చక్కటి సింహాసనాన్ని ఏర్పాటుచేస్తారు. అనేక సందర్భాలలో స్వామి విచ్చేసి సింహాసనారూఢులైన గుర్తులు స్పష్టంగా గోచరమై భక్తులను ఆనందాబ్ధిలో ఓలలాడిస్తూ ఉంటాయి. అలాగే ఒక్కోసారి స్వామి ఆగమన సూచకంగా దివ్యపరిమళాలు భజన జరుగుతున్న ప్రదేశాన్ని ముంచెత్తుతాయి. మరికొన్ని సందర్భాలలో స్వామి పటాలకు అలంకరించిన పూలు కదిలి క్రిందకి జాలువారుతూంటాయి. పూలమాలలు కదులుతూ ఉంటాయి.

అటువంటి దివ్యసంఘటనలను ముచ్చటగా కొన్నింటిని స్మరించుకుందాం.

పాల్ఘాట్‌లోని ఒక వృద్ధురాలి ఇంట్లో భజన సమయంలో స్వామి ఫోటోకు వేసిన పూలదండ పాటకు అనుగుణంగా కదులుతూ ఉండేది. అంటే, నెమ్మదిగా పాడేటప్పుడు నెమ్మదిగానూ, స్పీడుగా పాడేటప్పుడు స్పీడుగానూ కదులుతూ ఉండేది. మిగిలిన ఫోటోలకు వేసిన దండలలో మాత్రం ఎటువంటి చలనమూ ఉండేదికాదు. ఆ అద్భుత లీలకు మురిసిపోయిన వృద్ధురాలు ఆ లీలను వివరిస్తూ కస్తూరిగారికి ఉత్తరం వ్రాసింది.

ఆ ఉత్తరం చూసిన కస్తూరిగారు ఎంతో ముచ్చటపడి పాల్ఘాట్‌లోని ఆ వృద్ధురాలి ఇంటికి చేరుకున్నారు. భజన ఆరంభమైంది. కానీ, రోజూ జరుగుతున్నదానికి భిన్నంగా, స్వామి ఫోటోకు వేసిన దండలో ఎటువంటి కదలికా లేదు. కస్తూరిగారు నిరాశ చెందారు. పాల్ఘాట్ వృద్ధురాలు బాధపడింది. కస్తూరిగారికి తాను వ్రాసిన అనుభవం అభూత కల్పనగా భావిస్తారేమోనన్నది ఆవిడ బాధ. స్వామి నిదర్శనంగా చూపిన లీలను తాను గర్వంగా ప్రదర్శించటం నచ్చక లీలను ఆపేశారేమోనన్నది మరో బాధ. తన తప్పును మన్నించమని స్వామిని వేడుకో నారంభించింది ఆ వృద్ధురాలు.

కస్తూరిగారిలోకూడా ఆవిధంగానే అంతర్మథనం మొదలైంది. "స్వామి సామీప్యాన్ని అనుభవిస్తూ అను నిత్యం అనేకానేక అద్భుత లీలలను ప్రత్యక్షంగా ఆస్వాదించే అదృష్టానికి నోచుకొనికూడా నేను ఈ వృద్ధురాలి ఉత్తరానికి స్పందించి ఇలా రావటం తప్పే కదా...! స్వామి అనంతశక్తిని సరిగ్గా అవగతం చేసుకోలేకపోయినట్లే కదా!" అంటూ తర్కించుకోసాగారు.

ఇలా పాల్ఘాట్ వృద్ధురాలిలోనూ, కస్తూరిగారిలోనూ అంతర్గత మథనం మొదలు కాగానే భజన కనుగుణంగా పూలమాల నాట్యం చేయనారంభించింది. తమ తప్పులను మన్నించి స్వామి యథావిధిగా తమ దివ్యలీలను కొనసాగించినందుకు వారిరువురూ మురిసిపోయారు.

అదీ స్వామి సంస్కరణావిధానం. భక్తులు కేవలం భగవంతుని లీలావిశేషాలకే పరిమితం కాకుండా, భగవంతుని అపార శక్తిని, సర్వాంతర్యామిత్వాన్ని అవగతం చేసుకోవాలని చెప్పకయే చెప్పిన అద్భుత సంఘటన ఇది. ఆ కోవలోనే మన హృదయాలను మరింత స్థిరం చేసుకోవటానికి దోహదపడే మరో లీలను ఆస్వాదిద్దాం.

కుమారస్వామి కొలువైయున్న ప్రముఖ పుణ్యక్షేత్రం పళనిలోని శ్రీ సత్యసాయి మందిరంలో అత్యంత ఆకర్షణీయమైన స్వామి ఫోటో ఉన్నది. ఆ ఫోటోను అను నిత్యం అందమైన పూలమాలతోను, రంగురంగుల పూలతోనూ అలంకరించి భజనలు సలుపుతూ ఉండేవారు. ప్రతి రోజూ భజన సమయంలో స్వామి ఆశీర్వాద సూచకంగా ఫోటోపై అలంకరించిన పూలు క్రిందికి జాలువారటం పరిపాటి.

అయితే, ఒకనాటి భజన సమయంలో స్వామి ఫోటో పైనుండి పూలు జాలువారలేదు. అందరిలో ఆవేదన మొదలైంది. తామేదయినా తప్పు చేశామా...? అన్న భావం తొలిచివేయసాగింది. పూలు ఫోటోపైనుంచి జాలువారేవరకూ భజన కొనసాగించాలని నిర్ణయించారు. భజన తారాస్థాయిలో కొనసాగుతోంది. రాత్రి పదకొండు గంటలైంది. పూలు జాలువారలేదు. ఒక్కొక్కరు భజన నుంచి నిష్క్రమించసాగారు. తొమ్మిదిమంది మహిళలు మాత్రం అత్యంత భక్తిశ్రద్ధలతో భజన కొనసాగించారు. అర్ధరాత్రి దాటింది. అయినా పూవు పడలేదు. మహిళామణుల భక్తిశ్రద్ధలు సడలలేదు. భజన ఆగలేదు. తెల్లవారురుఝామున బ్రహ్మముహూర్త సమయంలో స్వామి ఫోటోకు వేసిన మాల ఎవరో వచ్చి కొలిచి కత్తిరించినట్లు తొమ్మిది సరిసమానమైన ముక్కలుగా తెగి, పడింది. ఆ మహిళా భక్తుల ఆనందానికి అవధులు లేవు. స్వామి అపార కరుణకు పులకరించి వారి ఫోటోకు ప్రణమిల్లారు. భజన కొనసాగించాలని అందరూ నిర్ణయించారుగానీ చివరిదాకా నిలబడ్డవారు మాత్రం తొమ్మిదిమందే!

"మద్భక్తః యత్ర గాయన్తి తత్ర తిష్ఠామి నారద" అన్న దివ్యవాక్కును శ్రీ సత్యసాయి భగవానులు నిజం చేసి చూపిన అపురూప సంఘటన ఇది. దీక్షాదక్షతలకు లభించిన గొప్ప వరం అది.

ఇంతవరకు మనం బాబావారు తమ ఉనికిని భజనలో ఫోటోలకు వేసిన పూలదండల కదలికద్వారా నిరూపించిన వైనాన్ని తెలుసుకున్నాం. దీనికి భిన్నంగా జరిగిన మరో సంఘటన ఇప్పుడు చవిచూద్దాం.

దావణగెర్‌లోని కస్తూరిగారి ఇంట్లో ప్రతి గురువారం నాడు భజన జరుగుతూండేది. ఒకనాడు స్వామి కస్తూరిగారితో, "గురువారంనాడు మీ ఇంట్లో భజన జరిగే గంటసేపూ నాకు చెవిపోటు వస్తోంది" అన్నారు. ఆ మాటలకు కాస్త కంగారుపడ్డ కస్తూరిగారు, "స్వామీ, నా గొంతు అంత బాగుండదని నాకు తెలుసు. అందుకని నాలో నేను కూనిరాగాలు తీస్తూ ఉంటానుకానీ పైకి

పాడను” అన్నారు. దానికి స్వామి, “నీగురించి కాదు నేనంటున్నది. మీ పక్కింటి ఆయన వచ్చి మిగిలినవాళ్ళ కన్న ఎక్కువ శ్రుతిలో పాడుతూ ఉంటాడు. కర్ణకఠోరంగా ఉంటోంది. కాస్త శ్రుతి తగ్గించి పాడమను” అన్నారు.

ఎక్కడ ఏ భజనలో ఎవరెవరు ఎలా పాడుతున్నారో సర్వాంతర్యామికి తెలియదా?! తత్సంబంధమైన మరో లీలను స్మరించుకుందాం.

ఒకసారి బెంగళూరులో డా॥ పద్మనాభన్‌గారి ఆధ్వర్యంలో అఖండ భజనకు ఏర్పాట్లు జరిగినవి. స్వామి స్వయాన విచ్చేసి ప్రారంభించటమే కాకుండా తమ గానమాధుర్యంతో భక్తులను పారవశ్యంలో ఓలలాడిస్తు ఉన్నారు. ఇంతలో ఒక వ్యక్తి ఒంటినిండా శాలువా కప్పుకొని డా॥ పద్మనాభన్‌గారివద్దకు వచ్చి “స్వామిని కలవవచ్చా?” అని అడిగాడు. “ఎందుకు?” అని అడిగారు పద్మనాభన్‌గారు. అప్పుడు ఆ వ్యక్తి తాను బొల్లివ్యాధితో బాధపడుతున్నానని; ఆ తెల్లని మచ్చలతో తన శరీరం వికృతంగా మారిందని; ఆ కారణంవల్ల పదిమందిలోకి వెళ్ళలేకపోతున్నానని చెపుతూ, “స్వామి మహిమాన్విత మూర్తి అని విన్నాను. వారిని దర్శించుకుంటే నా వ్యాధి తగ్గుతుందన్న ఆశతో వచ్చాను. దయ ఉంచి నేను స్వామిని కలవటానికి అనుమతించండి” అంటూ వేడుకున్నాడు.

“స్వామి అనుగ్రహం పొందటానికి వారిని కలవాలనేం లేదు. మీరు ఎక్కడ ఉన్నా ఆర్తితో ప్రార్థిస్తే స్వామి అనుగ్రహాన్ని పొందవచ్చు. దానికి నా అనుమతి ఎందుకు?” అంటూ పద్మనాభన్‌గారు అక్కడినుండి వెళ్ళిపోయారు. ఆ వ్యక్తి నిరాశతో అక్కడే కూర్చుండిపోయారు.

ఒక గంటసేపు భజనలో పాల్గొన్న తరువాత బాబావారు పద్మనాభన్‌గారి ఇంటికి వెళ్ళారు. రాత్రి 11 గంటల సమయం. బయట కుంభవృష్టి. స్వామి పద్మనాభన్‌గారిని పిలిచి, “వెంటనే మనం అఖండ భజన జరుగుతున్నచోటికి వెళ్ళాలి. కారు తీయి” అన్నారు.

“స్వామీ, ఈ అర్ధరాత్రివేళ, అందులోనూ ఇలా కుంభవృష్టి కురుస్తున్న సమయంలో వెళ్ళడం ఎందుకు స్వామీ...!” అన్నారు పద్మనాభన్‌గారు మెల్లిగా.

స్వామి ఆయన మాటలు పట్టించుకోకుండా భజనకు వెళ్ళితీరాల్సిందే అన్నారు.

స్వామి మాటకు ఎదురేముంది! కారులో భజన జరుగుతున్న హాలుకు సరిగ్గా 12 గంటలకు చేరుకున్నారు. ఒక భక్తుడు, “దర్శన్ దిఖావో మేరే సాయి నందలాల” అన్న పాటను అత్యంత ఆర్తితో పాడుతున్నాడు. స్వామి నేరుగా ఆ పాడుతున్న వ్యక్తివద్దకు వెళ్ళి నిలబడ్డారు. అతను తన్మయత్వంతో కళ్ళు మూసుకొని పాడుతూ ఉండటంవల్ల స్వామిని గమనించలేదు. అతని గాన ప్రవాహానికి భంగం వాటిల్లకుండా స్వామి ఆ గాయకుని శిరస్సుపై తమ కుడిచేతిని కొంత సమయం ఉంచి తీశారు. ఆ గాయకుడెవరో కాదు, అంతకుముందు స్వామిని కలవాలని వచ్చిన బొల్లివ్యాధిగ్రస్తుడే! అత్యద్భుతం! స్వామి దివ్యస్పర్శతో అతని బొల్లివ్యాధి మటుమాయమైంది! స్వామి పద్మనాభన్‌గారి ఇంటికి కారులో ప్రయాణమయ్యారు.

“స్వామీ, తాము ఆ భక్తుని వ్యాధిని రేపు ఉదయం నివారించవచ్చు కదా! ఇంత వర్షంలో అర్ధరాత్రివేళ బయలుదేరారెందుకు?” అని ప్రశ్నించగా దానికి స్వామి, “దర్శన్ దిఖావో మేరే సాయి నందలాల” అని ఆర్తితో అతను ఇప్పుడు గానం చేస్తుంటే రేపటిదాకా ఎలా ఆగగలను?” అన్నారు చిరునవ్వులు చిందిస్తూ. అదీ ఆర్తత్రాణపరాయణత్వం అంటే!

ఇటువంటి అద్భుత సంఘటనలనెన్నింటినో మన సత్సంగాలలోనూ, ప్రత్యక్షంగా అనుభూతుల్ని పొందిన భక్తులు వ్రాసిన పుస్తకాలలోనూ చవిచూస్తూనే ఉంటాం. కాస్త నిశితంగా పరిశీలిస్తే, ఈ సంఘటనలద్వారా స్వామి మనకు బోధిస్తున్న విషయం అర్థమవుతుంది.

ప్రతి భజనకూ స్వామి సమయపాలన పాటిస్తూ వచ్చి సింహాసనంలో ఆసీనులవుతారనీ; ఎవరెవరు ఏవిధంగా పాడుతున్నదీ స్వామికి సువిదితమేననీ; భజనకు వచ్చే ప్రతి ఒక్కరి ప్రవర్తనా స్వామి గమనిస్తూ ఉంటారన్న విషయాన్ని గుర్తెరిగి మసలుకోవాలి.

ఈ విషయాలు వ్రాస్తుంటే స్వామి చెప్పిన ఒక సంఘటన గుర్తుకొస్తున్నది.

ఒకరోజు శ్రీ రామకృష్ణ పరమహంస సమక్షంలో ఒక ఆధ్యాత్మిక కార్యక్రమం జరుగుతోంది. అందులో పరమహంస శిష్యురాలైన రాణి రాసమణి కూడా పాల్గొంటున్నారు. ఉన్నట్లుండి పరమహంస ఒక్క ఉదుటున లేచి వచ్చి ఆమె చెంప ఛెళ్ళుమనిపించారు. అక్కడ కూర్చున్నవారందరూ దిగ్భ్రాంతులయ్యారు. రాసమణి నివ్వెరపోయి పరమహంస వంక చూడగా, "ఇక్కడ ఆధ్యాత్మిక కార్యక్రమంలో కూర్చొని కోర్టు సంగతులు ఆలోచిస్తావా?" అని వారు మందలించారు. తన ప్రవర్తనకు సిగ్గుపడి ఆమె క్షమాపణ వేడుకున్నారు.

ఆమెకి పరమహంస నేర్పిన ఈ పాఠం మనందరికీ కూడా వర్తిస్తుంది. భజనలో సర్వసాధారణంగా జరిగే పొరపాట్లను, మన ప్రవర్తనను అది గుర్తుచేస్తుంది. అటువంటివాటిలో మచ్చుకు కొన్ని....

1. భజన సమయంలో భగవంతుని ధ్యాస తప్ప అన్యధ్యాస ఉండకూడదు.

2. భజన జరుగుతున్నప్పుడు అటూ ఇటూ చూడటం, పక్కవాళ్ళతో గుసగుసలాడటం, పదేపదే అటూ ఇటూ వెళ్ళిరావటం వంటివి చేయకూడదు. దానివల్ల ఇతర భక్తుల ఏకాగ్రతకు భంగం వాటిల్లుతుంది.

3. భజన సమయంలోనైనా సెల్‌ఫోన్లను నిద్రపుచ్చాలి.

4. అలాగే వాయిద్యాల ధ్వనులు హాయిగా, ఆహ్లాదంగా భజన స్థాయిని పెంచేవిగా ఉండాలేగానీ, కేవలం బ్యాండుమేళంలాగా హోరెత్తిస్తూ, పాటలలోని పదాలు వినేవారికి అర్థం కాకుండా అయోమయాన్ని సృష్టించకూడదు.

5. భజనలో మొదటి వరుసలో కూర్చుని భజన మొత్తం తమ కనుసన్నలలో జరుగుతోందన్న భావం అందరికీ కలిగేటట్లుగా మాటిమాటికి వెనక్కి తిరిగి 'నువ్వు పాడు, నువ్వు పాడు' అన్నట్లు కళ్ళతోనూ, చేతులతోనూ సంజ్ఞలు చేయటం నిషిద్ధం. భజన పాటలు పాడేవారు ఒక క్రమంలో కూర్చుని ఒకరి తరువాత ఒకరు పాడాలి.

6. పాడాలన్న తపన ఉండటం మంచిదే కానీ, ఆ పాట భజన స్థాయికి తగ్గట్టుగా ఉందా అని ఎవరికి వారు ఆలోచించుకోవాలి. తగిన సాధన చేసి అర్హత సంపాదించుకోవాలేకానీ తగుదునమ్మా అని అత్యుత్సాహం ప్రదర్శించి భజన మాధుర్యాన్ని చెడగొట్టగూడదు.

భగవంతుని సమక్షంలో భజనలో పాల్గొనే అదృష్టానికి మురిసిపోతూ, క్రమశిక్షణతో అందరం కలసి చేసుకునే ఈ సామూహిక ఆధ్యాత్మిక సాధనలో ఎటువంటి అపశ్రుతులూ దొర్లకుండా చూసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత. కలియుగ మానవాళి ఉద్ధరణకు ఉద్దేశించిన ఈ అద్భుత ఆధ్యాత్మిక సాధనను సార్థకమైనరీతిలో ఆచరించి కృతార్థులమవుదాం. ❖

వందే గురూనామ్

శ్రీ రత్నాకర దివ్యవంశ విలసద్దత్తావతారం విభుం
భారద్వాజ గోత్రోద్భవం ప్రభువరం శ్రీ సత్యసాయీశ్వరం
దివ్యానుగ్రహ విగ్రహం గురువరం సాక్షాత్కృతం దైవతం
శివశక్తిరూపిణ మహమ్ వందే తామ్ భగవన్

– మైలవరపు లక్ష్మీనరసింహం

ఇంటర్వ్యూ ఇన్నర్వ్యూ

ప్రారబ్ధాన్ని కూడా జయించవచ్చు

భక్తుడు: స్వామీ! సంచిత ప్రారబ్ధములు మానవుని వెంటాడుతూ ఉంటాయికదా! వానినుండి తప్పించుకునే మార్గమే లేదా?

స్వామి: కొందరు "నుదుటన్ వ్రాసిన వ్రాత తప్పింప తరమా నూరేళ్ళు చింతించినన్" అంటారు. కానీ, తప్పకుండా సంచిత ప్రారబ్ధ కర్మలను భగవంతుని అనుగ్రహంతో తప్పించుకోవచ్చు. అన్నిటికంటే భగవంతుడు అధికుడుగా ఉన్నాడు కనుక, ఈ విషయంలో సందేహం లేదు. అయితే, అందుకై ప్రార్థించరాదు. కేవలం భగవంతుని అనుగ్రహానికై ప్రార్థించి, ఆ ప్రేమను పొందినప్పుడు ప్రారబ్ధము దానంతటదే పోవటానికి అవకాశం ఉంది.

ప్రారబ్ధము మనం ప్రస్తుతం అనుభవించేది. సంచితము ఇంతకు ముందు ఉన్నది. ఆగామి రాబోవునది. ఈ ప్రారబ్ధాన్ని సంచితమునుండి అనుభవిస్తున్నాం. స్టోర్ రూమ్‌లో ఉన్నది సంచితము. ఆరోజు వండుకున్నది ప్రారబ్ధము. ఈరోజు తిన్నది రేపు మనకు ఫలితము వస్తుంది. ఒక్కొక్కసారి త్రేపు రూపంలో బయటికి వస్తుంది. స్టోర్ రూములో ఉన్నది బియ్యము. దానిని మనం పులిహోర, చక్కెర పొంగలి, దద్యోజనం, అన్నం, ఇడ్లీ, దోసె ఏవైనా చేసుకోవచ్చు. దానిని సాత్వికంలోకి మార్చుకోవచ్చుకదా! బియ్యంలో రాళ్ళు ఉంటే ఏరుకునే ప్రయత్నం చేయటంలేదా? అలాగే సత్కర్మలు ఆచరిస్తూ ఉండడంవలన ప్రారబ్ధం కొంతవరకు నిర్మూలనమవుతుంది.

ఒక చిన్న ఉదాహరణ: బస్సు పోతుంటే దాని వెంబడే 'దస్టు' (దుమ్ము, ధూళి) వస్తూ ఉంటుంది. బస్సు ఆగినప్పుడే ఆ 'దస్టు' దానిమీద పడుతుంది; ఆగకుండా పోతున్నంతవరకు బస్సుపై 'దస్టు' పడదు. అట్లాగే, జీవితమనే బస్సు పోతుంటే, ప్రారబ్ధమనే 'దస్టు' వెంట వస్తుంది. సత్కర్మలు చేస్తూ ఉంటే 'దస్టు' పడదు. రోడ్డు అంతా ఒకటిగా ఉండదు కదా! మన జీవితంలోకూడ కర్మ (వర్క్), భక్తి (వర్షిప్), జ్ఞానము (విజ్‌డమ్) అని రోడ్డు మూడు రకములుగా ఉంటుంది. మట్టిరోడ్డులోనే 'దస్టు' ఎక్కువగా ఉంటుంది. కొంత దూరం పోయాక 'తార్ రోడ్డు' వస్తుంది. అప్పుడు 'దస్టు' ఎక్కువ రాదు. ఇంక, 'హైవే రోడ్డు'కు పోతే అక్కడ 'దస్టు' అసలు రాదు. కర్మమార్గము - సమితి రోడ్డు (మట్టిరోడ్డు); భక్తిమార్గము - పరిషత్ రోడ్డు (తార్ రోడ్డు); జ్ఞానమార్గము - హైవే రోడ్డు. అన్ని కర్మలూ భగవత్ప్రీత్యర్థం చేయాలి.

ధ్రువుడు, మార్కండేయుడు ప్రారబ్ధాన్ని జయించారు. పుట్టినప్పటినుండి మార్కండేయుని తల్లిదండ్రులు ఈశ్వరుని పూజించటంవల్ల వారి భక్తి ఈశ్వరుని సంకల్పాన్నే మార్చింది. కనుక, ప్రారబ్ధ సంచితములగురించి బాధ లేదు. ఇది ఎప్పటికైనా అనుభవించవలసిందే అయితే ఇంక సత్కర్మల ఫలమేమి?! భగవదనుగ్రహం ప్రారబ్ధాన్నికూడా తొలగిస్తుంది. ఒక చిన్న ఉదాహరణ: ఇంజెక్షన్ బాటిల్ ఒకటి ఉన్నది. 1970వరకు మాత్రమే దాని 'పవర్' ఉన్నది. 71లో దానికి 'పవర్' లేదు. అదేరీతిగా, మన జీవితంలోనూ ప్రారబ్ధము ఉండవచ్చు. భగవత్ అనుగ్రహంవల్ల 'టైమ్ బార్' చేయవచ్చు. ప్రారబ్ధము బాధిస్తుందా? ఆగామి కరిగిపోదా? సంచితము పెరుగుతుందా? అని చింతించనక్కర్లేదు. భగవదనుగ్రహానికి పాత్రులైతే అన్నీ దూరమవుతాయి. ❖

శ్రీ సత్యసాయి సేవాసంస్థలద్వారా పశువైద్య సేవలు

డా॥ పి.వి. పున్నయ్య

"గ్రామసేవలలో వైద్యసేవలు ముఖ్యమైనవి. మూగజీవులకు అందించే సేవలు చాలా అవశ్యమైనవి. కారణం? అవి చెప్పలేవు కనుక. పశు - శిశు వైద్యములు ఒక్కతీరుగానే ఉంటాయి. మనమే గుర్తించి సేవలు అందించాలి. అంతేకాదు. గ్రామీణుల జీవనానికి, వ్యవసాయమునకు అనుబంధముగా పశువులు తమవంతు సాయమందిస్తూ త్యాగనిరతని చాటుకుంటున్నాయి. కనుక, మనము పశువైద్యసేవలను కూడా గ్రామసేవలలో భాగముగా భావించి తగిన సహాయం చేయాలి. సహనం, నిబద్ధత, నేర్పు, ప్రేమ, భక్తిశ్రద్ధలు, సానుభూతి, దయ వంటి సుగుణాలు మీ గ్రామసేవలలో ప్రతిబింబించాలి. అప్పుడే గ్రామసేవలు రామసేవలుగా మారతాయి. ఇదే గ్రామసేవల పరమార్థము. తగినవిధముగా సేవలందించి ఆనందించండి."

భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారు 1987వ సం॥లో ప్రశాంతినిలయంలో వైద్యులు, పశువైద్యుల నుద్దేశించి చేసిన అనుగ్రహభాషణంలో అందించిన పైసందేశమును స్ఫూర్తిగా తీసుకొని, గత మూడు దశాబ్దములుగా గ్రామీణ ప్రాంతములలో, ముఖ్యముగా పశువైద్యశాలలు లేని మారుమూల ప్రాంతములలో ఈ దిగువన పేర్కొన్న పశువైద్య సేవలు శ్రీ సత్యసాయి సేవాసంస్థలద్వారా అందించడం జరుగుతున్నది.

1. ఎద్దులు, ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, కోళ్ళు వగైరా జీవాలకు సాధారణ వ్యాధులు గుర్తించి, తగిన చికిత్స చేయుట. అంటువ్యాధులు ప్రబలకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయుట.

2. 'డీవార్మింగ్ ప్రోగ్రామ్' క్రింద నులి పురుగులు, ఇతర అంతర పరాన్న జీవుల నిర్మూలనకై దూడలు, పాడిపశువులు, గొర్రెలు, మేకలకు తగిన సమయంలో నట్టలమందు త్రాగించుట (సామూహికంగా); పేలు, గోమార్లు వంటి బాహ్య పరాన్న క్రిముల నివారణకు 'స్ప్రే'ద్వారా మందులు చల్లుట.

3. మేలుజాతి పశుగ్రాసము పంటలకుగాను గడ్డి విత్తనములు సబ్సిడీపై ప్రభుత్వ శాఖద్వారా కొనుగోలు చేసి, బీదరైతులకు ఉచితముగా పంపిణీ చేయుట.

4. అధిక పాల దిగుబడి, పశు ఆరోగ్య పరిరక్షణ, చూడి పశువుల పోషణ, దూడల పరిరక్షణ నిమిత్తం లవణ మిశ్రమం, లివర్ టానిక్‌లు, కాల్షియం ద్రావణం వంటి బలవర్ధక ఔషధములు పంపిణీ చేయుట.

5. పశువైద్య శిబిరముల నిర్వహణలో భాగముగా పశువులను నియంత్రించే ఇనుప చట్రము (ట్రెవిస్)లు శాశ్వత ప్రాతిపదికన ఏర్పాటు చేయుట - తద్వారా తగిన రక్షణతో పశువులకు వైద్యపరీక్షలు నిర్వహించుట సులభమవుతుంది.

6. గర్భకోశ వ్యాధుల్ని గుర్తించి, వైద్యం అందించడం ద్వారా పశువులలో పునరుత్పత్తి (రీప్రొడక్షన్) సామర్థ్యం పెరిగి సకాలంలో చూలుకట్టి, ఈని పాలు ఇస్తాయి.

7. వేసవిలో పశువులకు త్రాగునీటి వసతి నిమిత్తము 'సామూహిక నీటితొట్లు' గ్రామపంచాయతీ సహకారముతో నిర్మించుట.

మూగజీవాల దాహార్తిని తీర్చే నీటితొట్టి

8. రోగ నిర్ణాయక నమూనాలను పశువైద్య శిబిరములవద్దనే, అప్పటికప్పుడే పరీక్షించి, రోగ నిర్ధారణ చేయుట (స్పాట్ క్లినికల్ ఇన్వెస్టిగేషన్)

9. రైతు అవగాహన సదస్సుల నిర్వహణ.

10. పశుబీమా పథకముద్వారా బీదరైతులకు బీమా సదుపాయము ఏర్పరచుట.

పైన పేర్కొన్న సేవల్లో పశువైద్య కళాశాల, హైద్రాబాద్ వైద్యవిద్యార్థులు మరియు పశుసంవర్ధక శాఖలో కొత్తగా చేరిన వైద్యసిబ్బందికూడా పాల్గొని క్షేత్రస్థాయి అనుభవంతోపాటు శ్రీ సత్యసాయి సేవాసంస్థలలోని విలువలతో కూడిన సేవలపై అవగాహన పొందుతున్నారు.

గోసేవలు

నగర ప్రాంతములోని దేవాలయ ప్రాంగణములలో ఉన్న గోశాలలోని గోమాతలకు తగిన వైద్యసేవలు, పోషక విలువలతోకూడిన లవణ మిశ్రమం, ఇతర టానిక్‌లు సరఫరా చేయుట; వాటి ఆరోగ్య పరిరక్షణ నిమిత్తం నట్టల మందులు, చూడి పరీక్షలు; పేలు, గోమార్ల నివారణ చర్యలు వగైరా సేవలు నిర్వహింపబడుతున్నవి. **గోవు సకల దేవతాస్వరూపిణి; సర్వతీర్థములకు నెలవై ఉన్నది.**

గోసేవలో దృష్టిలో ఉంచుకొనవలసిన అంశములు:

వండిన అన్నము, పాయసము, చపాతీ, పూరీ, మసాలా దినుసులతో చేసిన పదార్థములు నిషిద్ధము. అరటిపండ్లు కూడా రెండు లేదా మూడుకి మించి పెట్టరాదు. దుర్వాసన వచ్చే కుడితి, పాచిపోయిన వ్యర్థాలు పెట్టరాదు. కాయగూరలు, ఆకుకూరలు, వాటి వ్యర్థాలు పెట్టవచ్చును. తవుడు, పప్పుదినుసుల పొట్టు, నూనె తీసిన చెక్క, నూకలు వంటివి తగు మోతాదులో ఇవ్వవచ్చును. పచ్చిగడ్డి, ఎండుగడ్డి, కుట్టి వంటివి అవసరంగా ఇవ్వాలి. చూడి ఆవులకు నువ్వులు, సజ్జలవంటివి పెట్టరాదు.

దుండిగల్ గ్రామస్థులపై స్వామి కృపావిశేషము

భగవాన్ దివ్యాశీస్సులతో మేడ్చెల్ - మల్కాజిగిరి జిల్లా దుండిగల్ గ్రామంలో 2018 సెప్టెంబరు 20వ తేదీన పశువైద్యశిబిరము నిర్వహించడం జరిగింది. ఆ శిబిర ప్రాంగణము ముందు నుండి మల్లయ్య అనే గొఱ్ఱెల కాపరి దాదాపు 250 మేకలను తోలుకొని వెళుతుండగా, స్వామి ప్రేరణతో నేను బయటికి వచ్చి, ఆ జీవాల ఆరోగ్యము గురించి వాకబు చేయగా, గత మూడు వారాల వ్యవధిలో సుమారు 60 మేకలు చనిపోయినట్లు, తద్వారా దాదాపు రెండు లక్షల రూపాయలు నష్టపోయినట్లు అతను ఆవేదన వ్యక్తం చేశాడు. వెంటనే మేము అతని పశువుల పాక వద్దకు వెళ్ళి రోగ నిర్ణాయక నమూనాలు సేకరించి, తగిన నిపుణులతో పరీక్షలు నిర్వహించగా, జలగవ్యాధి కారక క్రిములవలన కాలేయం దెబ్బతిని 'లివర్ సిరోసిస్' మూలంగా అవి చనిపోతున్నట్లు నిర్ధారణ జరిగింది. వెంటనే దానికి తగిన మందు తెప్పించి, ఆ గ్రామములోని 3,800 జీవాలకు రెండు నెలల వ్యవధిలో రెండు పర్యాయములు త్రాగించడం జరిగింది. దానికి జతగా లివర్ టానిక్స్, విటమిన్ సప్లిమెంట్స్, క్యాల్షియం ద్రావణం వంటి మందులను ఒక క్రమవిధానములో అందిస్తూరాగా ఐదు నెలల వ్యవధిలో పూర్తిగా వ్యాధినిర్మూలన జరిగింది. ఈ సేవలో శ్రీ సత్యసాయి సేవాదళంవారితోపాటు ప్రభుత్వ పశువైద్య సిబ్బందికూడా పాల్గొన్నారు.

ఈప్రకారం భగవాన్ అనుగ్రహంతో ఆ గ్రామంలోని పదహైదు కుటుంబాలకు చెందిన 3,800 మూగ జీవాలు రక్షించబడినాయి. నేడు వాళ్ళందరూ భగవాన్ బాబావారి అనుగ్రహమును కృతజ్ఞతాపూర్వకంగా తలుచుకుంటూ, ప్రేమతో సాయినామమును స్మరిస్తున్నారు. ❖

స్వామి సాక్షాత్తు వైద్యనారాయణులే!

డా॥ పణతుల రామేశమ్

పవిత్ర ప్రశాంతినిలయంలో శ్రీ సత్యసాయి ఉన్నత విద్యాసంస్థను ప్రారంభించడానికి అనుమతులిచ్చే విషయంలో వ్యవస్థాపక అధ్యక్షులైన భగవాన్ బాబావారితో సమావేశం కావడానికి, ప్రభుత్వం ఒక మేధావి బృందాన్ని పంపించడం జరిగింది. ఆ బృందంలో ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారుగూడ ఉన్నారు. వారు స్వయంగా ఈ వ్యాస రచయితతో చెప్పిన విషయాలే ఈ వ్యాసంలో పొందుపరచడం జరిగింది. అవధానిగారు స్వామికి పరమ భక్తులు గూడా.

సాయి భగవాన్ సమక్షంలో ఆ బృందం సమావేశమైంది. ఆనాటి సమావేశ విశేషాలను అవధానిగారు అక్షరం పొల్లుపోకుండా వ్రాసుకుంటూ ఉన్నారు. ఇంతలో వ్రాయడం ఆపేశారు. భగవాన్ దీనిని గమనించి, "అవధానిగారూ! వ్రాయలేదేంటి?" అనగానే, "పెన్నులో ఇంకు అయిపోయింది స్వామీ" అన్న సమాధానం రాగానే, స్వామి శూన్యంనుంచి తమ దివ్యహస్తచాలనంతో అందమైన పెన్నును సృష్టించి ఇస్తూ, అవధానిగారూ! ఇక రాయండి" అన్నారట. అష్టైశ్వర్యాలను అనుగ్రహించే స్వామి విభూతికి ఆశ్చర్యపోవడమే మనవంతు.

ఒకసారి దివాకర్లవారికి ఆరోగ్యం సరిలేకపోతే డాక్టర్లు ఉదరభాగంలో ఆపరేషన్ చేయాలన్నారట. ఇంకో పది రోజుల్లో ఆపరేషన్ జరుగబోతుంటే, భగవాన్ కాకతాళీయంగా హైదరాబాదు క్యాంపు వెళ్ళారట. స్వామివారి భక్తులు, వారి మహిమావిశేషాలను గురించి అనేక రచనలు గావించిన ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారి సలహాపై, అవధానిగారు స్వామివారి దర్శనార్థం వెళ్ళారట.

భగవాన్ అనుమతి మీద పాదనమస్కారం చేసీ చేయగానే అవధానిగారికి చిత్రంగా ఒళ్ళంతా చెమటలు పట్టిందట. వెంటనే అవధానిగారు ఆశువుగా ఈ క్రింది పద్యం చెప్పారట.

చం॥ హరిపద జాతమంద్రు దివిజాపగ, అందు యథార్థమెంతొ మే
మెఱుఁగుట యెట్లు? దేవతలమే పదపద్మములంటి మ్రొక్క? మీ
చరణములందు వ్రాలి, వివశత్వమునంది, యొకింతఁ దేరుకోన్
శిరమును మేనుఁజెమ్మగిలు - స్వేదమొ! గాంగ జలంపు క్లేదమో!

ఇందు అవధానిగారు స్వామివారిని సాక్షాత్తు శ్రీమహావిష్ణువుగా ధ్రువీకరించుచున్నారు. "విష్ణు పాదోద్భవీ గంగా" - గంగానది విష్ణువుయొక్క పాదమునుండి పుట్టినదని అర్థము. త్రిమూర్తుల స్పర్శచే పరమ పవిత్రమైనది గంగ. అవధానిగారు పాదనమస్కృతి కావించిన వెంటనే, గంగ తుంపరలుగా ఆపాదమస్తకము ప్లావితమై పవిత్రమొనర్చుట, తద్ద్వారమున భగవాన్, అవధానిగారికి సాక్షాత్తు విష్ణుమూర్తిగా స్ఫురించుట - వారి పూర్వపుణ్యవిశేషమనవచ్చును. సందేహాలంకారమున మరొక భావనలో 'ఇవి చెమట బిందువులా!' అనుకొన్నారు. రోగికి ఒక మోస్తరు చెమట పట్టుట - రోగ నివృత్తి సూచకమని పెద్దల అనుభవము. మరి చిత్రముగా అవధానిగారు తనకు ఆపరేషను జరుగకయే ఉదరవ్యాధి నయమైనదన్నారు. వైద్యులు తిరిగి పరీక్షించి, ఏ లోపమూ లేదు - అంతా బాగుంది - అన్నారంటే స్వామివారి దివ్యలీలావిశేషములను ఏమని కొనియాడగలము! ❖

కస్తూరిగారి కమనీయ భక్తికథామృతం - 7

“గతి ర్భర్తా ప్రభుః సాక్షీ...”

శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీతలో వివరించినట్లుగా “గతిర్భర్తా ప్రభుస్సాక్షీ, నివాసః శరణం సుహృత్” అనే భగవంతుని గుణవిశేషణములన్నీకూడా శ్రీ సత్యసాయిబాబావారికి సరిగ్గా అతికినట్లు సరిపోతాయి.

ఒక బ్యాంకు ఆఫీసరు పదేళ్ళుగా ఒక అద్దె ఇంట్లో నివసిస్తూ ఉండటంవల్ల, బ్యాంకువద్ద ఋణం తీసుకుని తాను ఒక స్వంత ఇల్లు ఏర్పరచుకుంటే బాగుంటుందనే అభిలాష, ఆలోచనలతో; స్వామి అనుమతి, ఆశీస్సులు పొందాలని ప్రశాంతినిలయానికి వచ్చాడు. అప్పుడు స్వామి ఆయనతో, “వద్దు, వద్దు! ఇల్లు కట్టవద్దు! నేనే నీకొక ఇల్లు ఇస్తాను” అన్నారు.

ఆ బ్యాంకు ఆఫీసరు అద్దెకున్న ఇంటి యజమాని ఒకరోజు ఈయన వద్దకు వచ్చి, “నేను ఈ ఇల్లు అమ్ముదామనుకొంటున్నాను. అమ్మితే నాకు లక్ష రూపాయలు వస్తాయి. మీరు ఇదే ఇంట్లో గత పదేళ్ళుగా అద్దెకు ఉంటున్నారు కాబట్టి, ఈ ఇల్లు కొనే అవకాశాన్ని ముందుగా మీకే ఇవ్వాలనుకొంటున్నాను. మీరు ఆ మొత్తం ఇవ్వగలిగితే సరే! మరి, ఆలోచించుకొని చెప్పండి” అన్నాడు. అందుకు ఈ బ్యాంకు ఆఫీసరు, “అయ్యా, నేను అంత డబ్బు ఇచ్చుకోలేను. అతికష్టంమీద అరవై యెనిమిది వేల రూపాయలవరకు ఇవ్వగలనేమో!” అని చెప్పటమేగాక ఆరోజునుండే మరో అద్దె ఇంటికోసం వెతకటం ప్రారంభించాడు.

సరిగ్గా వారంరోజుల తరువాత, ఆ ఇంటి యజమాని తన భార్యను వెంటపెట్టుకొని మరీ ఈ బ్యాంకు ఆఫీసరువద్దకు వచ్చాడు. “మీరు అరవైయెనిమిది వేల రూపాయలు ఇవ్వగలమన్నారు కదా! అందుకు నేను ఒప్పుకుంటున్నాను. మీరు ఈ ఇంట్లోనే ఉండండి” అని చెప్తూ, “ఇంతకూ ఏం జరిగిందో మీకు చెప్పనేలేదు కదూ! ముందు మనము మీ పూజగదిలోకి వెళ్దాం పదండి” అంటూ ఆ భార్యా భర్తా, ఆఫీసరు దంపతులు అందరూ కలసి వారి పూజగదిలోకి వెళ్ళారు.

అక్కడ పూజాపీఠంపై ఉన్న భగవాన్ బాబావారి ఫోటోను చూపుతూ, ఆ ఇంటి యజమాని చెప్పసాగాడు: “మీరు ఆరాధించే ఈ వ్యక్తి నన్ను స్తిమితముగా ఉండనీయటంలేదు. ‘నన్ను ఈ చోటినుండి వేరేచోటికీ, ఈ వీధినుండి మరొక వీధికీ పంపేద్దామనుకొంటున్నావా?! నేను ఈ స్థలంలో పదేళ్ళుగా స్థిరంగా ఉంటున్నాను. ఇప్పుడు నన్ను ఇక్కడినుండి పంపేద్దామని అనుకొంటున్నావు కదూ” అంటూ నాతో రోజూ ఒకటే పోరు పెడుతున్నారు! నాకుకూడా ఈ స్వామివారు ఇక్కడుంటేనే శాంతిగా ఉండగలననిపిస్తోంది. కాబట్టి, దయచేసి వీరి చిత్రపటాన్ని ఇక్కడినుండి తీసుకువెళ్ళకండి. వీరిని ఇక్కడే ఉండనివ్వండి” అని చెప్తూ ఆయన భగవాన్ బాబావారి చిత్రపటానికి సాష్టాంగ నమస్కారం చేశాడు. ఆ బ్యాంకు ఆఫీసరుతో, “మీరు సంతోషంగా ఎంత ఇవ్వగలిగితే అంతే ఇవ్వండి, చాలు” అన్నాడు.

అదీ స్వామి అంటే! మన జీవితాలకు గతీ, భర్తా, ప్రభువూ, సాక్షీ, సర్వస్వమూ వారే కదా!!

(ప్రొ॥ కస్తూరిగారి ప్రసంగాల నుండి సేకరణ)

సమర్పణ: ‘సాయిదాసు’

‘మాటల కందని మహిమార్ణవంబితడు’

❖ శ్రీవిలాస్ సూరి ❖

ఇంట్లో తల్లిదండ్రులకు తెలియకుండా సినిమాలకు, షికార్లకు తిరుగుతూ కాలం వృథాగా గడిపేస్తున్న ఒక యువకుడిపై భగవానుల అనుగ్రహ దృష్టి ప్రసరించింది. అతని పురాకృత సుకృతమో, తల్లిదండ్రుల పూజాఫలమో... కారణం ఏదైతేనేమి, స్వామి వాళ్ళను తమ సన్నిధికి రప్పించుకొని, తమ దివ్యదర్శన సంభాషణలతో అతనిని సన్మార్గంలోకి మళ్ళించారు. అతనిపై తమ దివ్యప్రేమను వర్షించి, దీర్ఘకాలంగా అతనిని వేధిస్తున్న ‘కడుపులో పుండు’ను చిటికెలో నయం చేశారు. ఇంత జరిగింతర్వాత ఎవరు మాత్రం స్వామికి శరణాగతులు కాకుండా ఉండగలరు?! శ్రీవిలాస్ సూరిగారి విషయంలో జరిగింది అదే! **“సన్మార్గమును వీడి చరించువారల పట్టి కాపాడుటే వ్రతము నాకు.... నియమ నిష్ఠలతోడ నను గొల్చువారిని కాపాడుచుండుటే ఘనత నాకు”** అన్న భగవానుల సత్యప్రకటనలను అడుగడుగునా స్ఫురింపజేసే శ్రీ సూరిగారి దివ్యానుభవాలు వారి మాటల్లోనే....

భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారు 1959వ సం౹౹లో ఒకనాడు బెంగళూరులో ఉన్న మా అంకుల్ డా౹౹ సూరి భగవంతంగారి ఇంటికి విచ్చేసిన సందర్భంలో మా నాన్నగారు తొలిసారి వారిని దర్శించుకున్నారు. స్వామి ఆయనను శివరాత్రికి పుట్టపర్తి రమ్మని చెప్పారు.

అప్పుడు నేను మద్రాసులో డిగ్రీ చదువుతున్నాను. శివరాత్రికి మా తల్లిదండ్రులతో నేనూ పుట్టపర్తికి వెళ్ళాను. మేము వెళ్ళేసరికి మధ్యాహ్నం 12 గంటలైంది. ఆలస్యంగా చేరుకోవడంచేత స్వామి ఆరోజు ఉదయం శిరిడీ బాబా విగ్రహానికి విభూతి అభిషేకం చేసిన అద్భుత దృశ్యాన్ని చూడలేకపోయాము. ఆరోజుల్లో నిలయంలో ఎటువంటి వసతి సౌకర్యాలూ లేవు. అందువల్ల మేము కారులోనే విశ్రాంతి తీసుకొని సాయంకాలం అఖండ భజనలో పాల్గొనటానికి మందిరం చేరుకున్నాము.

భక్తులు భజన చేస్తూ ఉండగా సింహాసనంలో ఆసీనులైయున్న స్వామికి ఉన్నట్లుండి వెక్కిళ్ళు ప్రారంభమయ్యాయి. వారు తీవ్రమైన ప్రయాసకు లోనవుతున్నట్లు కనిపించారు. భజన తారాస్థాయికి చేరుకొన్న ఆ సమయంలో స్వామి నోటిలో నుండి ఒకదాని తరువాత ఒకటి మొత్తం తొమ్మిది శివలింగములు ఆవిర్భవించాయి.

మరునాటి ఉదయం స్వామి ఒక్కొక్కరిని వ్యక్తిగత సంభాషణకు పిలువసాగారు. మా తల్లిదండ్రులతో మాట్లాడిన తరువాత నాతో విడిగా మాట్లాడతానన్నారు. నాతో ప్రత్యేకంగా ఏం మాట్లాడదలచుకున్నారా అని ఆశ్చర్యం కలిగింది.

అనుగ్రహంతో అల్సర్ మాయం!

స్వామి నన్ను లోపలికి పిలిచి, **“మద్రాసులో ఏం చేస్తున్నావు?”** అని అడిగారు. “డిగ్రీ చదువుతున్నాను స్వామీ” అని చెప్పాను. **“లేదు, నువ్వు సమయం వృథా చేస్తున్నావు. ఒక సినీనటితో కలసి సినిమాలకు, షికార్లకు వెళుతున్నావు. హోటల్స్‌లో తింటూ ఆరోగ్యం పాడు చేసుకుంటున్నావు. నీకు పొట్టలో అల్సర్ వచ్చింది”** అన్నారు. నా తల్లిదండ్రులకు కూడా తెలియని ఈ విషయాలను స్వామి వెల్లడించటంతో నిర్ఘాంతపోయాను. ఇవన్నీ స్వామికి ఎవరు చెప్పారా అని ఆలోచిస్తుంటే స్వామి, **“నీ తల్లిదండ్రులను మీ ఊళ్ళో దిగబెట్టి నువ్వు మళ్ళీ నా దగ్గరకు రా”** అని ఆదేశించారు.

ఆరోజుల్లో ప్రశాంతినిలయం ప్రయాణం సామాన్యమైనది కాదు. రాత్రి 10 గంటలకు బెంగళూరులో

హైదరాబాదు వెళ్ళే రైలు ఎక్కి, రాత్రి 2.30 ని॥లకు పెనుగొండలో దిగాలి. అక్కడినుండి 2 కిలోమీటర్లు నడచి బస్టాండు చేరుకోవాలి. ఉదయం 6 గంటలకు బయల్దేరే మొదటి బస్సులో బుక్కపట్నం చేరుకొని, అక్కడినుంచి నడుచుకుంటూ పుట్టపర్తి చేరాలి. తొలి ఇంటర్వ్యూలో స్వామి నా చెడు తిరుగుళ్ళగురించి ప్రస్తావించి నన్ను గట్టిగా మందలించిన తరువాతకూడా నేను ప్రతి సారి ఇంత ప్రయాసపడి మళ్ళీమళ్ళీ పుట్టపర్తికి ఎందుకు వచ్చేవాడినో తలుచుకుంటే నాకే ఆశ్చర్యం కలుగుతుంది. అదే వారి దివ్యప్రేమాకర్షణశక్తి.

ఒకరోజున స్వామి నన్ను లోపలకు పిలిచి, **“బంగారూ! నువ్వు చాలా రోజులనుండి కడుపునొప్పితో బాధపడుతున్నావు. ఇంక ఈరోజున నీ అల్సర్‌ను నేను నయం చేస్తాను”** అని విభూతి సృష్టించి నా నోట్లో వేశారు. **“ఈరోజునుంచి నువ్వు గోంగూర, ఆవకాయ కారం కూడా తినవచ్చు”** అన్నారు. స్వామి మాటల్ని నేను నమ్మలేక పోయాను. దసరా పండుగకి నేను మళ్ళీ ప్రశాంతి నిలయం వచ్చినప్పుడు స్వామి నన్ను పిలచి, **“ఏమి, నీకు ఇంకా నామీద నమ్మకం లేదా? ఎందుకు ఆవకాయ, గోంగూర తినటం లేదు?”** అని ప్రశ్నించారు. ఇక నా సందేహాలన్నీ ప్రక్కకుపెట్టి నేను నిర్భయంగా పచ్చళ్ళు తినసాగాను. ఆనాటినుండి ఈనాటివరకు నాకు ఏనాడూ తిరిగి అల్సర్ రాలేదు.

అక్షయ ప్రసాదం!

1960 - 1968 సంవత్సరాల మధ్య నేను స్వామి సన్నిధిలోనే ఉంటూ వారిని సేవించుకొనే భాగ్యం పొందాను. ఆరోజుల్లో సేవాదళ్ సంఖ్య తక్కువ; పనులు ఎక్కువ! ఒకరోజున కేంటీన్‌లో భక్తులకు వడ్డించటం, మరునాడు వంటశాలలో వంటవాళ్ళకు సహాయపడడం; మరొకరోజు నిలయం ప్రాంగణం శుభ్రం చేయడం; ఇంకొకరోజు ఇంటర్వ్యూ గది దగ్గర ద్వారపాలకుడిగా నిలబడడం.... ఇలా రోజుకొక డ్యూటీ చేసేవాడిని.

ఒక దసరాలో స్వామి నన్ను అనంతపురం వెళ్ళి, ప్రసాదంకోసం కిరాణా సరుకులు తెమ్మన్నారు. నేను ఒక్కడినే అనంతపురం వెళ్ళి రెండు బస్తాల బియ్యం, ఒక

బస్తా కందిపప్పు, చిన్న సంచీ చింతపండు, బెల్లం, ఎండు మిరపకాయలు, కారులో వేసుకొని రాత్రికి నిలయం చేరుకున్నాను. రెండు పెద్ద గిన్నెలు పొయ్యిలమీద పెట్టి, వాటిలో బియ్యం ఎసరుపెట్టి, ఒక గిన్నెలో పులిహోర, రెండవ గిన్నెలో చక్కెర పొంగలి తయారుచేశాము. అయితే, వచ్చిన వేలాది భక్తులందరికీ ఆ కాస్త ప్రసాదం ఎలా సరిపోతుందని సందేహించాను. కానీ, స్వామికి నివేదించిన తరువాత ఉదయం ఆ ప్రసాదాన్ని భక్తులకు పంచిపెడితే అది అక్షయంగా అందరికీ సరిపోయింది. ఎంత ఆశ్చర్యం!

చెప్పకుండా వెళ్ళినందుకు....

ఒకరోజున నేను స్వామి అనుమతి తీసుకోకుండా, బెంగళూరులో ఉన్న మా సోదరి ఇంటికి బయల్దేరాను. ఉదయం బస్సు అందుకొని పెనుగొండ చేరాను. కానీ, అప్పటికి పెనుగొండలో రైలు వెళ్ళిపోయింది. ధర్మవరం వెళ్ళి, అక్కడినుండి బస్సులో బెంగళూరు వెళదామని ప్రయత్నించాను. కానీ, ఏదో కారణంవల్ల ఆ బస్సు లేదన్నారు. విధిలేక నేను మళ్ళీ బస్సులో పెనుగొండ వచ్చి,

రాత్రి 7.30 ని॥లకు ఉసూరుమంటూ ప్రశాంతినిలయం చేరుకున్నాను. ఈ వృథా ప్రయాసలో నేను ఉదయం నుంచి ఏమీ తినలేదు. నీరసంతో వెళ్ళి మందిరం పోర్టికోలో కూర్చున్నాను. స్వామి నాదగ్గరకు వచ్చి, **"ఏమి ప్రయాణం బాగా జరిగిందా? బెంగళూరు వెళ్ళి వచ్చావా?"** అన్నారు. చెప్పకుండా వెళ్ళినందుకు నేను స్వామిని క్షమాపణ వేడుకున్నాను.

వ్యక్తిగత కారణాలవల్ల నేను నా డిగ్రీ చదువును అర్ధాంతరంగా నిలిపివేశాను. ఒకరోజు ఆ విషయం తలుచుకుంటూ కనీసం డిగ్రీ పూర్తి చేయలేకపోయానని నా ఆవేదనను స్వామిదగ్గర వ్యక్తం చేయగా, **"నువ్వు నా దగ్గర డిగ్రీ సంపాదించు బంగారూ! వేరే ఏ డిగ్రీలూ వద్దులే"** అంటూ అనునయించారు.

హద్దులు దాటితే....

ఒక వేసవిలో స్వామి బృందావనంలో ఉన్నారు. మేము కొందరం నిలయంలో ఉన్నాము. వేసవి వేడి ఎక్కువగా ఉందని, నిలయం బయట ఉన్న ఒక బావి దగ్గరకు వెళ్ళాము. సరదాకి ఎవరో నన్ను బావిలోకి తోసేశారు. నాకేమో ఈతరాదు. పైగా ఒక నీటిపాము నా రెండు కాళ్ళు చుట్టి నీళ్ళలోపలకు లాగటం మొదలుపెట్టింది. నేను అరచి కేకలు పెట్టి ఎలాగో బయటపడ్డాను.

దసరా ఉత్సవాలకు ముందు స్వామి బృందావన్‌నుంచి నిలయానికి తిరిగి వస్తూనే నన్ను పిలిచి, నూతిలో పాము చుట్టుకొన్న విషయమై ప్రశ్నించి, జెంషెడ్‌పూర్‌లో ఉన్న మా తల్లిదండ్రుల దగ్గరకు పంపించేశారు.

ఆరోజుల్లో నేను నిలయంలో రాజారెడ్డి, మైసూరు రఘు తదితరులతో కలసి భజనలు పాడేవాణ్ణి కాబట్టి, జెంషెడ్‌పూర్‌లో భక్తులు నన్ను భజనలు నేర్పమని అడిగారు. నాలో కాస్త గర్వం పొడసూపింది. ఇంక, అక్కడి భక్తబృందాలకు, మహిళలకుకూడా నేను భజనలు నేర్పడం మొదలుపెట్టాను.

మా తల్లిదండ్రులు దసరాకి నిలయం వెళ్ళినప్పుడు స్వామి మా నాన్నగారితో, **"ఏమిటి? అక్కడ వాడు ఏమి చేస్తున్నాడు? అందరికీ భజనలు నేర్పుతున్నాడా? దసరాకి ఎందుకు రాలేదు?"** అని అడిగారట. ఈ సంగతి తెలిసిన తక్షణమే బయల్దేరి నిలయం చేరుకున్నాను. నన్ను చూస్తూనే స్వామి, **"నువ్వేమైనా స్వామి తరఫున ప్రతినిధి వనుకుంటున్నావా? అందరికీ భజనలు నేర్పే అధికారం నీకెవరిచ్చారు? ప్రత్యేకించి ఆడవాళ్ళకి భజనలు నేర్పమని నీకెవరు చెప్పారు?"** అంటూ గట్టిగా మందలించారు. నేను స్వామి పాదాలపై వ్రాలిపోయాను.

అనుగ్రహ రక్షణ

స్వామి నా తప్పు మన్నించి, తమ జన్మదినోత్సవాలలో సభాప్రాంగణాన్ని అలంకరించే బాధ్యతను నాకు అప్పగించారు. సాంబశివరావు అనే మరో కార్యకర్తతో కలసి నేను పని మొదలుపెట్టాను. సభాప్రాంగణంలో ట్యూబ్‌లైట్లు అమర్చి వాటికి కనెక్షన్లు ఇచ్చాను. అయితే, స్టేజికి దగ్గరగా ఉన్న ఒక ఇనుప దూలము ముట్టుకుంటే 'షాక్' కొడుతూ ఉండడంతో ఆవైపు కూర్చున్న మహిళలు భయభ్రాంతులకు లోనయ్యారు. స్వామి నన్ను దాని సంగతి చూడమన్నారు. స్వామి చెప్పినదే తడవుగా నేనేదో పూనకం వచ్చినవాడిలా స్టేజిపైనుండి దూకి, ఆ దూలము పైకి ఎగబ్రాకి, 'షాక్'కి కారణమైన వైరును తొలగించాను. అది చూసి స్వామి, **"ఒరేయ్, నీకేమైనా జ్ఞానం ఉందా? కరెంటు షాకు కొడుతుందని తెలిసి పైకి ఎందుకు ఎక్కావు?"** అని తీవ్రంగా మందలించారు. అప్పటికిగాని నేను చేసిన పనేమిటో నాకు తెలిసిరాలేదు. ఆ క్షణంలో స్వామి ఆజ్ఞను తక్షణం శిరసావహించాలన్న ఆత్రుత తప్ప నాకు మరో ఆలోచన లేదు. స్వామి అపారమైన కరుణవల్ల నేను కరెంటు షాక్‌కి గురికాకుండా రక్షింపబడ్డాను.

తమలపాకుపై 'నిలయం' రూపురేఖలు!

వేసవిలో ఒకనాడు స్వామి, పోర్టికోలో నిలబడి ఉన్న నన్ను చూసి మేడపైకి రమ్మన్నారు. స్వామి దివాన్ మంచంపై కూర్చుని, ప్రక్కనున్న తమలపాకులలో ఒకదానిని తీసి, దానిపై గోటితో బొమ్మవేస్తూ, **"ఒరేయ్, కొద్దికాలంలో ఇక్కడికి విమానాలు వస్తాయి. రైల్వేస్టేషన్ వస్తుంది. ప్రశాంతినిలయం రూపురేఖలు మారిపోతాయి.**

మూడు అంతస్తుల ఇళ్ళు వస్తాయి. విదేశాలనుంచి చాలామంది వస్తారు. అప్పుడు నీకు ఎళ్లగౌను మాత్రమే కనిపిస్తుంది. స్వామిని చూడటానికి చాలా కష్టం. పెద్ద హాలు వస్తుంది. వేలమంది భక్తులు అందులో కూర్చుంటారు. మందిరం చుట్టూ ఇళ్ళు ఉంటాయి" అని చెప్పసాగారు.

మధ్యలో నేను కల్పించుకొని, "స్వామీ, ఈ మారుమూల గ్రామానికి ఎవరు వస్తారు? సరియైన రోడ్డు కూడా లేదు" అన్నాను.

"వస్తాయిరా, అన్నీ వస్తాయి. నువ్వు చూడలేవు. పెద్ద హాస్పిటల్‌కూడా వస్తుంది" అని స్వామి గోటితో తమలపాకుపై బిల్డింగు డిజైన్లు వేస్తూ చెప్పారు. నేను ఆ తమలపాకుని నాకిమ్మని అడుగగా, స్వామి వెంటనే దాన్ని నోట్లో పెట్టేసుకున్నారు.

తరువాత కాలం గడిచేకొద్దీ స్వామి చెప్పిన ప్రతి మాటా రూపుదాల్చింది కదా! స్వామి చెప్పినట్లే, ఆ బృహత్ నిర్మాణాలు జరిగే సమయంలో నేను నిలయంలో లేను.

దివ్య దర్శకత్వంలో 'భక్త ప్రహ్లాద'

ఒక దసరా సందర్భంగా స్వామి వేద పాఠశాల పిల్లలచేత 'భక్త ప్రహ్లాద' నాటకం వేయించారు. అందులో సంభాషణలు, పాటలు, రాగాలు అన్నీ స్వామే కూర్చారు. రాత్రి 10 గంటలు దాటాక షెడ్‌లో రిహార్సల్స్ జరిగేవి. స్వామి స్వయంగా వచ్చి పిల్లలకు సంభాషణలు నేర్పించేవారు. మైసూరు రఘు పాటలు నేర్పించాడు. ఆ నాటకానికి దర్శకులు, నిర్మాత, రచయిత, సంగీతం అన్నీ స్వామే!

ఆరోజున స్వామి నన్ను, మరికొందరి సహాయంతో నాటక ప్రదర్శనకు వేదికను సిద్ధం చెయ్యమన్నారు. చెట్ల కొమ్మలు తెచ్చి అడవి వాతావరణం కల్పించాము. కరెంటు పోతే ఉండటానికి పెట్రోమేక్సు లైట్లు సిద్ధంగా ఉంచాము. ఒకవేళ ఆ లైటింగ్ చాలకపోతే, కార్లు తెచ్చుకున్న భక్తుల్ని వాళ్ళ కార్ల లైట్లు స్టేజిమీద పడేలా ఫోకస్ చెయ్యమని స్వామి చెప్పారు. ఇక తెర ఎలాగా అని ఆలోచిస్తున్నాము. అప్పుడు స్వామి నన్ను ఊళ్ళోకి వెళ్ళి నూతిలో నుండి నీళ్ళు తోడటానికి ఉపయోగించే గిలకలు నాల్గింటిని తెమ్మన్నారు. వాటికి తెర త్రాళ్ళు ఎలా కట్టాలో, తెర తీయాలన్నా, వేయాలన్నా వాటిని ఎలా లాగాలో స్వయంగా చూపించారు. ఇది ఇంజనీర్ల పని కదా! ఇవన్నీ స్వామికెలా తెలుసు? ఎంతటి సునిశితమైన ప్రణాళికారచన స్వామిది! అని ఆశ్చర్యం కలిగింది.

స్టేజిపైన మైక్స్ వ్రేలాడదీశాము. ఇక నాటకం ఆద్యంతం రక్తికట్టి అందరినీ ఆకట్టుకుందని ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. ఆరోజు నిలయంలోనే ఉన్న సుప్రసిద్ధ సినీనటి శ్రీమతి అంజలీదేవి, ఆవిడ భర్త శ్రీ ఆదినారాయణ రావుగార్లు ఆ నాటకాన్ని చూసి ప్రభావితులై, 'భక్త ప్రహ్లాద' సినిమా తీశారు. ఈ నాటకంలో స్వామి కూర్చిన పాటలు, రాగాలే వారు సినిమాలో కూడా పెట్టారు.

జన్మజన్మలకూ మరువలేని మహాప్రసాదం!

స్వామి జన్మదినోత్సవాల సందర్భంగా ఒక భక్తుడు భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేయడానికి కాసిని లడ్డులు పట్టుకువచ్చాడు. ఆరోజు ఉదయం కార్యక్రమం తరువాత 11 గంటలకు స్వామి నన్ను పిలిచి, తమ గదిలోంచి ఒక వెండిగిన్నె తెమ్మన్నారు. ఆ గిన్నెనిండా ఈ లడ్డూలు నింపి, దాన్ని పట్టుకొని నన్ను తమ వెనుకనే రమ్మన్నారు. ముందుగా మగవాళ్ళవైపు వెళ్ళి ప్రసాదం పంచటం ప్రారంభించారు.

నేను ఆ బరువాటి గిన్నెను రెండు చేతులతో పట్టుకొని, స్వామి వాడే చేతిరుమాలును వారు అవసరమైనప్పుడు తీసుకోవడానికి వీలుగా నా భుజాలపై వేసుకొని, స్వామి వెనుకనే నడుస్తూ ఉంటే స్వామి అందరికీ లడ్డూలు పంచసాగారు. మగవాళ్ళందరికీ పంచిపెట్టడానికి మూడు గంటల సమయం పట్టింది. ఆ తరువాత స్త్రీలవైపుకు వెళ్ళాము. అప్పటికే మధ్యాహ్నం రెండు గంటలైంది. ఆడవాళ్ళు స్వామి పాదాలపై పడిపోతున్నారు. ఆ ఒత్తిడిలో పాత్ర పట్టుకొని నడవటం నాకొక గొప్ప సవాలుగా తయారైంది. ఎట్టకేలకు సాయంత్రం 4 గంటలకు ప్రసాద వితరణ పూర్తి అయింది. చిత్రం ఏమిటంటే, ఆ వెండి పాత్రను ఒక్కసారే లడ్డూలతో నింపాను. అదే అక్షయపాత్ర అయిపోయింది!!

ఉదయం 11 గంటల నుండి స్వామి కానీ, నేను కానీ ఒక్క చుక్క మంచినీళ్ళుకూడా త్రాగలేదు. పాత్రలో లడ్డూలు అయిపోతూనే ఉన్నాయి, వస్తూనే ఉన్నాయి. చివరకు ఖాళీ పాత్ర పట్టుకొని నేను స్వామి వెనుకనే ఇంటర్వ్యూ గదిలోపలకు వెళ్ళాను. నా చేతులు బిగుసుకు పోయి ఉన్నాయి. స్వామి నన్ను చూసి, **"అయ్యో పాపం, చేతులు వంగటం లేదా?"** అని నా చేతులపై నిమిరారు. అంతే! నా చేతులు మృదువుగా తక్షణం స్వాధీనంలోకి వచ్చాయి. "స్వామీ, నాకు ప్రసాదం దొరకలేదు" అన్నాను. స్వామి నవ్వి ఊరుకున్నారు. కానీ, స్వామితో ఆ ఐదు గంటలూ 'అక్షయపాత్ర' పట్టుకొని నడవటం నా జీవితంలోనే మహాప్రసాదం అని గ్రహించాను. అక్కడున్న వేలాదిమందిలో నన్నే అందుకు ఎన్నుకొన్నారు కదా!

స్వామికి తెలియనిదేమున్నది!

1964 ప్రాంతాల్లో కాకినాడనుంచి సోమన సురేశ్వర శర్మగారు, ఆయన భార్య కమల దసరాకు పర్తి వచ్చి, స్వామి పుట్టినరోజు పండుగ వరకు ఉన్నారు. వారి అమ్మాయిని మా అన్నయ్యకు ఇచ్చి వివాహం చేయడానికి అప్పటికే నిశ్చయమైంది. అందువల్ల వాళ్ళు నన్ను రోజూ కాఫీకి, భోజనానికి పిలుస్తూ అభిమానంగా చూడసాగారు. ఒకరోజున స్వామి, **"ఏమిత్రా, నీకు అల్లుడి మర్యాదలా? జాగ్రత్త మళ్ళీ వాళ్ళ దగ్గర భోజనం చేశావంటే..."** అని మందలించారు. నేను మళ్ళీ వాళ్ళ ఆతిథ్యం తీసుకోలేదు. స్వామి అలా క్రమశిక్షణ పాటింపజేసేవారు.

మా అన్నయ్య పెళ్ళి అయిన తరువాత స్వామి ఆ దంపతుల్ని తమ ఆశీస్సులు తీసుకొనటానికి రమ్మన్నారు. వాళ్ళు వచ్చి రెండు రోజులున్నారు. స్వామి మాట్లాడలేదు. ఇంక సెలవును పొడిగిస్తే మా అన్నయ్యకు తన కంపెనీలో మాట వస్తుందని వాళ్ళు బెంగళూరు వెళ్ళిపోయారు. తీరా వెళ్ళాక చూస్తే అక్కడ కంపెనీ 'స్ట్రయిక్' (సమ్మె)లో ఉంది. పదిరోజులవరకు ఆఫీసుకు వెళ్ళనక్కర్లేదని తెలిసింది.

ఇక్కడ స్వామి నాతో, **"మీ అన్నయ్య తొందరపడి వెళ్ళిపోయాడు. వాళ్ళ కంపెనీ 'స్ట్రయిక్'లో ఉందని తెలియదా!"** అన్నారు. మా అన్నయ్య పనిచేసే కంపెనీలో సమ్మె జరుగుతున్న విషయం స్వామికెలా తెలుసని ఆశ్చర్యపోయాను. నా పిచ్చికానీ, స్వామికి తెలియనిది ఏమున్నది! **"సరే, నువ్వు వెళ్ళి ఈ ధోవతి, చీర, పసుపు, కుంకుమ నేను ఇచ్చానని చెప్పి ఇచ్చిరా"** అని స్వామి నాతో వాటిని పంపారు. నేను వెళ్ళి స్వామి ప్రసాదం వాళ్ళకు అందజేసినప్పుడు, వాళ్ళు స్వామికి చెప్పకుండా తొందరపడి వచ్చేసినందుకు పశ్చాత్తాపపడ్డారు.

స్వామి కారణం లేని కార్యం చేయరు

ఒకసారి స్వామి బృందావనంలో ఉన్న సమయంలో నేను జెంషెడ్‌పూర్‌లో ఉంటున్న మా తల్లిదండ్రులదగ్గరకు వెళ్ళిరావటానికి అనుమతి కోరాను. **"రేపు రా, చెపుతాను"** అన్నారు స్వామి. అలా ప్రతి రోజూ స్వామి "రేపు చెపుతాలే" అంటూ వాయిదా వేస్తూ వచ్చారు. ఒకరోజు నేను, "రేపటికి టికెట్‌కూడా బుక్ చేసుకున్నాను స్వామీ" అని చెప్పేసరికి, **"రేపు అఖండ భజన ఉంది. నువ్వు అక్కడికి రా, చెపుతాను"** అన్నారు.

బెంగళూరులో డా॥ పద్మనాభన్‌గారు, మరికొందరు కలసి జ్ఞానసమాజంలో అఖండ భజన ఏర్పాటు చేశారు. స్వామి ఆజ్ఞ మేరకు ఉదయం 8.30కి అక్కడికి వెళ్ళాను. అప్పటికే భజన ప్రారంభమైంది. స్వామి సింహాసనంలో ఆసీనులై, తాళం వేస్తూ భజనను ఆస్వాదిస్తున్నారు. నేనేమో మధ్యాహ్నం ఒంటిగంటకల్లా ఇంటికి వచ్చి భోజనం చేసి ట్రైన్ ఎక్కుతానని మా చెల్లాయికి చెప్పి వచ్చాను. స్వామి నాకు ఎప్పుడు అనుమతి ఇస్తారా అని ఆదుర్దాతో క్షణక్షణం స్వామినే చూస్తున్నాను. 12.30కు స్వామి నన్ను దగ్గరకు పిలిచి, **"చూడు, రాజారెడ్డికి ఒంట్లో బాగాలేదు. ఈ ఆడవాళ్ళు బాగా అలసిపోయారు. వాళ్ళు రాత్రి అంతా భజన చేయలేరు. మైసూరు రఘు, వాళ్ళ తమ్ముడు ఇద్దరే పాడుతున్నారు పాపం! నీ ప్రయాణం మానుకో! అఖండ భజన తరువాత ఊరికి వెళుదువుగాని. ఇంటికి కారులో వెళ్ళి నీ చెల్లాయికి, బావగారికి చెప్పేసి రా. వాళ్ళనుకూడా సాయంకాలం భజనకు రమ్మను"** అన్నారు.

స్వామి ఆజ్ఞను పాటించి నేను ఇంటికి వెళ్ళి, భజనకు తిరిగి వచ్చాను. రాత్రి 9 గంటలకు భోజనాలకు

పద్మనాభన్‌గారి ఇంటికి వెళ్ళాము. నేను రాజారెడ్డికి, స్వామికి మధ్యన కూర్చున్నాను. **“మరీ కడుపునిండా తినకండి, భజనలో నిద్ర వస్తుంది!”** అన్నారు స్వామి నవ్వుతూ. తరువాత నన్ను చూసి, **“నువ్వు కూడా వెళ్ళి పాడు”** అని విభూతి సృష్టించి నా నోట్లో వేశారు. ఆశ్చర్యం! నేను ఆ రాత్రి అఖండ భజనలో దాదాపు ఒక వంద పాటలు పాడగలిగాను. నేను అలా పాడటం అదే మొదటిసారి, చివరిసారికూడా. అది నిస్సందేహంగా స్వామి దయ తప్ప నా ప్రతిభ కాదు.

మరుసటిరోజు తెల్లవారురుఝామున నాలుగున్నరకు స్వామి జ్ఞానసమాజం హాలుకు విచ్చేశారు. 9.30కు హారతి అయింది. అప్పుడు స్వామి నాతో, **“సాయంత్రం రా! అమ్మకు విభూతి ప్రసాదం ఇస్తాను. రేపు జెంషెడ్‌పూర్ వెళుదువుగాని”** అన్నారు.

మరుసటి రోజు బృందావన్ ట్రైనులో నాకోసమే స్వామి ‘రిజర్వ్’ చేసి పెట్టారా అన్నట్లు ఒకే ఒక టికెట్ ఉంది! నేను జెంషెడ్‌పూర్ చేరిన తరువాత తెలిసిన విషయ మేమిటంటే, మా అమ్మను వీపుపైన డయాబెటిక్ కురుపుకి ఆపరేషన్ నిమిత్తం పదహైదు రోజుల క్రిందట ఆసుపత్రిలో చేర్చారట. మరొక రెండు రోజుల్లో ఆపరేషన్ చేస్తారని నాన్నగారు చెప్పారు. నేను ఆసుపత్రికి వెళ్ళి స్వామి ప్రసాదించిన విభూతిని మా అమ్మ నోట్లో వేశాను.

ఆపరేషన్ చేసేరోజున ఆమెను వీల్‌ఛైర్లో థియేటర్ లోపలకు తీసుకువెళ్ళారు. ఆశ్చర్యం! ఆమె వీపుపై ఆ కురుపు లేనే లేదు! అది అదృశ్యమైపోయింది. డాక్టర్లు ఆశ్చర్యపోయారు. ఆపరేషన్ లేకుండానే అమ్మ బయటకు వచ్చేసింది! ఆమెచేత కర్మశేషమును అనుభవింపజేసి, నయం చేయడానికే స్వామి నా ప్రయాణాన్ని పదహైదు రోజులుగా వాయిదా వేస్తూ వచ్చారని నాకు అర్థమైంది. అది స్వామికి మాపై గల అపారమైన కరుణకు మరో నిదర్శనం.

మరపురాని శివరాత్రి

1968 శివరాత్రి నాకు మరపురాని రోజు. ఎందుకనో ఆరోజు స్వామి చాలా గంభీరంగా ఉన్నారు. వారి జటాజూటమునుండి, కనుబొమలనుండి ఒకటే విభూతి! వారిని సమీపించటానికి ఎవరికీ ధైర్యం చాలలేదు. మందిరంలో ఉండే కిష్టప్ప, కస్తూరి, సూరయ్య, రాజారెడ్డి వీళ్ళందరూ తెచ్చిన దండలనుకూడా నన్నే స్వామి తమ మెడలో వేయమన్నారు.

ఆరోజున స్వామి శిరిడీ సాయి విగ్రహానికి విభూతి అభిషేకం చేశారు. కస్తూరిగారు ఒక పాత్రను విగ్రహంపై తలక్రిందులుగా పట్టుకోగా, స్వామి దానిలోనికి చెయ్యి పోనిచ్చి, తిప్పుతూ ఉండగా విభూతి కుండపోతగా కురవసాగింది. ఆ విభూతితోపాటు ముత్యాలు, రుద్రాక్షలు, స్ఫటికమాలలు, తులసీమాలలు, బంగారు, వెండి నాణేలు పడ్డాయి! ఏమి అద్భుతమైన దృశ్యం అది! ఆ వేదిక దగ్గరలో కూర్చున్నవారినిండా విభూతే! నా ఒంటినిండా విభూతే! స్వామి ఎటువంటి దివ్యమైన అనుభవం ప్రసాదించారు నాకు!

శిరిడీ సాయి విగ్రహాన్ని నేను తిరిగి మందిరానికి తీసుకువచ్చిన తరువాత స్వామి నన్ను చూసి, **“పాద నమస్కారం చేసుకో”** అన్నారు. అప్పుడు ఉన్నట్లుండి, **“నీకు నా దగ్గరనుంచి ఏమి కావాలి? ధనమా? బంగారపు గొలుసా? ఉంగరమా? చెప్పు. నీవు ఏమి అడిగినా ఇస్తాను”** అన్నారు.

స్వామి అలా అడగటం నాకు ఆశ్చర్యం కలిగించింది. “నాకు మీ అనుగ్రహం తప్ప ఇంకేమీ అక్కర్లేదు స్వామీ” అన్నాను. ఐతే, మరో పదహైదు రోజులు గడచిన తరువాత స్వామి ఆనాడు అలా అడగటంలోగల ఆంతర్యం నాకు బోధపడింది. మా నాన్నగారు కేన్సర్ బారినపడి ఆసుపత్రిలో చేరడంతో నేను ఇంటికి వెళ్ళవలసివచ్చింది. స్వామి ఆదేశం మేరకు నాన్నగారిని, అమ్మగారిని బృందావన్‌కి తీసుకు వెళ్ళాను. నేను, అమ్మగారు బయటనే నిలబడి ఉండగా, స్వామి కారులో నాన్నగారి ప్రక్కన కూర్చుని ఆయనతో అరగంట గడిపారు. లోపల ఆయనకు ఎటువంటి దివ్యదర్శనం అనుగ్రహించారో తెలియదుకానీ, బయటికి వచ్చిన తరువాత నాన్నగారు, “సర్వం కృష్ణమయం, సర్వం సాయిమయం” అంటూ ఒకవిధమైన తాదాత్మ్య స్థితిలో ఉండిపోయారు.

ఆ సందర్భంలో స్వామి మా అమ్మగారికి ఇచ్చిన సూచనలను బట్టి నాన్నగారు ఇంక ఎంతో కాలం ఉండరని నాకు స్పష్టమైంది. మా అన్నయ్య మద్రాసులో ఉండటం చేత స్వామి నాన్నగారిని అక్కడికే తీసుకువెళ్ళమని చెప్పారు.

1968 నవంబరులో ఆయన మరణవార్తను నేను కస్తూరిగారికి ఫోనులో తెలియజేసినప్పుడు ఆయన స్వామికి విన్నవించడానికి ఉదయం దర్శనానికి ముందు మేడపైకి వెళ్ళారు. ఆయన్ను చూస్తూనే స్వామి, **"నాకు తెలుసు, కోలార్ ఈరోజు తెల్లవారుఝామున 5 గంటలకు పోయాడు కదా"** అన్నారట.

మా నాన్నగారి మరణం తరువాత కుటుంబానికి సంబంధించిన బరువు బాధ్యతలన్నీ ఒకదాని తరువాత ఒకటి నాపై పడుతూ ఉండటంతో, మళ్ళీ చాలాకాలం వరకు స్వామి సన్నిధికి రాలేకపోయాను.

దివ్య భిషగ్వరుడు

1975లో మద్రాసులో ఒకనాటి రాత్రి నేను తీవ్రమైన గుండెపోటుతో ఆస్పత్రిలో చేరాను. నన్ను ఐ.సి.యు.లో ఉంచి ట్యూబులు తగిలించి రకరకాల మందులు ఎక్కించడం ప్రారంభించారు. అసలు నేను బ్రతికి బట్టకడతానని ఎవరూ అనుకోలేదు. అటువంటి విషమ స్థితిలో ఉన్నట్లుండి నా బెడ్ దగ్గర విభూతి పరిమళం గుప్పుమంది! నిస్సందేహంగా స్వామి నా వెంట, జంట ఉన్నారని గ్రహించాను. అంతేకాదు; తక్షణం ఆసుపత్రిని వదలి వెళ్ళిపొమ్మని స్వామి చెపుతున్నట్లు ఆ సమయంలో నాకు వారి మాటలు చాలా స్పష్టంగా వినిపించాయి. కానీ, మందుల ప్రభావంచేత మళ్ళీ మత్తులోకి జారుకున్నాను.

మరుసటిరోజు ఉదయం డాక్టర్లు వచ్చి చూసేసరికి నాకు తగిలించిన ట్యూబులన్నీ తొలగించబడి ఉన్నాయి. నా చేతులకి, పాదాలకి వేసిన పట్టీలుకూడా లేవు! ఇలా ఎవరు చేశారని డాక్టర్లు మండిపడుతూ, మళ్ళీ అన్నీ కనెక్ట్ చేసి మందులు ఎక్కించసాగారు. ఆరోజు రాత్రి స్వామి నాకు కనిపించి, తక్షణం ఆస్పత్రిని వదలిపెట్టమని మళ్ళీ హెచ్చరించారు.

మరుసటిరోజు ఉదయం నన్ను చూడడానికి వచ్చిన మా అంకుల్‌కి, అన్నయ్యకి ఈ సంగతి చెప్పాను. నన్ను డిశ్చార్జి చేయమని వాళ్ళు డాక్టర్లపై ఒత్తిడి తెచ్చారు. నాకు జరుగకూడనిది ఏదైనా జరిగితే ఆసుపత్రి యాజమాన్యంపై నింద వేయమని లిఖితపూర్వకంగా హామీ ఇచ్చిన తరువాతనే నేను ఆస్పత్రినుండి బయటపడగలిగాను. ఆ తరువాత ఒక మూడు నెలలపాటు బెంగళూరులో మా సోదరి ఇంట్లో ఉండి మందులు వాడుతూ వచ్చాను.

1976 జనవరిలో స్వామి సంక్రాంతి పండుగకు బృందావనం విచ్చేశారు. మా చెల్లాయి, బావగారు స్వామి దర్శనానికి వెళుతూ నన్ను కూడా వస్తావా అని అడిగారు. చలి తీవ్రంగా ఉండటంవల్ల మందంగా ఉన్న స్వెటర్ ధరించి, వారి వెంట వెళ్ళి ఆ జన సమూహంలో ఒక మూల రాతిమీద కూర్చున్నారు. స్వామి భక్తులమధ్య నడుచుకుంటూ నేరుగా దగ్గరకు వచ్చి ప్రసన్నంగా నా కళ్ళలోకి చూశారు. అంతే! అంతటి ఎముకలు కొరికే చలిలోనూ నాకు ఒక్కసారిగా చెమటలు పోశాయి! బనియన్‌కూడా తడిసిపోయింది! స్వామి వెనక్కి తిరిగి తమ వెంట వస్తున్న సూరి భగవంతంగారితో చెప్పి నాకు కొన్ని విభూతి పొట్లాలు ఇప్పించారు.

ఆరోజున స్వామి నాకు ఎంతటి మహత్తరమైన ఆశీస్సులందించారనేది నా ఊహకందని విషయం. కేవలం తమ అనుగ్రహదృష్టి ప్రసారంతో స్వామి నా రుగ్మతను నయం చేశారనిపించింది. ఆనాటి నుండి నేను త్వరితగతిన కోలుకొని ఆరోగ్యవంతుడినయ్యాను.

చాలారోజుల తరువాత 2015లో మళ్ళీ పుట్టపర్తి వెళ్ళాను. ఆనాడు స్వామి చెప్పినట్లుగానే పుట్టపర్తికి మంచి రోడ్లు వచ్చాయి. ఆశ్రమంలో మూడు అంతస్తుల భవనాలు వచ్చాయి. సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ తయారైంది. రైల్వే స్టేషన్ వచ్చింది. ఎయిర్‌పోర్టు వచ్చింది. అధునాతనమైన కేంటీన్లు వచ్చాయి. పెద్ద దర్శనం హాలు ఏర్పడింది. దేశ విదేశీయులు అందరూ అందులో ఆసీనులై ఉన్నారు. స్వామి నాతో ఏమేమి చెప్పారో అక్షరాలా అలాగే జరిగింది.

తెలుగుసేత: జంధ్యాల సుమన్‌బాబు

భక్తుల పర్తియాత్రలు, ఆషాఢి ఉత్సవం గురుపూర్ణిమ విశేషాలు

డా॥ దివి చతుర్వేది

కేరళ భక్తుల పర్తియాత్ర

శ్రీ సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులలో హృద్రోగ శస్త్రచికిత్సలు చేయించుకున్నవారు, కేరళలోని వారి స్వస్థానాలకు తిరిగి వెళ్ళిన తరువాతకూడా, వైద్య పరముగా వారి అవసరములను తీర్చుకోవడానికి వీలుగా కేరళ శ్రీ సత్యసాయి సేవాసంస్థ 2009లో 'శ్రీ సత్యసాయి రిహాబిలిటేషన్' పథకాన్ని ప్రారంభించింది.

శ్రీ సత్యసాయి రీహాబిలిటేషన్ మరియు శ్రీ సత్యసాయి సమగ్ర గ్రామీణాభివృద్ధి పథకములవలన ప్రయోజనము పొందుతున్నవారు 2019 జులై 6న ప్రశాంతినిలయం విచ్చేసి భగవాన్‌కి కృతజ్ఞతాంజలి సమర్పించారు; వారి అనుభవాలను భక్తులతో పంచుకున్నారు. వైద్యసహాయం కొరకు సాయిసంస్థతో వారికి ఏర్పడిన అనుబంధము ఆయా వ్యక్తులలో ఆధ్యాత్మికస్ఫూర్తిని పెంపొందించడం గమనార్హం. ఒక మాంసవిక్రేతలో పరివర్తన కలిగి, అతను ఆ వృత్తిని విడనాడి, కూరగాయల్ని విక్రయించటం ప్రారంభించాడు. హజ్ యాత్రకు వెళ్ళి వచ్చిన ఒక మహిళ స్వామి ప్రబోధముల స్ఫూర్తితో స్వచ్ఛందంగా ప్రశాంతి నిలయం సేవలలో పాల్గొనటం ప్రారంభించింది.

చివరిగా, కోజికోడ్‌కి చెందిన ప్రముఖ గాయని శ్రీమతి వి.ఎస్. రమ్య 'గాయియే గణపతి జగవందన'తో ప్రారంభించి 'సాయి తేరీ కృపా హోజాయే', 'జై జై మారుతి వీరా' తదితర భక్తిగీతాలను ఆలపించారు.

విజయనగరం జిల్లా భక్తుల పర్తియాత్ర

విజయనగరం జిల్లా బాలవికాస్ బాలలు సాయి యువత సభ్యులతో కలిసి 2019 జులై 7వ తేదీన సాయికుల్వంత్ హాలులో 'ఇలపై ఈశ్వరుడు' నాటికను సమర్పించారు. భగవాన్ బాబావారి అవతరణకు ముందు మాతృశ్రీ ఈశ్వరమ్మగారికి కలిగిన దివ్యానుభవాలు, శ్రీకృష్ణ పరమాత్మ మళ్ళీ ఇలపై అవతరించాడని శ్రీ అరవిందయోగి చేసిన ప్రకటన, ఇతర భక్తుల అనుభవాలు సంభాషణ రూపంలో ఈ నాటికలో చోటుచేసుకున్నాయి.

అంతకుముందు జిల్లా అధ్యక్షులు ప్రసంగిస్తూ, 32 సేవాసమితులు, 181 భజన మండలులతో శ్రీ సత్యసాయి అవతారవైభవం జిల్లాలో విస్తరించిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 84 దివ్యమందిరములు నెలకొన్నాయన్నారు. ముఖ్యంగా గ్రామీణుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని, ఎక్కువమందికి ప్రయోజనం చేకూరే విధంగా శ్రీ సత్యసాయి సేవాసంస్థ విద్య, వైద్య, ఆధ్యాత్మిక, సామాజిక సంక్షేమ రంగాలలో సేవలందిస్తోందన్నారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలలో భాగంగా అన్ని పండుగలూ పర్వదినములతోపాటు; శ్రీ సత్యసాయి బ్రహ్మోత్సవములు, వారానికొకసారి పల్లకీ సేవలు; అధ్యయన మండలులు; సాధనాశిబిరములు; వేదపఠనంలో శిక్షణ; వేదము మరియు భజన వర్క్‌షాప్‌లు మొదలైనవి క్రమం తప్పకుండా నిర్వహించడం జరుగుతోందన్నారు.

ఇక, సేవావిభాగంలో 'సాయిప్రేమామృత పథకం' క్రింద జిల్లాలో ఉన్న 59 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రతి నెల 9వ తారీఖున సుమారు 4 వేలమంది గర్భిణీ స్త్రీలకు ఉచిత భోజన సదుపాయం కల్పిస్తున్నామన్నారు. రహదారులపై ప్రమాదకరమైన మలుపులు ఉన్నచోట్ల 'సేఫ్టీ మిర్రర్స్'ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. నెలకు రెండుసార్లు గ్రామాలలో సంచార వైద్యసేవలు అందిస్తున్నా మన్నారు. గత సంవత్సరం శ్రీకాకుళం జిల్లాలో తిత్లీ తుపాను బాధితులైన 150 కుటుంబాలకు ఒక నెలకు సరిపడా సరుకులు విజయనగరం జిల్లా సాయిసంస్థ

తరపున అందజేయడం జరిగిందన్నారు. ఇవేగాక, బాలవికాస్ కార్యక్రమాలు; సాయియువతచే పధ్నాలుగు పాఠశాలలలో 'విద్యాజ్యోతి' కార్యక్రమాలను కూడా విస్తృత స్థాయిలో నిర్వహించడం జరుగుతోందన్నారు.

ఈ పర్తియాత్రలో 3000 మందికి పైగా భక్తులు పాల్గొన్నారు.

ఆషాఢి ఉత్సవం

ముంబై మెట్రో, మహారాష్ట్ర మరియు గోవాలకు చెందిన 2500 మందికి పైగా భక్తులు స్వామి సన్నిధిలో జరిగిన ఆషాఢి ఉత్సవంలో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. మహారాష్ట్రలో వర్కరీ సంప్రదాయాన్ని పాటించే భక్తులు ఆషాఢ ఏకాదశిని పురస్కరించుకొని పందరీపురానికి చేసే 'దిండీ యాత్ర' ఒరవడిలో వందలాది సాయి భక్తులు ధర్మవరం వేంచేసి, అక్కడినుండి 2019 జులై 9న కాలినడకన బయల్దేరి, పల్లకీ సేవ చేస్తూ, భజన పాటలు పాడుతూ, జులై 11న ప్రశాంతినిలయం చేరుకున్నారు.

ఆరోజు సాయంసమయంలో బాలవికాస్ బాలలు, సాయి యువత సభ్యులు సంయుక్తంగా 'సమర్థ రామదాస్' నాటికను స్వామి సన్నిధిలో ప్రదర్శించారు. వీరు ఛత్రపతి శివాజీ గురువు. ప్రజలందరిలో ఆధ్యాత్మిక జీవితముపట్ల ఆసక్తి పెంపొందించటానికి కృషి చేశారు.

జులై 12వ తేదీ ఉదయం స్వామి సన్నిధిలో మహారాష్ట్ర మరియు గోవా భక్తులు శ్రీ సాయి విఠలుని కీర్తిస్తూ 'దిండీ యాత్ర' ఊరేగింపు నిర్వహించారు. 'జై జై రామకృష్ణ హరి' కీర్తనకు అనుగుణంగా బాలలు నృత్యం చేశారు.

అనంతరం, మహారాష్ట్ర శ్రీ సత్యసాయి సేవాసంస్థల అధ్యక్షులు ఆషాఢ ఏకాదశి ఉత్సవ వైశిష్ట్యాన్ని వివరిస్తూ ప్రసంగించారు.

ఆరోజు సాయంవేళలో వీరు సమర్పించిన AI to SAI సాంస్కృతిక ప్రదర్శనకు వ్యక్తిత్వ వికాసములో బాలవికాస్ పోషిస్తున్న పాత్ర ఇతివృత్తం. తాత్కాలికమైన తృప్తికోసం ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌పై, వాట్సాప్ గ్రూపుల సమాచారముపై విచక్షణారహితముగా ఆధారపడటం తగదనీ; బాలవికాస్ శిక్షణ వ్యక్తిని దివ్యపథంవైపు నడిపించి శాశ్వతమైన సంతృప్తిని కలిగిస్తోందని ఈ ప్రదర్శన సందేశం.

త్యాగరాజ వైభవం

తమిళనాడు బాలవికాస్ బాలలు 2019 జులై 13న భగవాన్ సన్నిధిలో సమర్పించిన సంగీత ప్రధానమైన నాటిక త్యాగరాజ వైభవం. వాగ్గేయకారుడైన త్యాగయ్యకు శ్రీరామునిపై గల అచంచల భక్తివిశ్వాసాలను ఈ నాటిక హృద్యముగా చిత్రీకరించింది. 'నిధి చాల సుఖమా...', 'ఎంత భాగ్యము...', 'రార మా ఇంటిదాక...' కీర్తనలు త్యాగయ్యకు ప్రాపంచిక విషయాలపట్ల గల అనాసక్తికి, శ్రీరామచంద్రునిపట్ల గల అనురక్తికి తార్కాణం.

రష్యన్ క్వయర్

రష్యన్ భాష మాట్లాడే దేశాలకు చెందిన భక్తులు జులై 14వ తేదీ సాయంత్రం 'ప్రేమద్వారా సాయితో ఏకత్వానుభూతి' అనే అంశంపై పలు భక్తిగీతాలను ఆలపించారు. ఈ సంకీర్తనలో 150 మంది పురుషులు, మహిళలు పాల్గొన్నారు. 'నేను నిత్యం దైవాన్ని దర్శిస్తున్నాను', 'జాగృతమైన దివ్యప్రేమ', 'నా జీవితం స్వామి దివ్యహస్తాలలో...' వంటి పవిత్ర భావాలను ఈ పాటలు స్ఫురింపజేశాయి. సంకీర్తనకు ముందు అజర్‌బైజాన్, బెలారస్, జార్జియా, కజాకిస్థాన్, కిర్గిస్థాన్, మాల్డోవా, రష్యా, ఉక్రెయిన్ మరియు ఉజ్బెకిస్థాన్‌లకు చెందిన ప్రతినిధులు వారివారి జాతీయ పతాకాలను ధరించి భిన్నత్వములో ఏకత్వాన్ని చాటుతూ స్వామి సన్నిధిలో కవాతు చేశారు.

నర్సింగ్ విద్యార్థినుల కార్యక్రమం

శ్రీ సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైయర్ మెడికల్ సైన్సెస్, వైట్‌ఫీల్డు (బెంగళూరు) నర్సింగ్ కోర్సు చివరి సంవత్సరం విద్యార్థినులు 2019 జులై 15వ తేదీన ఉదయం భగవాన్ బాబావారికి కృతజ్ఞతాభివందనములతో సమర్పించిన కార్యక్రమములో వారంతా సదా భగవాన్ బాబావారి దివ్యసంరక్షణలో ఉండాలని ప్రార్థించారు. భగవాన్ సందేశాన్ని మానవాళికి చాటాలని ఆకాంక్షిస్తూ సంకీర్తన చేశారు.

లీడర్షిప్ ప్రోగ్రామ్ - స్నాతకోత్సవం

ప్రపంచవ్యాప్తంగా 'యంగ్ అడల్ట్స్'కి భగవాన్ బాబా వారి ప్రబోధముల ఆధారంగా నాయకత్వ శిక్షణ ఇచ్చేందుకై 'శ్రీ సత్యసాయి ఇంటర్నేషనల్ లీడర్షిప్ ప్రోగ్రామ్' 2014లో రూపుదిద్దుకుంది. సమాజసేవల ద్వారా భగవాన్ బాబావారి దివ్యసందేశాన్ని వ్యాప్తిగావిస్తూ, విశ్వవ్యాప్తంగా విలువల పునరుద్ధరణకు పాటుపడే భావితరం నాయకులను తయారు చేయడమే 'లీడర్షిప్ ప్రోగ్రామ్' ప్రాథమిక లక్ష్యం. ఇందులో పట్టభద్రులైనవారు 2019 జులై 15వ తేదీన సాయం సమయంలో భగవాన్ సన్నిధిలో నిర్వహించిన స్నాతకోత్సవంలో శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సభ్యులనుండి పట్టాలను అందుకున్నారు.

2014 - 2018 సం॥ల మధ్య లీడర్షిప్ ప్రోగ్రామ్‌లో శిక్షణ పొందినవారు ప్రశాంతినిలయంలోని సత్సంగ్ హాలులో జులై 12 నుండి జులై 14 వరకు ఒక సింపోజియమ్‌ను నిర్వహించారు. గత నాలుగేళ్ళలో 43 దేశాలకు చెందిన 1200 మంది 'యంగ్ అడల్ట్స్' ఈ లీడర్షిప్ ప్రోగ్రామ్‌లో సుశిక్షితులైనారు.

లీడర్షిప్ ప్రోగ్రామ్ అధ్యక్షులు శ్రీ సాయిప్రభు ప్రేమ్ కుమార్ (అమెరికా) స్నాతకోత్సవ సభలో మాట్లాడుతూ, సంపూర్ణ శరణాగతి భావం మనలను భగవాన్‌కి చేరువ చేస్తుందన్నారు. తాను అవతార దివ్యోద్యమములో ఒక ఉపకరణమును మాత్రమేనని, కర్త భగవాన్ బాబావారే అని స్వీయ అనుభవములద్వారా గ్రహించానన్నారు.

లీడర్షిప్ ప్రోగ్రామ్ 2015 బ్యాచ్‌కి చెందిన మిజ్ ఇరెనా (స్లోవేనియా) ప్రసంగిస్తూ, స్వీయ పరివర్తనలో అంతరాత్మ ప్రబోధముయొక్క ప్రభావాన్ని వివరించారు. వృత్తిపరమైన జీవితములో తనకు సంక్లిష్ట పరిస్థితులెదురైన సందర్భాల్లో హృదయవాసి అయిన భగవాన్ దివ్యవాణిని విని, తదనుగుణముగా నడుచుకున్నానని; ఆ అనుభవం తనకు భగవాన్‌పై గల విశ్వాసాన్ని దృఢతరం చేసిందన్నారు.

వీరి ప్రసంగానంతరం, లీడర్షిప్ ప్రోగ్రామ్‌లో పట్టభద్రులైనవారు ప్రపంచవ్యాప్తంగా చేపట్టిన వివిధ పథకాలపై ఒక డాక్యుమెంటరీని ప్రదర్శించారు. తదుపరి, సంకీర్తన చేశారు.

గురుపూర్ణిమ

ఒక పర్యాయము భగవాన్ బాబావారు శ్రీకృష్ణుని చరితామృతాన్ని భక్తులకు వివరిస్తూ, "బాలకృష్ణుడు గోపికల ఇళ్ళకు వెళ్ళి; పాలు, పెరుగు, వెన్న ఒలకబోసి, అందులో తన పాదములను అద్ది, గోపికలు వచ్చేసరికి వారికి చిక్కకుండా పరుగెత్తేవాడు. గోపికలు ఆ పాద ముద్రలను అనుసరించి బాలకృష్ణుని పట్టుకొనగలిగేవారు. ఈప్రకారం, పాదములను ఆశ్రయిస్తే పరమాత్మను పొందవచ్చు అనే సందేశాన్ని శ్రీకృష్ణుడు నర్మగర్భముగా తెలియజేశాడు" అన్నారు. ఈ కలియుగంలో ఆ దేవదేవుడే శ్రీ సత్యసాయిగా సద్గురు స్థానాన్ని అలంకరించి, గురు చరణాలను ఆశ్రయిస్తే, భవసాగరమును అవలీలగా దాటవచ్చునని ప్రబోధించారు.

దివ్యక్షేత్రమైన పుట్టపర్తిలో సద్గురువు శ్రీ సత్యసాయి నాథునికి ప్రణతులర్పించి, గురుపూర్ణిమ వేడుకలలో పాల్గొనడానికి 2019 జులై 16న వేలాదిగా భక్తులు తరలి వచ్చారు. ఆరోజు ఉదయం విద్యార్థులు కుల్వంత్ హాలులో బ్యాండువాదనను, పంచవాయిద్యమును వినిపించారు. భక్తిగీతాలతో గురువందనమును సమర్పించారు.

అనంతరం, శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సభ్యులు డా॥ వి. మోహన్ మాట్లాడుతూ, ఈ దివ్య సన్నిధానము నుండే భగవాన్ బాబావారు తమ ప్రేమాశీస్సులను కురిపిస్తున్నారని; ప్రశాంతినిలయసందర్శన ప్రాముఖ్యతను అందరూ గ్రహించాలన్నారు. భక్తులు వారి 'ఆధ్యాత్మిక బ్యాటరీల'ను 'రీఛార్జ్' చేసుకోవటానికి పుడమికి ఆధ్యాత్మిక కేంద్రంగా భాసిల్లుతున్న పుట్టపర్తి - ప్రశాంతినిలయమును తరచు సందర్శిస్తూ, శ్రీ సత్యసాయి అవతారోద్యమములో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

డా॥ నరేంద్రనాథ్ రెడ్డి, ఛైర్మన్, శ్రీ సత్యసాయి ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్, ప్రసంగిస్తూ, భగవంతుడే సద్గురువుగా మానవాళిమధ్య సంచరించడం; తమ దర్శన స్పర్శన సంభాషణ భాగ్యములను ప్రసాదించడం పరమాద్భుతమైన సన్నివేశం అన్నారు. భగవాన్ బాబావారి దివ్యరూపము, దివ్యనామము, దివ్యలీలలు మానవాళికి లభించిన మూడు గొప్ప వరములు అన్నారు. భగవానుల

లీలలు, మహిమలు (చమత్కారములు) వ్యక్తులలో సంస్కారమును పెంపొందించి, వారిని పరోపకారములో ప్రవేశపెట్టి, చివరికి ఆత్మసాక్షాత్కారమునకు దారి తీస్తాయన్నారు.

శ్రీ సత్యసాయి సంస్థల జాతీయ అధ్యక్షులు శ్రీ నిమీష్ పాండ్య హృదయాలను పరిపూర్ణంగా భగవాన్ బాబావారికి సమర్పించడానికి మనము సంసిద్ధంగా ఉన్నామా? అని ఎవరిని వారు ప్రశ్నించుకోవాలన్నారు. గురువాజ్ఞను శిరసావహించడం ప్రతి ఒక్కరి తక్షణ కర్తవ్యమన్నారు. భగవాన్ బాబావారి దివ్యసందేశాలను అనుసరించి ఏకాత్మభావాన్ని అలవరచుకోవడానికి భక్తులందరూ కృషి చేయాలన్నారు.

అనంతరం, 'శ్రీ సత్యసాయి విద్యాజ్యోతి' వ్యాసరచన పోటీలలో గెలుపొందినవారికి యోగ్యతాపత్రములను, పతకములను అందజేశారు.

భగవాన్ దివ్య సందేశం

ఆ తరువాత ప్రసారమైన దివ్యోపన్యాసములో భగవాన్ ప్రతి ఒక్కరూ మానవజన్మయొక్క ఉత్కృష్టతను గ్రహించి తదనుగుణముగా వర్తించి జీవితాన్ని సార్థకం చేసుకోవాలన్నారు:

ప్రేమస్వరూపులారా!

దివ్యత్వాన్ని దర్శించాలంటే మనము ప్రత్యేకమైన పరిశ్రమలు చేయనక్కర్లేదు. అహంకార మమకారములు దూరం చేసుకున్నప్పుడే సత్యము మనకు సాక్షాత్కరిస్తుంది. రాగ ద్వేషములే మానవుని ఆవహించిన పెద్ద గ్రహములు. ఈ రాగద్వేషములు నిర్మూలం గావింతుమా, మనకు మనమే బ్రహ్మము. ఏ రోగమునకైనా నివారణకు మందున్నదికాని, ఈ రాగ ద్వేషాలకు మందు లేదు. వీటికి కారణమేమిటి? స్వార్థ స్వప్రయోజనములే!

విద్యార్థులారా! స్వార్థము, స్వప్రయోజనమూ అవసరమే. కానీ, ఒక పరిమితముండాలి. అపరిమితమైన ఆశలవల్లనే మానవ జీవితము అపరిమితమైన దుఃఖాన్ని అనుభవిస్తున్నది. ఏమిటీ ఈ పాంచభౌతికమైన దేహమునకు సుఖము? తినడం సుఖమా? నిద్రించడం సుఖమా? బిడ్డల్ని కనడం సుఖమా? ధనమును సంపాదించడం సుఖమా? లేదు, లేదు. దేనియందూ సుఖము లేదు. ***మాకురు ధన జన యౌవన గర్వం హరతి నిమేషాత్ కాలస్సర్వం...*** *అన్నీ కదలిపోయే మేఘాలవలె పోతున్నాయి. ..లక్ష్యాన్ని పారమార్థికంలో ఉంచుకొని, ప్రకృతిని అనుభవించండి, తప్పు లేదు. మితిమీరిన సుఖములను మనం కోరకూడదు. ఎంతవరకు అవసరమో అంత చాలు! ఊరకే తింటూ కూర్చుంటే అజీర్ణ రోగం ప్రారంభమవుతుంది. తిన్నటువంటిదానిని వదలాలి. తీసుకున్న గాలిని తిరిగి విసర్జించాలి. అదేవిధముగా, సంపాదించిన ధనాన్ని త్యాగం చేయాలి. ఒక దానమో, ఒక ధర్మమో, దీనులకో, దిక్కులేనివారికో దానిని సద్వినియోగం చేయాలి. కనుకనే, మన భారతీయ సంస్కృతి అనాది కాలమునుండికూడను చక్కని పాఠమును చెపుతూ వచ్చింది. "నకర్మణా నప్రజయా ధనేన త్యాగే నైకే అమృతత్వ మానశుః..." కేవలం త్యాగములో ఉంటున్నది అమృతత్వము. త్యాగములో ఉంటున్నది ఆనందము. త్యాగములో ఉంటుండాది అమరత్వము. త్యాగములో ఉన్న ఆనందము మరొకదానిలో లేదు. ఏమిటి త్యాగము చేయాలి? ఇల్లు త్యాగము చేయాలా? ఆస్తిపాస్తులు త్యాగము చేయాలా? కాదు, కాదు, కాదు. భగవంతుడు ఇవేవీ త్యాగం చేయమని చెప్పటం లేదు. దుర్గుణాలను త్యాగం చేయాలి."*

ఆరోజు సాయంవేళ విద్వాన్ కె. సత్యనారాయణగారు తమ సహచరులతో కలసి వివిధ వాయిద్యముల మేళవింపుతో భక్తిసంగీతాన్ని వినిపించారు.

హిమాచల్ ప్రదేశ్ భక్తుల పర్తియాత్ర

2019 జులై 27న స్వామి సన్నిధిలో డా॥ హేమరాజ్ చందేల్ హిందుస్తానీ బాణీలో భక్తిగీతాలను ఆలపించారు. అనంతరం భజన పాటలను పాడారు. సంగీతములో డాక్టరేట్ పట్టా పొందిన డా॥ హేమరాజ్, ఆలిండియా రేడియో గాయకులుగా సుప్రసిద్ధులు.

జులై 28వ తేదీన హిమాచల్ ప్రదేశ్ సాయియువత సభ్యులు శ్రీ సత్యసాయి రుద్రమును, గురుపాదుకా స్తోత్రమును పఠించి, భక్తిగీతాలను పాడారు.

అనంతరం, 'శ్రీ సత్యసాయి విద్యావాహిని' అనుబంధ విద్యాలయమైన శ్రీ సాయి ఎడ్యుకేర్ విద్యాప్రతిష్ఠాన్, ధర్మశాల బాలలు సాంస్కృతిక నృత్యాన్ని ప్రదర్శించారు.

అంతకుముందు 'విద్యావాహిని' డైరెక్టర్ శ్రీమతి కరుణా మున్షీ మాట్లాడుతూ, హిమాలయ పర్వత సానువులలో ఈ విద్యాలయము ఆవిర్భవించినదని చెప్పారు. ప్రారంభములో ఈ విద్యాలయానికి వెళ్ళడానికి సరియైన మార్గముకూడా ఉండేది కాదనీ; వాహనాలు 700 మీటర్ల దూరంలో ఆగిపోవలసివచ్చేదని; ఆ దారి అంతా గులకరాళ్ళతో నిండి ఉండేదని; అటువంటి పరిస్థితులలో విద్యార్థులు, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పూనుకొని ప్రభుత్వమునుండి ఎటువంటి సహాయాన్నీ అర్థించకుండా చక్కని రహదారిని వేశారని చెప్పారు.

ఈ పర్తియాత్రలో 500 మంది భక్తులు పాల్గొన్నారు. ❖

SRI SATHYA SAI GURUKULAM ENGLISH MEDIUM SCHOOL

(A Unit of Sri Sathya Sai Central Trust)

ALCOT GARDENS, RAJAMAHENDRAVARAM-533101, ANDHRA PRADESH

(Affiliated to C.I.S.C.E., New Delhi)

Applications on a plain paper in Candidate's ***own handwriting*** containing complete ***BIO-DATA*** inclusive of the details of the academic particulars, complete postal address, contact numbers and work experience (if any) along with copies of relevant documents and a recent passport size photograph, are invited from the meritorious ***Candidates*** fluent in English for appointment in 'Sri Sathya Sai Gurukulam English Medium School', Rajamahendravaram – 533 101, in the following post. (Total – 1).

1. **TGT (Geography) – 1**

Qualifications Required:

Age: Below 32 years: **Education**: Geography as an elective in Graduation and/ or in Post Graduation preferably with first class and corresponding Bachelor of Education Degree.

Scale of Pay: 14860 - - 39540 + D A and H R A

The last date for the receipt of the applications is **30.09.2019**. Short listed candidates have to appear for an interview at their own expenses at short notice.

CORRESPONDENT

Phone No. : 0883 2430989. Email ID : srisathyasaigurukulam@gmail.com
Cell : 7995675040

Note: 1. The selected candidate will be paid fixed amount per month for a period of 2 years. There after the candidate will be considered for the regular scale of pay.
2. E.P.F. and Gratuity facility are applicable.

చందాదారులకు విజ్ఞప్తి

సత్య ధర్మ శాంతి ప్రేమలద్వారా మానవజాతి సామాజిక నైతిక ఆధ్యాత్మిక అభివృద్ధికి అంకితమైన 'సనాతన సారథి' తొలి సంచికను భగవాన్ బాబావారు 1958 ఫిబ్రవరి 16వ తేదీన ఆవిష్కరిస్తూ, **"నన్ను మీవైపుకు, మిమ్మల్ని నావైపుకు నడిపించగల వారధి సనాతన సారథి"** అని ప్రకటించారు. దీనిని బట్టి భగవాన్ అవతారోద్యమంలో 'సనాతన సారథి'కి నిర్దేశించిన పాత్ర ఎంత ప్రశస్తమైనదో మనము అర్థం చేసుకోవచ్చు. **"నేటినుండి మన 'సనాతన సారథి' పురాతనపు వేద శాస్త్ర ఉపనిషత్తులను సైన్యముతో అన్యాయ, అక్రమ, అసత్య, అనాచారములనబడు అహంకారులను హతమార్చ బయలుదేరినది. ఈ 'సారథి' లోకక్షేమమునకు పోరాడి జయభేరి మ్రోగించి జనుల ఆనందమునకు ఆధారమగుగాక!"** అని భగవాన్ అనుగ్రహించిన దివ్యాశీర్వచన బలంతో 'సనాతన సారథి' గత ఆరు దశాబ్దాలకు పైగా వారి దివ్యసందేశ సౌరభాన్ని దశదిశలా వ్యాప్తిగావిస్తూ, వారి దివ్యాశీస్సుల పరిమళాలను ఇంటింటా వెదజల్లుతూ; సాయిపథంలో పురోగమించేందుకు భక్తపాఠకులకు కరదీపికగా తనవంతు తోడ్పాటునందిస్తున్నది.

అనేక సంవత్సరాలుగా పత్రిక నిర్వహణా వ్యయం క్రమక్రమంగా పెరుగుతూ వచ్చినప్పటికీ తెలుగు, ఇంగ్లీషు పత్రికల వార్షిక చందారుసుమును ఏమాత్రం పెంచకుండా అలాగే కొనసాగించడం జరిగింది. కానీ, ఇటీవలి కాలంలో పేపరు, ప్రింటింగు ధరలు మరియు విదేశాలకు పోస్టేజి ఛార్జీలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో **'సనాతన సారథి' (ఇంగ్లీషు మరియు తెలుగు) మాసపత్రికల వార్షిక చందారేట్లను ఈ క్రింద పేర్కొన్నవిధంగా సవరించడం అనివార్యమైనది.**

భారతదేశంలో : ₹ 90 (తెలుగు పత్రిక వార్షిక చందా); ₹ 120 (ఇంగ్లీషు పత్రిక వార్షిక చందా)

విదేశాలకు : ₹ 900 లేక UK **£ 13 లేక** US $ **18 (తెలుగు పత్రిక వార్షిక చందా);**

₹ 1200 లేక UK **£ 17 లేక** US $ **22 లేక** CAN $ **29 లేక**
AUS $ **31 (ఇంగ్లీషు పత్రిక వార్షిక చందా)**

గమనిక:

1. **క్రొత్త చందారేట్లు 2019 అక్టోబరు 1వ తేదీ నుండి అమలులోకి వస్తాయి.**
2. **ప్రస్తుత చందారేట్లతో 'సనాతన సారథి' సభ్యత్వ రుసుము చెల్లించటానికి చివరి తేదీ**
   ఎ). 2019 సెప్టెంబరు 15వ తేదీ *(మనీయార్డర్లు, చెక్కులు, లేదా బ్యాంకు డ్రాఫ్టులద్వారా)*
   బి). 2019 సెప్టెంబరు 30వ తేదీ *(మా కౌంటర్లలో నేరుగా నగదు చెల్లించడంద్వారా; లేదా, ఆన్‌లైన్ పద్ధతిన మా వెబ్‌సైటు* **www.sanathanasarathi.org** *ద్వారా)*
3. **ఎప్పటిలాగే చందారుసుమును 1 లేదా 2 లేదా 3 సంవత్సరములకు చెల్లించవచ్చును.**
4. **ప్రస్తుత చందాదారులు అదనంగా డబ్బు చెల్లించనవసరం లేదు.**

- కె.ఎస్. రాజన్,
పబ్లిషర్

Poornaavatar Diary 2020

Bhagavan's diary Poornaavatar 2020 is available for sale. The diary has a main article on Bhagavan Sri Sathya Sai Baba, and write-ups on service and Sadhana, as well as a divine message for the youth. There are more than 300 specially selected sayings of Baba on two-colour diary pages.

Specifications: Total pages 376. Size: 14.7x20.6 cm, shrink-wrapped, multi-colour matte laminated cover with gold foiling, art work, spot lamination, knurling and curved stitch-binding; 22 multi-colour pages in art paper including six beautiful photographs of Bhagavan, and centre spreads

Minimum order 5 diaries for addresses within India. Rates given below include packing and postal charges. Each additional diary ₹160/- (unit Price ₹125 + packing + postage).

Diary 2020 code 16325	5 units	6 units	7 units	8 units	9 units - 2 packs	10 units - 2 packs
₹	730	860	990	1115	1275	1435

Calendars 2020

Also available: Attractively designed multi-colour **Calendars 2020** with beautiful photographs of Bhagavan Baba. Book type Calendar has also photos of birds in Puttaparthi.

Code	Rates for single address in India (Cost + Packing + Postage)	Qty.	₹	Qty.	₹
16318	W1 -Wall Calendar 11"x17" 4 sheets 8 pages@ ₹15	5	135	10	215
16319	W2 - Book Type Wall Calendar 11"x22" 7 sheets @ ₹35	5	265	10	445
16320	T1 - Table Calendar 6.5" x 8.75" 8 Sheets @ ₹50	5	320	10	575

Payment: Send draft / Money Order favouring **Sri Sathya Sai Sadhana Trust, Publications Division,** Prasanthi Nilayam 515134 Andhra Pradesh, India. For **Overseas Orders,** please write to the Convener (at the above address) or **email: orders@sssbpt.org Visit www.srisathyasaipublications.com**

REGD. WITH REGISTRAR OF NEWSPAPERS R.NO. 10772/64   REGN.NO. HDP/001/2018-2020
Licenced to post without prepayment No. PMGK/RNP/WPP-01/2018-2020

విద్వాన్ కె. సత్యనారాయణన్ సంగీత కచేరీ

"సమర్థ రామదాసు"

విజయనగరం జిల్లా బాలల నృత్య ప్రదర్శన

త్రికరణశుద్ధియే మానవత్వం

ఈనాటి విద్యావంతులు తప్పుపనులు చేస్తారు. "నేను మానవమాత్రుణ్ణి. ఈ చెడ్డ సంకల్పములు వస్తుంటాయి. ఇది సహజమే కదా" అని సమర్థించుకుంటారు. ఇదే పెద్ద బలహీనత. మానవునికి తప్పు చేయడం సహజం కాదు. సత్ప్రవర్తన, సదాచారములు, సద్గుణములే మానవుని సహజ లక్షణములు. విద్యతోపాటు గుణము ఉండాలి. గుణముతోపాటు ప్రవర్తన బాగుండాలి. మనసులోని యోచన, మాటలోని సూచన, క్రియలోని ఆచరణ- ఈ మూడూ ఏకము కావాలి. ఒక స్పూను పచ్చడిలో ప్రవేశిస్తుంది, సాంబారులో మునుగుతుంది, పాయసంలో కూడా మునుగుతుంది. కాని, ఆయా పదార్థాల రుచి దానికేమైనా తెలుస్తుందా? అదేరీతిగా, మానవుడు తీర్థయాత్రలు చేస్తున్నాడు, సద్గ్రంథాలు చదువుతున్నాడు. కాని, ఏమి ప్రయోజనం? వానిలో జ్ఞానగంధమే లేదు. పుస్తకములోనిది మస్తకములోకి ఎక్కించి, మస్తకమును కూడా ఒక పుస్తకముగా మార్చుకుంటున్నారు. కాని, మస్తకంలోనిది హస్తములో ప్రవేశపెట్టడం లేదు. పుస్తకము, మస్తకము, హస్తము - ఈ మూడింటి ఏకత్వమే మానవత్వం.

\- బాబా

వార్షిక చందా: ₹ 60 (భారతదేశంలో) ₹ 550, లేక $ 13 లేక £ 9 (విదేశాలకు)
చందా రుసుము ఒకటి లేక, రెండు, లేక మూడు సంవత్సరములకు స్వీకరింపబడును.

సనాతన సారథి చందాలు మనీయార్డరుద్వారా, లేక పర్సనల్ చెక్‌ద్వారా, లేక డిమాండ్ డ్రాఫ్ట్‌ద్వారా లేక, ఆన్‌లైన్ పద్ధతిన మా వెబ్‌సైటు **www.sanathanasarathi.org** ద్వారా చెల్లించవచ్చును. చందాలు పంపవలసిన చిరునామా: కన్వీనర్, శ్రీ సత్యసాయి సాధనా ట్రస్టు, పబ్లికేషన్స్ విభాగం, ప్రశాంతి నిలయం - 515134, ఆంధ్రప్రదేశ్.

Printed and published by K.S. Rajan on behalf of the owner Sri Sathya Sai Sadhana Trust, Publications Division, Prasanthi Nilayam - 515134, Ananthapuram district (A.P.) and printed at Sri Sathya Sai Press, within Sri Sathya Sai Ashram premises, Prasanthi Nilayam and published at Prasanthi Nilayam. Editor : V. Srinivasulu